TELUGU VOLUME TWENTY TWO

# The Voice of Truth

# సత్యవాణి

## International


దేవుడున్నాడని నీవు తెలిసికొనగలవు
పేజీ-3

దేవుని దాగలి - దేవుని వాక్యము
పేజీ -15


క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది
పేజీ -24

మనుష్యులు నిద్రించుచుండగా
పేజీ - 46

సత్య సంఘమును గుర్తించుట
పేజీ - 55

అగ్నితో వెడలిపోవుట
పేజీ - 80

క్రైస్తవులు యూదుల కేలండర్‌ను అనుసరించవలెనా?
పేజీ - 90


వోయిస్ ఆఫ్ ట్రూత్ (సత్యవాణి) ఇంటర్నేషనల్

పోస్టుబాక్సు నెం. 80, కాకినాడ - 533 001. ఆం.ప్ర

# THE VOICE OF TRUTH INTERNATIONAL

ఒక్క మాట :

యేసు వారి యొద్దకు వచ్చి పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను"


## STAFF :

***Editor-In-Chief :*** J.C. Choate
***Managing Editor :*** Byron Nichols
***Layout Editor :*** Betty Burton Choate
***Art & Computer Consultant :*** Joshua Gootam
***Promotion :*** Colin McKee, Bobby Tillman, Sudhir Mendiratta, Dale Grissom, Oran Rhodes, Mark Posey Buck Davenport, James Warren, Ken Willis, Dennis Larson, Don Hinds, Charles Salmon
***Associate Editors for Foreign Editions :***
Roger Dickson, South Africa
Sunny David, India
Joshua Gootam
Henry Kong, Singapore
Reuben Emperado, Philippines
Stephen Randall, Australia
Rod Kyle, New Zealand



The Voice of Truth International is published by Churches of Chirst, under the non-profit World Evangelism Foundation, U.S.A.

**వోయిస్ ఆఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్**

***Telugu Edition***
***Managing Editor : Joshua Gootam***
***P.O. Box-80, Kakinada. A.P. - 533 001, India.***


Reader'srequests for articles on particular subjects will be considered. Comments and suggestions regarding the content and appearance of the magazine will be appreciated.


## STAFF WRITERS :

George Akpabli
W.T. Allison
O.P. Baird
Leon Barnes
Wayne Barrier
Roay Beasley
V.P. Black
Maxie B. Boren
T. Pierce Brown
Ron Bryant
Salvador Cariaga
Jack W. Carter
David Chadwell
Frank Chesser
Betty Burton Choate
Jeril Cline
Charles E. Cobb
Glenn Collery
Willard Collins
Owen Cosgrove
Sunny David
Jerry Davidson
Hans Dederscheck
David Deffenbaugh
Clarence Deloach, Jr.
Roger Dickson
Bobby G. Dockery
Earl Edwards
Demar Elam
Reuben Emperado
Garell L. Forehand
Royce Frederick
E. Claude Gardner
R. Gnanasundaram
Mark Hall
Gary C. Hampton
Jack Harriman
Woodson
W. Dauglass Harris
Ray Hawk
Gordon Hogan
Tom Holland
Wayne Jackson
Ancil Jenkins
Dan Jenkins
Jerry Jenkins
Jimmy Jividen
Dayton Keesee
Tom Kelton
Dalton Key
Michael L. King
Mack Lyon
Avon Malone
Cecil May, Jr.
Bill Mc Farland
Don McWhorter
Jane McWhorter
Hollis Miller
Wayne Miller
Tim Nichols
Bill Nicks
Fenter Northern
Don L. Norwood
Basil Overton
Frances Parr
Max Patterson
David Pharr
Harvey Porter
G.F. Raines
Eulene Ramsey
John Thiesen
Betty Tucker
Ken Tyler
Don W. Walker
Tex Williams
Willeam


**THE CHURCHES OF CHRIST SALUTE YOU (Romans 16:16).**

# Voice of Truth Int. Vol - 22

## విషయసూచిక


| | పేజీ |
|---|---|
| **దేవుడు:** | |
| దేవుడున్నాడని నీవు తెలిసికొనగలవు............ | 3 |
| దేవుడు సృష్టికర్త.................................. | 8 |
| దేవునిఘనపరచుట.................................. | 11 |
| దేవునియొక్క ప్రేమ.................................. | 13 |
| **దేవుని వాక్యము-బైబిలు** | |
| దేవుని దాగలి - దేవుని వాక్యము................ | 15 |
| బైబిలుయొక్క సంగ్రహము........................ | 17 |
| మన ప్రశస్తమైన ఆస్థి.............................. | 19 |
| అనుకొనని రీతిగా జరిగెనా? లేక సృష్టియా?.... | 21 |
| మనమేమి చెప్పుదుము?.......................... | 22 |
| **క్రీస్తు-క్రైస్తవ్యము** | |
| క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది?........... | 24 |
| ఆశ్చర్య కరుడైన క్రీస్తు............................ | 28 |
| మధ్యవర్తి, ఉత్తరవాది, ప్రాయశ్చిత్తము............ | 30 |
| నాదేవా, నాదేవా నన్నేల విడనాడితివి............. | 32 |
| క్రీస్తు విభజింపబడి యున్నాడా?.................. | 33 |
| ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలెను.......... | 37 |
| **రక్షణ:** | |
| రక్షణ ఉచిత వరమే అయినను షరతులున్నాయా?... | 39 |
| బాప్తిస్మము యొక్క ప్రయోజనము................. | 41 |

క్రీస్తులో ఆశీర్వాదములు........................ 42
విశ్వాసుల ప్రత్యేకతలు.......................... 44
మనుష్యులు నిద్రించు చుండగా................. 46
మనము మోయవలసిన భారము................ 50
మృతుడవా? లేక సజీవుడవా?.................. 50

**సంఘము-ఆరాధన**

దేవుని ఆలయము................................. 53
సత్య సంఘమును గుర్తించుట.................. 55
ప్రార్థన శక్తి........................................ 60
నా నోటి మాటలు................................ 62
నీ వింకను బాటిల్‌తోనే యున్నావా?............ 65
గోధుమలు-గురుగులు............................ 66
మత సంబంధ చీలికలు.......................... 71
ప్రకృతి సంబంధియైన మనుష్యుడు............ 72
శిష్యుని లక్షణములు............................ 75

**బైబిలు వ్యక్తులు**

బోయజు యొక్క లక్షణములు..................... 77
అగ్నితో వెడలి పోవుట............................ 80
జెకర్యా సరియైన తండ్రి.......................... 82


**ప్రత్యేకాంశములు:**

దూతల యొక్క శక్తి, పరిమితి.................... 84
దేవదూతల తరగతులు లేక స్థాయి............... 87
క్రైస్తవులు యూదుల కేలండర్‌ను అనుసరించాలా? 90
ఎవరి విశ్వాసం గొప్పది?........................ 94

# దేవుడున్నాడని నీవు నిజముగా తెలిసికొనగలవు

**(You can be sure about God)**

**- Billy Bland**



"నీవు నిజముగా సజీవుడగు దేవుని కుమారుడవగు క్రీస్తువని మేము విశ్వసించి యెరిగి యున్నాము" (యోహాను 6:69).

**పరిచయము:**

అనిశ్చయతలతో నిండియున్న లోకములో కొన్ని సంగతులను గూర్చి మనము నిజముగా తెలిసికొనగలమనుట ప్రోత్సాహకరముగా యున్నది. కొన్ని సంగతులను మనము నిజముగా యెరిగి యుండుట అత్యవుసరము. మనదైనందిన జీవితాల్లోకూడా కొన్ని సంగతులను మనం దృఢముగా ఎరిగియుండాలి. ఒకడు తినే ఆహారము ఆరోగ్యకరమైనదని, పుష్టిని కలిగించునదని, విషతుల్యము కాదని దృఢముగా తెలిసికొని యుండాలి. మనం ఖచ్చితముగా దేనిని తెలిసికొనలేమని కొందరు తలుస్తారు. అది అసమంజసము. "మనం నిజముగా దేనిని తెలిసి కొనలేమని యదార్థము నీవు చెప్పగలవా?" యని అట్టివారిని పశ్నించుచున్నాము. అవునని అతడు జవాబిస్తే అట్టి వాని స్థితి అసత్యమైనది. ఏలయనగా ఒకడు తెలిసికొనలేడని అతడెరుగును.

దేనిని గూర్చియైనా తెలిసికొనాలంటే ఒకడు అన్నీ తెలిసికొన నక్కర్లేదనునది ప్రాముఖ్యము. పాలను గుర్తించుటకు నల్లటి ఆవు పచ్చని గడ్డితిని తెల్లటి పాలనెట్లు ఇచ్చునో ఒకడు తెలిసి కోనక్కర్లేదు. అట్లే దేవునిగూర్చి తెలిసి కొనుటకు ఒకడు బైబిలు అంతా ఎరిగి యుండనక్కర్లేదు. ఆయనను గూర్చి, ఆయన వాక్యమును గూర్చి, రక్షణను గూర్చి మనం ఖచ్చితముగా తెలిసికొన గలము.

## దేవుడున్నాడో లేదో తెలిసికొనగలము:

జీవము యొక్క ఉనికిని గూర్చి రెండే రెండు సాధ్యము కావచ్చును. 1). జీవము నిర్జీవ పదార్ధమునుండి కలిగినది లేదా 2). జీవము జీవము నుండే కలిగినది. నిర్జీవ పదార్ధమునుండి జీవ ముద్భవించినదంటే, ఆ నిర్జీవ పదార్ధ మెక్కడ నుండివచ్చినది? నిర్జీవ పదార్ధము నిత్యము వుండునది కాదని శాస్త్రయుక్త మైన రుజువులున్నవి. వస్తువులు అరిగి పోవును, కరిగిపోవును. వాటికొక ఆరంభ మున్నది. అంత ముందును. నిత్యములు కావు.

జీవము జీవమునుండే ఉద్భవించు నని శాస్త్రయుక్తముగా మనమెరుగు దుము. జీవనోత్పత్తి శాస్త్రము (The law of Biogenesis) జీవము నుండి జీవము కలుగునని చెప్పుచున్నది. మానవులు, జంతువులు, వృక్షములు మొదలగునవి మృతమైన పదార్ధమునుండి ఉద్భవింపవు. జీవమున్నదంటే, అంతకు ముందే జీవ ముండాలి. జీవము నుండి జీవము కలుగును గనుక, జీవము ఎల్లప్పుడు ఉండియుండాలి. ఒకప్పుడు జీవములేని సమయముండి యుంటే, ఇప్పుడు జీవము ఉండదు గాని ఇప్పుడు జీవ మున్నది గనుక ఎల్లప్పుడు జీవ మున్నది యని అది నిరూపించు చున్నది. జీవమును మనం ధ్యానించు నప్పుడు, అది ఎల్లప్పుడు ఉండియుండుట మాత్రమే గాక, అది జ్ఞానయుక్తమైన జీవమని కూడ గ్రహించ గలడు. ఉదాహ రణకు ఒకడు మానవ జీవము యొక్క సంక్లిష్టమైన స్థితిని (జీవకణములు, రక్తప్రసరణ, శ్వాస, నిశ్వాసలు మొ॥నవి) గమనించినప్పుడు, వీటన్నిటిని సృజించిన జ్ఞానియైన జీవుడుండెడని గ్రహించు కోగలడు.

జీవము అంతకుముందున్న జీవము నుండి ఉద్భవించుట మాత్రమే గాక, అది దాని జాతిప్రకార ముద్భ వించును. మానవులనుండి ఎల్లప్పుడు మానవులే కలుగుదురు. జీవ నోత్పత్తి సూత్రముపై ప్రతి దంపతులు ఆధార పడియే యుందురు. మానవులు పిల్లులకు, కోతులకు లేదా జంతుజాలము లకు జననమియ్యరు. అట్లే పిల్లులు, కోతులు మొ॥నవి మానవులకు జనన మియ్యవు. అది ఎప్పుడు జరుగ లేదు, ఎన్నడు జరుగదు. ప్రతి జాతి జీవము దాని జాతి ప్రకారము ఉద్భ వించును. ఇదెందు వలన? దానిని సజీవుడైన దేవు డట్లు నియమించి నందు వలన! అందు వలన 'పరిణామము' జెందుట అసాధ్యము! పరిణామ సిద్ధాంతము అబద్ధము!! కుక్కల నుండి మానవులు, మానవుల నుండి కుక్కలు ఎన్నడు ఉద్భ వింపవు.

మానవ, జంతు వృక్ష జాతి జీవము యొక్క ఆరంభమును గూర్చి బైబిలు మనకు జవాబిచ్చుచున్నది. జీవము నుండి జీవము కలుగును గనుక జీవము ఎల్లవేళలా యుండెను. యిది విజ్ఞాన శాస్త్రముతో పరిపూర్ణముగా ఏకీభవించు చున్నది. ఎల్లవేళలా ఉనికి కలిగియుండిన

జ్ఞానరూపియైన జీవము దేవుడు! "పర్వతములు పుట్టక మునుపు, భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగ యుగములకు నీవే దేవుడవు" అని బైబిలు చెప్పుచున్నది (కీర్తన 90:2). దేవుడే సమస్తమును సృజించెనని కూడ బైబిలు చెప్పుచున్నది. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆదికా 1:1). ఆదికాండము మొదటి అధ్యాయాన్ని చదివితే దేవుడు సమస్తాన్ని ఆరుదినములలో సృజించెనని తెలిసి కొనగలరు. ఆయన తన వాక్కును విని యోగించి సమస్తమును సృజించెను. "ఆయన మాట సెలవియ్యగా దాని ప్రకార మాయెను. ఆయన ఆజ్ఞాపించ గానే కార్యము స్థిరపరచబడెను" (కీర్తన 33:9).

సమస్తము దాని దాని జాతి ప్రకారము ఉత్పత్తి జెందునట్లు కూడ దేవుడు జీవరాశులను సృజించెను. "దేవుడు గడ్డిని విత్తనములిచ్చు చెట్లును భూమిమీద తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములు గల ఫలమిచ్చు ఫల వృక్షములను భూమి మొలిపించును గాకని పలుకగా ఆ ప్రకారమాయెను. అది మంచిదని దేవుడు చూచెను" (ఆదికా 1:11-12).

## ప్రతి యింటిని నిర్మించిన వాడు కలడా?

నిర్మానుష్యమైన ఒక ద్వీపము మీద మనం ఒక పాకను కనుగొన్నట్లయితే, దానిని ఎవరో ఒకరు నిర్మించియుండాలి. తాటాకు పాకలు వాటికవే నిర్మించు కోలేవు. గడియారమున్నట్లయితే దానిని తయారుచేసిన వారుంటారు. అదే రీతిగా ఈ ప్రపంచాన్ని నిర్మించిన వారొకడుండి యుండాలి. అందుకే "ప్రతి యిల్లును ఎవడైన యొకని చేత కట్టబడును; సమస్తమును కట్టినవాడు దేవుడే"యని హెబ్రీ పత్రిక లేఖకుడు చెప్పుచున్నాడు (హెబ్రీ 3:4). మనము నివసించుచున్న లోకమును పరిశీలించినట్లయితే, ఆశ్చర్య పడక తప్పదు. ఈ విశ్వములో యున్న గ్రహాలు, నక్షత్రములు, ఈ ప్రపంచము, దాని మహాసముద్రములు, అందున్న జీవరాశులు యివన్నీ పరిశీలించినట్ల యితే అదంతా గొప్ప ఆశ్చర్యము. కీర్తన కారుడిట్లను చున్నాడు: "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచుర పరచుచున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాషలేదు, మాటలు లేవు. వాటిస్వరము వినబడదు. వాటి కొలనూలు భూమి యందంతట వ్యాపించి యున్నది. లోక దిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలు వెళ్లుచున్నవి. వాటిలో ఆయన సూర్యునికి గుడారము వేసెను. అతడు తన అంతః పురములో నుండి బయలు దేరు పెండ్లి కుమారుని వలె ఉన్నాడు. శూరుడు పరుగెత్తనుల్లసించునట్లు తన పథము నందు పరుగెత్తనుల్ల సించుచున్నాడు. అతడు ఆకాశమున ఈ దిక్కునుండి

బయలుదేరి ఆదిక్కు వరకు దానిచుట్టు తిరిగివచ్చుచున్నాడు. అతని వేడిమికి మరుగైనది ఏదియు లేదు'' (కీర్తన 19:1-6).

అపో. పౌలు ఇట్లు చెప్పాడు: "ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్య శక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలు కొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేట పడు చున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు" (రోమా 1:20). ఈ సృష్టిని పరీక్షించి దాని సృష్టికర్త యొకడున్నాడని మనం తెలిసికొన వచ్చును! ఒక యిల్లు దానికదే ఏలాగుకలుగదో అట్లే ఈ ప్రపంచము దానికదే వచ్చిపడలేదు. అది సృష్టింప బడినది!!

## దేవుడెవరు?

ఒకే ఒక్క దేవుడున్నారు. "మనకు ఒక్కడే దేవుడున్నారు. ఆయన తండ్రి, ఆయన నుండి సమస్తమును కలిగెను; ఆయన నిమిత్తము మనమున్నాము'' (I కొరింథీ 8:6). దైవత్వములో ముగ్గురు మూర్తులున్నారు. ఆ ముగ్గురు సర్వ సమానులే. తండ్రియైన దేవుడు (మత్త 6:9), కుమారుడైన దేవుడు (యోహాను 1:1-3), మరియు పరిశుద్ధాత్మ దేవుడు (అపో.కా. 5:3-4).

## దేవుడు సర్వజ్ఞాని:

ఆయన సమస్తమును ఎరుగును. "యెహోవా నీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు, నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సును గ్రహించుచున్నావు. నా నడకను నా పడకను నీవు పరిశీలన చేసి యున్నావు, నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొని యున్నావు. యెహోవా, మాట నా నాలుకకు రాక మునుపే అది నీకు పూర్తిగా తెలిసి యున్నది. వెనుకను ముందును నీవు నన్ను ఆవరించి యున్నావు. నీ చేయి నా మీద ఉంచి యున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది. అది అగోచరము, అది నాకందదు" (కీర్తన 139:1-6).

## దేవుడు సర్వాంతర్యామి:

ఆయన అన్నిచోట్ల ఒకే సమయ మందుండువాడు. "నీ ఆత్మ యొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండు కొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును నీ కుడిచేయి నన్ను పట్టుకొనును. అంధ కారము నన్ను మరుగుచేయును, నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును అని నేననుకొనిన యెడల చీకటియైనను నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును. చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి.'' (కీర్తన 139:7-12).

**దేవుడు సర్వశక్తిమంతుడు:**

"అబ్రాము తొంబది తొమ్మిది యేండ్ల వాడైనప్పుడు యెహోవా అతనికి ప్రత్యక్షమై-నేను సర్వశక్తిగల దేవుడను; నా సన్నిధిలో నడుచుచు నిందా రహితు డవై యుండుము" అని చెప్పెను (ఆదికా 17:1). "యెహోవాకు అసాధ్యమైనది ఏదైన యున్నదా? మీదటికి ఈ కాలమున నిర్ణయకాల మందు నీ యొద్దకు తిరిగి వచ్చెదను. అప్పుడు శారాకు కుమారుడు కలుగు ననెను" (ఆదికా 18:14).

**దేవుడు పరిశుద్ధుడు:**

"నేను పరిశుద్ధుడనైయున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడిన ప్రకారము మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడి యున్నది... మిమ్మును పిలిచిన వాడు పరిశుద్ధుడై యున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తన యందు పరిశుద్ధులై యుండుడి" (I పేతురు 1:14-16).

**దేవుడు ప్రేమయై యున్నాడు:**

"దేవుడు ప్రేమా స్వరూపి; ప్రేమ లేనివాడు దేవుని ఎరుగడు" (I యోహాను 4:8).

**దేవుడు అందరికి సమీపముగా యున్నాడు:**

"జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువై యున్నందున హస్త కృతములైన ఆలయములలో నివ సింపడు. ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు! మరియు యావద్భూమి మీద కాపురముండుటకు ఆయన యొకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించి వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని తన్ను వెదకు నిమిత్తము నిర్ణయ కాలములను వారి నివాసస్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మనమాయన యందు బ్రతుకుచున్నాము, చలించుచున్నాము ఉనికిని కలిగి యున్నాము. అటువలె మనమాయన సంతానమని మీ కవీశ్వరులలో కొందరును చెప్పుచున్నారు. కాబట్టి మనము దేవుని సంతానమై యుండి మనుష్యుల చమత్కార కల్పన వలన మల్చబడిన బంగారము నైనను, వెండి నైనను రాతి నైనను దేవత్వము పోలి యున్నదని తలంప కూడదు" (అపో.కా. 17:24-29).


**దేవుడు దయ గలవాడు:**

ఆయన నాశ్రయించు వానిని ఆయన క్షమించుటకు సిద్ధమనస్సు గలవాడు, దేవుడు. "ప్రభువా నీవు దయాళుడవు, క్షమించుటకు సిద్ధమైన మనస్సు గలవాడవు. నీకు మొఱ్ఱపెట్టు వారందరియెడల కృపాతిశయము గల వాడవు" (కీర్తన 86:5).

– బిల్లీ బ్లేండ్

# దేవుడు సృష్టి కర్త
## (God is Creator)

**- Otis Gatewood**



దేవుడు మన ప్రార్ధనల నాలకించునని, పాపమును ఖండించునని నీతిమంతులను దీవించునని, నిత్య ప్రేమతో ప్రేమించునని గత పాఠములలో మనము నేర్చుకొని యున్నాము. దేవుడు సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, సర్వ జ్ఞానియని, మంచివాడని, దయగల దేవుడని కూడ మనము నేర్చుకొని యున్నాము.

### ప్రకృతి సూత్రములు సార్వభౌములా?

దేవుని యొక్క అన్ని లక్షణములు ఆయన మన రక్షకుడు, విమోచకుడని ప్రకటించుచున్నవి. రక్షణ, విమోచన యనునని దేవుని ప్రజలకు ప్రాముఖ్యమైనవి, భావపూరితమైనవి. అయితే ఆయనే మన సర్వసృష్టి కర్తయని మనం జ్ఞాపకముంచుకోవాలి. అట్లుగాక మనం ప్రకృతి శక్తులనుండి ఉద్భవించామని, కొన్ని అంధకారశక్తుల వలన మనం ఉనికి కలిగి యున్నామని భావించితే దేవుని విమోచనా శక్తియందు నమ్మిక యుంచుటకు ఆధారమేమియులేదు.

ప్రకృతి శక్తుల వలన మన జీవితం గాఢంగా ప్రభావితం చేయబడుచున్నది. తుఫానులు, వరదలు, యుద్ధములు, రోగములు, మరణము మొదలగు

శక్తులపై మన ప్రభావము యేమీ వుండదు. గాని వాటి ప్రభావము మన మీద ఎక్కువగా యుండును. భౌతిక శక్తులపై తేలియాడు ఒక బెండువలె మనమున్నాము. మనం సృష్టింపబపడిన విధానము, భౌతికతత్వము కూడ ఈ భౌతిక ప్రపంచమునుండి వేరు గావింప బడని విధముగా యున్నట్లు సూచించు చున్నవి. చంద్ర నక్షత్రముల యొక్క కదలికలు సయితము మన జీవనముపై ప్రభావము కలిగి యున్నవి. ఈ ప్రకృతి శక్తులు మన జీవితంపై ఇంత ప్రభావము కలిగియున్నందున అవి మన గమ్యముపై ప్రభువులా? అట్లయినచో జీవము యొక్క భావమంటూ యేమీవుండదు ఏలయనగా సమస్త జీవానికి ఆధారమైయున్న వాని యందు నమ్మిక యుంచలేము. మనం అభద్రత స్థితిలోయున్న వారమగుదుము. ఆందోళన చెందుదుము.

## విశ్వాసముకు భద్రతకు దైవసృష్టి అవుసరము

సమస్తానికి ఆది యేమిటి అనే ప్రశ్నకు జవాబును మనం కనుగొనుట అత్యవుసరము. ఈ అవుసరం చాల లోతైనది. మనం ఎక్కడనుండి వచ్చామో మన జీవన గమ్యమేమిటో తెలిసికొనుట అత్యవుసరము. చీకటి శక్తులు దీని నంతటినీ కంట్రోలు చేయుచున్నట్లయితే, మనకు నిరుత్సాహము, నిస్పృహతప్ప వేరే యేదీ లభించదు. భద్రత, భావములు అసాధ్యములైతే మనం ధైర్యాన్ని, నమ్మకాన్ని, విశ్వాస్యతను ఎందుకు కలిగి యుండాలి? మనలను సృజించిన వాడు ప్రకృతి శక్తులను కంట్రోలు చేయు చున్నాడని, తద్వారా విజయం సాధ్యమే యని మనం తెలిసికోవాలి.

## సృష్టి వలన దేవుని అనుగ్రహము నిజమగుచున్నది

సమస్తమును సృజించి వాటిని నడుపుచున్న సార్వభౌమునియందు విశ్వాసము కలిగియుండుట ప్రాముఖ్యము. అట్టి విశ్వాసము సజీవుడైన దేవుడే మనలను ప్రేమించి ఏలుచున్నాడు గాని అంధకారశక్తులు కాదని మనకు రుజువు చేయ యత్నించు చున్నవి. ఆయన ఈ విశ్వాన్నంతటినీ సృజించారు గనుక దాని నంతటిని ఆయన కంట్రోలు చేయు చున్నారు. ఆయన సర్వశక్తిని మనం గమనించి ఆయనే దేవుడని నిజముగా మనము నమ్మగలము. సృష్టి దేవుని యొక్క విశిష్ట క్రియ. అది ఆయన ప్రత్యేకత.

అందును బట్టి ఆయన దేవుడై యున్నారు. సృష్టికర్తయైన దేవుని యందలి విశ్వాసము వలన దేవుని అనుగ్రహము మనకు యదార్థమగును. దేవుడు మన సృష్టి కర్తయైనందున ఆయన సర్వశ్రేష్టుడు, దేవుడు, సార్వభౌముడు, దేవుడు!

## సృష్టికర్తయైన దేవుని వలన విమోచన సాధ్యమాయెను

విమోచన విషయంలో క్రైస్తవులు క్రీస్తు ద్వారా కలుగు విమోచనను గూర్చి ఆసక్తి కలిగియుండుట సహజమే. దేవుడు ఆదిలో సృష్టికర్త గనుక సువార్త, రక్షణ సంకల్పము, దేవుని విమోచనశక్తి, యను వాటిని మరింత పూర్ణముగా గ్రహించు



కొన వీలుపడును. అందువలన దేవుడు తన ప్రేమను కాపుదలను ప్రకటించునపుడు, భూమ్యాకాశముల సృష్టి కర్త ఆ మాటలను చెప్పుచున్నట్లు తరుచు ప్రకటించును. ఆయన యందు మనము నమ్మిక కలిగి యుండుటకు అట్టి నిర్ధారణ అవుసరమని దేవుడెరుగును. పరిశుద్ధ లేఖనములు ఇట్లనుచున్నవి :

"ప్రభువా, మాదేవా నీవు సమస్తమును సృష్టించితివి, నీ చిత్తమును బట్టి అవి యుండెను. దానిని బట్టియే సృష్టింప బడెను గనుక నీవే మహిమ ఘనత ప్రభావములు పొందనర్హుడవు" (ప్రక 4:11).

"సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు" (యోహాను 1:3).

"గర్భమునుండి నిన్ను నిర్మించిన నీ విమోచకుడగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు-యెహోవానగు నేనే సమస్తమును జరిగించువాడను''. (యెషయా 44:24).

"నీకు తెలియలేదా? నీవు వినలేదా? భూదిగంతములను సృజించిన యెహోవా నిత్యుడగు దేవుడు. ఆయన సొమ్మసిల్లడు అలయడు. ఆయన జ్ఞానమును శోధించుట అసాధ్యము" (యెష 40:28). సర్వమును ఆయన యందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను" (కొలస్స 1:17-18).

"ఆయన మూలమునను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి" (రోమా 11:36).

**- ఓటిస్ గేట్వుడ్**

# దేవుని ఘన పరచుట

## (Honouring God)

**- John Waddey**

పిల్లలు తమ తలిదండ్రులను ఘన పరచవలెను (ద్వితీ 5:10). దాసులు తమ యజమానులను ఘన పరచవలెను (మలాకీ 1:6). క్రైస్తవులు దేవుని, ఆయన కుమారుడైన క్రీస్తును ఘన పరచవలెను (యోహాను 5:23). "ఘనతా ప్రభావ ములు ఆయన సన్నిధిని ఉన్నవి'' (I దినవృ 16:27).

దేవునిని ఆయన నామమును గౌరవించుట ద్వారా ఆయనను మనం ఘనపరచుదుము. ఆయన నామమును వ్యర్థముగా నుచ్చరింప కూడదు (నిర్గమ 20:7). ఆయన చిత్తమునకు యిష్ట పూర్వకముగా లోబడుటద్వారా దేవుని మనం ఘనపరచుదుము (నిర్గమ 19:5). దేవునియొక్క నీతినియమములను, వాక్యమును, ఆయన సంఘమును కడు జాగ్రత్తతో గమనించిన యెడల మనం దేవుని ఘన పరచుదుము. మన కుటుం బమును బంధు మిత్రులను దేవుని చిత్తమునకు లోబడునట్లు నడిపించుట ద్వారా మనం దేవుని ఘనపరచుదుము. "ఒకడు నన్ను సేవించిన యెడల నన్ను వెంబడింప వలెను అప్పుడు నేను ఎక్కడ ఉందునో అక్కడ నా సేవకుడును ఉండును; ఒకడు నన్ను సేవించిన యెడల నా తండ్రి అతని ఘనపరచును'' అని యేసు చెప్పారు (యోహాను 12:26).

దేవుడు చెప్పిన రీతిగా ఆయనను ఆరాధించిన యెడల మనం దేవుని ఘనపరచుదుము. "నీ బలుల చేత, నన్ను ఘనపరచలేదు'' నైవేద్యములు చేయవలెనని నేను నిన్ను బలవంత పెట్టలేదు. ధూపము వేయవలెనని నేను నిన్ను విసికింపలేదు అని దేవుడు ఇశ్రాయే లీయులను గద్దించారు (యెషయా 43:23). "నీ రాబడి అంతటిలో ప్రధమ ఫలమును నీ ఆస్థిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘన పరచుము'' అని సొలొమోను బోధించాడు (సామె 3:9). దేవునికి స్తుతిగీతములు పాడుట ద్వారా దేవుని మనం ఘనపరతుము. "నీ కీర్తి తోను నీ ప్రభావ వర్ణనలోను దిన మంతయు నానోరునిండి యున్నదని'' దావీదు పలికాడు (కీర్తన 71:8). పరలోక మందలి సమూహముతో కలిసి, "నీవే మహిమ ఘనత ప్రభావములు పొంద నర్హుడవని" మనం దేవుని స్తుతించాలి (ప్రక 14:11). యెహోవా దేవుని ఘన పరచు రీతిగా మన క్రియలు ప్రవర్తన ఎల్లవేళలా యుండాలి. అపొ.పౌలు ఇట్లు చెప్పాడు: "ఎవడైనను వీటిలో చేరక తన్ను తాను పవిత్ర పరచు కొనిన యెడల వాడు పరిశుద్ధ పరచబడి యజమానుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యము

నకు సిద్ధపరచబడి ఘనత నిమిత్తమైన పాత్రయై యుండును" (2 తిమో 2:21).


మలాకీ కాలములో దేవుడు ఇశ్రాయేలీయులకిట్లు చెప్పారు: "కుమారుడు తన తండ్రిని ఘనపరచును గదా, దాసుడు తన యజమానుని ఘనపరచును గదా, నా నామమును నిర్లక్ష్య పెట్టు యాజకులారా, నేను తండ్రినైతే నాకు రావలసిన ఘనత ఏమాయెను? నేను యజమానుడనైతే నాకు భయపడువాడెక్కడ ఉన్నాడు? అని సైన్యముల కధిపతియగు యెహోవా మిమ్మును అడుగు చున్నాడు" (మలాకీ 1:6). దేవునికి మనమిచ్చు ఘనత యదార్థముగా యుండవలెనని ఆయన కోరుచున్నారు. "ప్రభువు ఈలాగు సెలవిచ్చి యున్నారు-ఈ ప్రజలు నోటి మాటతో నా యొద్దకు వచ్చు చున్నారు, పెదవులతో నన్ను ఘన పరచుచున్నారు గాని తమహృదయమును నాకు దూరము చేసికొని యున్నారు. వారు నా యెడల చూపు భయభక్తులు మానవుల విధులను బట్టి వారు నేర్చు కొనినవి" (యెషయా 29:13).

దేవుడు మానవుని చేసినప్పుడు దేవదూతల కంటె కొంచెము తక్కువ వానిగ అతని చేసెను. మరియు మహిమా ప్రభావములను అతనికి కిరీటముగ ధరింపజేసెను (కీర్తన 8:5). దేవుని మనము ఘనపరచినప్పుడు ఆయన మనలను ఘనపరచును. "నన్ను ఘన పరచు వారిని నేను ఘనపరచుదును, నన్ను తృణీకరించు వారు తృణీకార మొందుదురు" (I సమూ 2:30).

"ఎవని గర్వము వానిని తగ్గించును. వినయ మనస్కుడు ఘనత నొందును" (సామె 29:23). మనము గౌరవప్రదమైన జీవితము జీవించాలని ఆయన కోరు చున్నారు. అట్టివారిని మనం ఘన పరచాలి. "యెహోవా యందు భయ భక్తులు గలవారిని సన్మానించుము" (కీర్తన 15:4).

ఆయన ననుసరించుటకు మనకు మాదిరి యేమీ లేదని చెప్పేవారిని గూర్చి దేవుడెట్లు తలంచును? ఆయన మనకు ఒక మాదిరి యుంచి వెళ్లారు (2 తిమో 1:13). సహోదరుల మధ్య వివాదములు రేపు వారిని గూర్చి దేవుడెట్లు తలంచును? అట్టివారిని ఆయన అసహ్యించుకొనును (సామెతలు 6:16-19). నీవు దేవునిచే ఘనపరచ బడాలంటే, ఆయనను ఘన పరచుము. ఆయనను ఘనపరచు వారిని ఆయన ఘనపరచును, తిరస్కరించు వారిని ఆయన తృణీకరించును (I సమూ 2:30).

- జాన్‌వాడీ



# దేవుని యొక్క ప్రేమ
## (The Love of God)

**- Allan E.Flaxman**

"దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా5:8).

నరకమును బైబిలు చాల ఘోరముగా వర్ణించుచున్నది. నరకము కటిక చీకటిగల ప్రదేశము. అది అగ్ని గుండము. అక్కడ ఏడ్పును, వేదనయు పండ్లు కొరుకుటయు ఉండును. నరకములో యున్నవారు భూమిమీద ఉండగా వారు మరచిపోవాలనుకొన్న సంగతులన్నియు జ్ఞాపకము చేసికొందురు. ఉదా: వారిని క్రైస్తవులుగా చేయ ప్రయత్నించిన వారిని, ఆ సమయాన్ని గుర్తుకు తెచ్చుకొందురు. నరకము నిత్యము వుండును. దానికి అంతము లేదు.

సువార్తకు లోబడుట ద్వారా నీవు నరకమును తప్పించుకొనగలవు. గాని ఒకసారి నరకములో ప్రవేశించినవాడు దానిని తప్పించుకొనజాలడు. అది ఏమంత సుందర దృశ్యముకాదు. యుగముల తరబడి యున్న ప్రజలకు హెచ్చరికగా దేవుడు నరకమును గూర్చి మనకు కావలసినంత హెచ్చరిక ఇచ్చియున్నారు (మత్తయి 13:42-50; 18:8,9; 8:12; యూదా 13; లూకా 16:27-31; మత్తయి 25:32; 2 థెస్స 1:8).

పాపక్షమాపణ పొందని వారందరు చివరకు నరకము చేరుకొందురు (రోమా 6:23). అయితే పాపమనగా నేమి? అనే ప్రశ్న మనకు రావచ్చును. మరల నరకములాంటి ఘోర ప్రదేశాన్ని తయారు చేసారంటే పాపమును గూర్చి దేవుడు ఎట్లు తలంచుచున్నారు?

పాపము యెడల దేవుని స్వభావము యేమీక్రొత్తది కాదు. ఆదిలో ఏదెను వనములో దేవుడు ఆదాము హవ్వలకు మంచి చెడ్డల తెలివి నిచ్చు చెట్టు యొక్క ఫలమును గూర్చి తెలియ జేసారు. ఆ ఫలమును తిను దినమున నిశ్చయముగా చచ్చెదరని ఆయన వారిని హెచ్చరించారు. వేలాది సంవత్సరములు గతించినా దేవుని ఈ మాటలో మార్పు లేదు.

తదుపరి దేవుడు ఏవాగ్దానము చేసినా దానిని తప్పక నెరవేరుస్తారు. నోవహు కాలములో నోవహు కుటుంబ సభ్యులగు ఎనిమిది మంది తప్ప, భూమిపై నున్న వారందరు జలప్రళయములో మునిగి నశించిరి. ఎందువలన? పాపమువలన. పాత నిబంధన అంతటిలోను, క్రీస్తు వచ్చువరకు కూడ ఇదే సంగతి మనకు గోచరమగును. (ఆది.కా.

2:17; 6:1-8-14).

క్రొత్త నిబంధన కూడ పాపమును గూర్చి దేవుని తీవ్ర ఉగ్రతను బయలు పరచుచున్నది. "ఆజ్ఞాతిక్రమమే పాపము" అని అది చెప్పుచున్నది (I యోహాను 3:4; రోమా 4:15). "మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును" అని కూడ అది చెప్పుచున్నది (యాకో 4:17).

ఇది మనలను ఆలోచింప చేయనిచ్చుచున్నది గదా? పాపము ఎంత ఘోరమైనది? పాపము పాపమైనట్లున్నదియని క్రొత్త నిబంధన చెప్పుచున్నది (రోమా 7:13). జంతుబలుల రక్తము పాపములను తీసివేయుట అసాధ్యమని కూడ అది చెప్పుచున్నది (హెబ్రీ 10:4).

అయితే పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు ఈ లోకమునకు వచ్చెనని క్రొత్త నిబంధన బోధించుచున్నది (I తిమో 1:15). "ఏలయనగా దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారుని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).

ఈ విషయములో దేవుడు వెనుకంజవేసారా? నరకమును గూర్చి ఆయన పునరాలోచించుకున్నారా? కానేకాదు. ఈలోక రక్షకునిగా యేసు అవతరించుట అంతా ముందుగానే సంకల్పించబడెను. జగత్తు పునాది వేయబడకముందే అది సంకల్పించ బడెను. (ఎఫెసీ 1:4; I పేతురు 1:18-20; ప్రకటన 13:8). దేవుని ప్రేమ ఎంత ఆశ్చర్యకరమైనది! ఎంత వింతయైనది! పాపపరిహారార్థమై తన ఏకైక కుమారుని బలియిచ్చుట ఎంత ఆశ్చర్యము!

యిది హెబ్రీ పత్రికలో చెప్పబడిన మరొక తలంపునకు మనలను నడిపించును. అది యిట్లు చెప్పుచున్నది: "ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించిన యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీద కనికరింపకుండ వాని చంపించుదురు. ఇట్లుండగా దేవుని కుమారుని పాదములతో త్రొక్కి తాను పరిశుద్ధపరచబడుకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించిన వాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును?" (హెబ్రీ 10:28-29). అందుకే "జీవము గల దేవుని చేతిలో పడుట భయంకరము" అని మనకు హెచ్చరిక ఈయబడినది (హెబ్రీ 10:30-31).

అవును పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). మనం ఊహించిన దానికంటె పాపము చాల ఘోరమైనది. మనమింకను పాపులమై యుండగానే దేవుడు మనందరిని ప్రేమించారు (రోమా 5:8).

-ఎలెన్ ఫ్లాక్స్‌మన్

# దేవుని దాగలి - దేవుని వాక్యము


## (God's Anvil - God's word)

**- Randolph Bonas**

### బైబిలు దేవుని దాగలియైయున్నది.

మనము దాగలిగి గమనించిన యెడల అది అరుగదు, మన్నిక గలది, కలకాలము స్థిరముగా యుండును. అట్లే దేవుని వాక్యమైన బైబిలు కూడా. అది గతాన్ని సహించి నిలిచినది. ప్రస్తుతము నిలిచియున్నది, భవిష్యత్తులో కూడ ఎన్ని సమ్మెటలు ప్రయోగించినను అది నిలిచి యుండును. "ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలిచియుండును" అని అందుకే పేతురు చెప్పాడు (I పేతురు 1:24). బైబిలును వ్యతిరేకించుట కుప యోగించునది ఏమైనను సుత్తె వంటిదే. అవి నాస్థికులు, నిర్దేవులు, అబద్ధ బోధకులు వంటివారు కావచ్చును. క్రీస్తుకు విరోధులైన వారందరు దేవుని వాక్యమైన దాగలిపై ప్రయోగించే సుత్తె, సమ్మెటల వంటివారే.

దాగలివలె దేవుని వాక్యము దానిపై ప్రయోగించు అస్త్రము లన్నిటిని ఎట్లు తట్టుకొనుచున్నదో గమనించుము. బైబిలును నాశనము చేయుటకు నిజముగా మానవునికి శక్తి చాలదు."మన దేవుని వాక్యము నిత్యము నిలుచును" (యెషయా 40:8). "ఆకాశమును భూమియు గతించునుగాని నా మాటలు ఎన్నటికిని గతింపవు" అని యేసు చెప్పెను (మత్తయి 24:35). ప్రభువు మరల తిరిగివచ్చినప్పుడు కూడ మానవు



లకు తీర్పు తీర్చుటకు దేవుని వాక్యము అక్కడ యుండును. "నన్ను నిరాకరించి నా మాటలు అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్య దినమందు వానికి తీర్పుతీర్చును" (యోహాను 12:48).

### దేవుని ప్రజలు దాగలి వంటివారు:

దేవుని ప్రజల హృదయములలో దేవుని వాక్యము హత్తుకొనియున్న యెడల వారు దేవుని దాగలి వంటి వారగుదురని గమనించుము."నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీవాక్యము ఉంచుకొనియున్నాను" అని కీర్తనకారుడు చెప్పాడు (కీర్తన 119:11)."నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచి యుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింప బడును" అని యేసు ప్రభువు చెప్పారు (యోహాను 15:7).

దేవుని వాక్యము మన హృదయములో నిలిచియున్న యెడల, మనము స్థిరులుగాయుండి ఈలోక సంబంధమైన

శోధనలను తట్టుకొన గలము. "మరణ మైనను జీవమైనను దేవదూత లైనను, ప్రభువులైనను, ఉన్నవి యైనను రాబోవు నవియైనను అధికారు లైనను ఎత్తయి నను, లోతైనను, సృష్టింప బడిన మరియే దైనను మన ప్రభువైన క్రీస్తు యేసు నందలి దేవుని ప్రేమనుండి మన లను ఎడబాప నేరవని రూఢిగా నమ్ము చున్నాను" (రోమా 8:38-39).

మనము ఆయన చేసిన పనియై యున్నాము (ఎఫెసీ 2:10). అపవాదిని ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు సర్వాంగ కవచమును ధరించుకొందుము (ఎఫెసీ 6:13).

**క్రీస్తు సంఘము దాగలియైయున్నది:**

క్రీస్తు సంఘ సభ్యులు ఐక్యతతో నిలువబడియున్న యెడల వారు దాగలి వలె యుందురు. యేసుక్రీస్తు అను పునాది మీద నిర్మించబడిన సజీవ సంస్థ క్రీస్తు సంఘము. "వేయబడినది తప్ప వేరొక పునాది ఎవడును వేయ నేరడు, ఈ పునాది యేసుక్రీస్తే". సజీవమైన రాళ్లతో, క్రైస్తవులతో సంఘము కట్టబడి యున్నది. "మీరును సజీవమైన రాళ్లవలె యుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్ట బడుచున్నారు" (I పేతురు 2:5).

సంఘము సజీవమై "సత్యమునకు స్థంభమును దాని ఆధారమునైయున్నది." (I తిమో 3:15). సంఘారంభ దినాల్లో గొప్ప హింస కలిగినను సంఘము గొప్ప శక్తితో వ్యాప్తిచెందెను. అది మూడువేల మందితో మొదట ఆరంభమాయెను (అపొ.కా. 2:41). స్వల్పకాలములోనే 5 వేలమంది చేర్చబడిరి (అపొ.కా. 4:4), ఇంకా కొద్దికాలములోనే వారి సంఖ్య గొప్పగా అభివృద్ధి జెందెను (అపొ.కా. 6:7).

క్రీస్తు సంఘము నిత్యము నిలుచును (దానియేలు 2:44). "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని" యేసు వాగ్దానము చేసెను (మత్తయి 16:18). క్రీస్తు స్థాపించిన సంఘము ఎంత ఆశ్చర్య కరమైన దాగలియో!

**ఈ వర్తమానము ప్రతితరము వారికి ప్రకటింపబడవలెను:**

దేవుని వాక్యము అనుగ్రహించు శక్తిని బట్టి మనము చేయవలసిన రెండు సంగతులున్నవి.

మొదటిగా మనము బైబిలుతో నిలిచి యుండాలి. దానిని బోధించాలి, దాని ప్రకారము జీవించాలి.

రెండవదిగా, మన బిడ్డలకు సత్య వాక్యమును సరిగా బోధించాలి. తద్వారా ఒక తరము నుండి మరొక తరముకు సత్యము ఉపదేశించబడ్తాది. మన ప్రభువు మరల వచ్చువరకు ప్రతి తరమునకు వాక్యము బోధించబడాలి.


కాలమును సద్వినియోగము చేసి కొనాలి. సమయమును పోగొట్టుకొన కూడదు. అందరికీ వాక్యము బోధింప బడాలి. దేవుని వాక్యములో మనము నిల కడగా యుండగలము. వాక్యము లేని యెడల నిలబడలేము, స్థిరముగా యుండ లేము.

**- రాండల్ఫ్ బోనాస్**

# బైబిలు యొక్క సంగ్రహము

## (A Summary of the Bible)

**-Franklin Camp**



మనము చదువుచున్న బైబిలు సాధారణమైన గ్రంథము కాదు. దానిని సరిగ చదివి అవలంబించిన యెడల అది యిప్పుడును, నిత్యమును మనకు మేలు చేయును. సరిగ చదువక, పాటించని యెడల ఒకడు తన ఆత్మను కోల్పోవును.

బైబిలు ప్రతివాని గ్రంథము. అదొక ప్రత్యేక ప్రజలకు మాత్రమే చెందినది కాదు. బైబిలు అందరికి చెంది నది మాత్రమేగాక, అది సామాన్యుని కొరకు వ్రాయబడినది. విద్యావేత్తలు దానిని చదువవచ్చును. అయితే విద్యా వేత్తల నుద్దేశించి అది వ్రాయబడలేదు.

బైబిలుకు మించి ఎవడు ఎదుగడు. దానిని చదివే కొలది ఒకడు లోతుగా, ఎత్తుగా ఎదుగును. దానిని చదువుట ద్వారా ఒకడు నిత్యత్వమును పరికించ గలడు. పరిశుద్ధాత్మావేశము యొక్క రుజువులు దాని ప్రతిపేజీలోను గోచర మగును. ఒకడు బైబిలు విద్యార్థి అయితేనే గాని ప్రయోజన కారియగు క్రైస్తవుడు కాజాలడు. అందువలననే లేఖనములను సరిగ విభజించాలని పౌలు తిమోతిని హెచ్చరించాడు. లేఖనములను ఒకడు సరిగ నేర్చుకుంటే అతడు సిగ్గుపడ జాలడు.

ప్రపంచములో యున్న అత్యంత శ్రేష్టమైన గ్రంథము బైబిలు. అది సులువు గానే లభ్యమగుచున్నది. మరియే గ్రంథము నందు కనబడని సత్యమును ఒకడు దానిలో కనుగొనును.

బైబిలు మాత్రమే దేవుని గూర్చి,

లోకమును గూర్చి, మానవుని గూర్చి, పాపము రక్షణ, ప్రస్తుత జీవితం, రాబోవు జీవితములను గూర్చి బైబిలు ఒక్కటి మాత్రమే మనకు సంతృప్తికరమైన వివరణ యిచ్చును.

బైబిలు మానవుని తప్పిదములను అంగీకరించుచున్నది. అతని బలహీనతలను గూర్చి ఓరిమి కలిగి యున్నది మరియు అతని సద్గుణములు, నిరీక్షణను గూర్చి నిష్కపటముగా యున్నది.

బైబిలును కలిగియుంటే గొప్ప ధనము కలిగియున్నట్లే. దానిని చదివి, తెలిసికొని, నమ్ముకొనుటయే జీవము. బైబిలును పఠించుట జ్ఞానము, దానికి లోబడుట గొప్ప బలము.

బైబిలును తెలిసికొని దానిని సరిగ ఉపదేశించ గలిగితే మనుష్యుడు గొప్ప సంగతిని సాధించినయట్లే. ఒకడు ఇంగ్లీషు, ఖగోళశాస్త్రము, సాహిత్యము, సంగీతము, వేదాంతము మొ॥నవి తెలిసికొనియుండ వచ్చును. అయితే అతడు బైబిలును తెలిసికొనకపోతే వీటన్నిటియొక్క సరియైన సంబంధమును తెలియజేసే పాఠ్యాంశమును విడిచినట్లగును. జీవితము యొక్క విశిష్టతను బైబిలు ఒక్కటి మాత్రవే తెలియజేయును.

బైబిలును తెలిసికొన యత్నించువాడు దానిలోని ప్రతి పుస్తకమును ఒకదాని తరువాత మరొక దానిని చదువును, అందులోని వ్యక్తులను పరిచయము చేసికొనును, దాని బోధలను తెలిసి కొనును. దాని అంశములను పఠించును, పాటించును. యిది ఒకని బ్రదుకంతా నింపు కృషి.

సత్యవాక్యమును సరిగ విభజించడం కంటే శ్రేష్ఠమైన పని యేమీ లేదు. బైబిలు గ్రంధమును చదివి దానిని సరిగ ఉపదేశించువాడు ఈ లోకమునకు గొప్ప మేలు చేయుచున్నాడు. అందు వలననే పౌలు తిమోతిని బైబిలు సరిగ చదువ మన్నాడు, ఉపదేశించ మన్నాడు; దేవుని యెదుట యోగ్యునిగా కనబడు లాగున గ్రంథమును సరిగ చదువ మన్నాడు.

బైబిలు ఒక అద్దము లాంటిది. దానిలో మనలను మనమే చూచుకొనగలము. మనకవుసరమగు శక్తిని అందలి ఆహారము మనకొనగును. మన మార్గములో చూపు వెలుగు అది. పగుల గొట్టుటకు నిర్మించుటకు అది సుత్తి, పోరాడుటకు, సంరక్షించుకొనుటకు ఖడ్గము, నాటుటకు, పెరుగుటకు విత్తనము, మన ప్రతిఫలమును సంపాదించుకొను గమ్యము.

జీవితంలో ప్రతి అనుభవానికి ఒక వచనము బైబిలులో యున్నది. మనం దరము బైబిలును శ్రద్ధగా చదువులాగున తప్పక ప్రయత్నించాలి. నిజజీవితాన్ని బైబిలు ద్వారా కనుగొనాలి.

– ఫ్రాంక్లిన్ కేంప్

# మన ప్రశస్తమైన ఆస్థి

## (Our Precious Possession)

**- Jamie L. Henry**



మా యింట్లో బైబిలు చాల కాలంగా యున్నది. అది మాకు చాల ప్రాముఖ్యము. మీ యింట్లో కూడ మీకు ప్రత్యేకమైన బైబిలు ఉండి యుండ వచ్చును. అయితే బైబిలు యొక్క ప్రతిని తమ యింట్లోలేని చాల కుటుంబా లున్నాయని నీకుతెలుసా? రష్యానుండి వచ్చిన ఒక మిషనరీ, ఆ దేశంలో ఎముకలు కొరికే చలిలో బైబిలు కొరకు గంటల తరబడి నిలువబడుదురని ఒకసారి చెప్పాడు. ఒక ముసలావిడ బైబిలు కొరకు అనేక గంటలు నిల బడినా, తన వంతు వచ్చే సరికి బైబిళ్ళన్నీ అమ్ముడు పోయాయి! ఆవిడ చాల నిరుత్సాహ పడింది. ఏడుస్తూ అక్కడే ఉండిపోయింది. ఆరోజు ఆమె మనుమ రాలి జన్మదినం. ఆమెకు ఒక బైబిలు బహుమతిగా ఇవ్వాలని ఆమె కోరింది. గాని అది దొరుకలేదు.

అయితే అనేక క్రైస్తవ గృహాల్లో ఒకటికంటె ఎక్కువ బైబిళ్లుండ వచ్చును. అదెంత ప్రాముఖ్యమైన, ప్రశస్తమైన ఆస్థియో వారెరుగక పోవచ్చును. సరిగదా బైబిలును మన చేతిలో ఉంచడానికి ఎంతమంది తమ ప్రాణాలర్పించారో కూడ మనకు తెలియకపోవచ్చును.

అనేక సంవత్సరాల వరకు కేథ లిక్కుల స్వాములు మాత్రమే బైబిలు చదువగలిగేవారు. క్రీ॥శ 1380లో జాన్ విక్లిఫ్ అనునతడు లాటిన్ భాషలో యున్న బైబిలును ఇంగ్లీషులోనికి తర్జుమా చేయు టకు సాహసించాడు. అతడు తర్జుమా చేయగా 27 ప్రతులు మాత్రమే తయారై నవి. బైబిలు అంతటిని చేవ్రాతతో చూచి వ్రాయడానికి ఎంత సమయం పట్టి యుండునో ఆలోచించ గలవా?

తదుపరి 1525లో విలియం టిండేల్ అనునతడు ఇంగ్లాండ్ నుండి హాలెండ్ దేశము పారిపోయి బైబిలును ఇంగ్లీషులోనికి తర్జుమా చేసి గూటెన్‌బర్గు ద్వారా తయారుచేయబడిన అచ్చు యంత్రం మీద అనేక కాపీలను ముద్రించాడు. ఈ బైబిళ్లు ధాన్యపు బస్తాలలో రహస్యముగా ఇంగ్లాండు దేశము లోనికి తరలించబడేవి. ఆ రోజుల్లో ప్రజలు బైబిలు చదువరాదని కేథలిక్కు సంఘము నిషేధించినది. అయితే కేథలిక్కుల సంఘము 1200 కాపీలను కొని ప్రజలు చదువ కుండునట్లు వాటిని నాశనం చేసేసింది. తర్జుమా చేసిన విలియం టిండేల్‌ను కొయ్యకు కట్టి కాల్చి వేయించింది. విలియం టిండేల్ చనిపోతూ, "దేవా ఇంగ్లాండు చక్రవర్తి యొక్క నేత్రములు తెరువుము" అని ప్రార్థించుచు ప్రాణము విడిచాడు.

చివరిగా హెన్రీVIII అను చక్రవర్తి తన భార్యకు విడాకులు యిచ్చు నిమిత్తము కేథలిక్కు సంఘమును వీడి ఆంగ్లికన్ చర్చిని (Church of England) స్థాపించాడు. తదుపరి విలియం టిండేల్ యొక్క మిత్రుడగు మైల్స్‌కోవర్డేల్ అనునతనిని బైబిలును తర్జుమా నిమిత్తము నియమించాడు. 1539లో మొట్టమొదటి ఇంగ్లీష్ ఆథరైజ్డ్ బైబిలు విడుదల చేయబడింది. కేథలిక్కు సంఘమయితే కొవర్డేల్ యొక్క పనిని, అతనిని నాశనము చేయ ప్రయత్నించినది.

మన చేతిలో బైబిలు ఉండుటకు ఎంత శ్రమ, ఎన్ని ప్రాణాలు అర్పించబడెనో గ్రహించు సరికి మనకు ఆశ్చర్యం కలుగ వచ్చును. ఆదివారం చర్చికి మాత్రమే పట్టుకెళ్లే గ్రంథము మాత్రము అది కాదు. అది నమ్ము ప్రతివానిని రక్షించుటకు దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). అది మనలను నిత్యము సంతోష పెట్టగలదు. ఆ గ్రంథములో దేవుని మాటలున్నవి (2 తిమో 3:16). మన కుటుంబాలు నడువవలసిన మార్గమును అది మనకు చూపించును.

మనం ఒకరి కొరకు ఒకరు ప్రార్థించాలని బైబిలు చెప్పుచున్నది (యాకోబు 5:16). మనం భోజనం చేసేటప్పుడు కూడ ప్రార్థించాలి. రోగులను, అనాథలను రక్షించాలని బైబిలు చెప్పుచున్నది (I పేతురు 4:9). మనకు కలిగిన దానిని ఇతరులతో పంచుకొనాలని బైబిలు మనకు బోధించుచున్నది (అపొ.కా. 2:45).

దేవుని గ్రంథమునుండి ఇవియే గాక అనేక మంచి సంగతులను మనం నేర్చుకొనవచ్చును. గనుక మన యింట్లో వున్న బైబిలును నిర్లక్ష్యం చేయరాదు. బైబిలును చదువుట ద్వారా మనం దేవునికి మరింత దగ్గరగా చేరుకోగలము. పాత నిబంధనలోని యెహోషువా వలె, మీరు "ఎవరిని సేవించెదరో మీరు కోరుకొనుడి; మీరెవరిని సేవింప కోరుకొనినను, నేనును నా యింటి వారును యెహోవాను సేవించెదమని" మనం చెప్పగలగాలి!! (యెహోషు 24:15).

– జేమీ హెన్రీ

# అనుకొనని రీతిగా జరిగెనా? లేక సృష్టియా?

**(Coincidence or creation?)**

**- Foy E. Wallace, Jr.**

ఈ భూమి అనుకొనని రీతిగా కలిగెనా లేక సృష్టింపబడెనా? యను దానిని గూర్చి నీవు సంశయించుచున్న యెడల భూమిని గూర్చి, దాని వాతావరణము, మిగతా గ్రహాలతో దానికిగల సంబంధము మొదలగు వాటిని గూర్చి దిగువ ఈయబడిన వాస్తవములను గమనించుము.

భూమధ్యరేఖ దగ్గర భూమి తన ఇరుసుపై గంటకు వెయ్యిమైళ్ల వేగముతో తిరుగును. అట్లుగాక అది వంద మైళ్ల వేగముతో చలించిన యెడల పగలు, రాత్రులు పదిరెట్లు ఎక్కువ వ్యవధి గలవి యగును. తద్వారా భూమిపైనున్న మొక్కలు, వృక్షములన్నియు కాలిపోవును. ఎండయొక్క తీవ్రత వలన కాలిపోవును, రాత్రి యొక్క దీర్ఘకాలము వలన ఘనీభవించిపోవును.

వెలుగునకాధారమైన సూర్యుని ఉపరితలముపై 12,000 డిగ్రీల ఫారన్‌హైట్ ఉష్ణోగ్రత యుండును. దాని ఉష్ణోగ్రతను సమతలముగా అనుభవించుటకు భూమి దానికి సరియైన దూరములో యున్నది. సూర్యుని నుండి తక్కువ రేడియేషన్ కలిగిన యెడల మనందరం ఘనీభవించిపోదుము; ఎక్కువ కలిగిన యెడల మాడిపోవుదుము.

భూమి తన ఇరుసుపై 23 డిగ్రీలకు వంగియున్నది. అదిఅట్లు కాకపోయినచో, భూమిపైనున్న ఆవిరివలన ఖండము లన్నియు మంచు గడ్డలవలె ఘనీభవించి పోవును.

చంద్రుడు భూమికి దగ్గరగా యున్నయెడల రోజుకు రెండుసార్లు కెరటాల ఉధృతివలన భూమి మునిగి పోవుచు యుండును. మరియు పర్వతములు క్షీణించిపోవును. భూమి యొక్క ఉపరితలము ఇంకొక 10 అడుగుల మందము గలదియైతే, ప్రాణ వాయువు యేమీలేక, అన్ని జీవరాశులు నాశనమగును.

భూవాతావరణము ఇప్పుడున్న దానికంటే పలుచగాయుంటే తోక చుక్కలు, ఉల్కలు భూమిపై పడి భూమి అంతయు తగులబడుచుయుండును.

దీనియంతటిని బట్టి భూమి, దానిపైనున్న దంతయు దేవునిచే సృష్టింపబడెననియు, చట్టప్రకారము అది చలించుచున్నదనియు గ్రహించుకొన గలము. అది ఒక అకస్మిక సంఘటన వలన అనుకొనని రీతిగా సంభవింప లేదు.


– ఫోయ్ వేలెస్

# మన మేమి చెప్పుదుము?

**(What shall we speak?)**

**- Owen D. Olbricht**

దేవుని వాక్యము ధైర్యముతో బోధింపబడెనని అపొస్తుల కార్యముల గ్రంథము చెప్పుచున్నది(అపో.కా. 4:31). యేసు శిష్యులు ఎక్కడికి వెళ్లినా (అపో.కా. 8:4), సమరయలోను (అపో.కా. 8:25), మిగతా దేశాలలోను ధైర్యముగా వాక్య మును ప్రకటించిరి (అపో.కా. 11:19; 13:5, 46; 14:25; 15:35-36; 16:32; 17:13: 18:11; 19:10). పౌలు ఎక్కడికి వెళ్లినా దేవుని వాక్యమును, లేఖనములను తర్కించుచు యుండేవాడు (అపో.కా. 17:2). వాక్యము యొక్క ప్రాముఖ్యతను అపొస్తలుడు గ్రహించాడు. అపొస్తలులు ఆహారమును పంచిపెట్టు టకు గాక, దేవుని వాక్యమును ప్రక టించుట కొరకు నిశ్చయించుకొనిరి (అపో.కా. 6:2-4).



## వాక్యమును ఎందుకు ప్రకటించాలి?

మన రక్షణార్ధమైన దేవుని వాక్యమును మనము ప్రకటించాలి (ఎఫెసీ 1:13; రోమా 1:16). ఏలయనగా దానివలన ప్రజలు రక్షణా ర్థమైన జ్ఞానము పొందగలరు (2తిమో 3:15) అపో.కా. 13:26). ఈ జీవమును గూర్చిన మాటలను బోధింప వలెనని దేవుని దూత అపొస్తలులకు చెప్పెను (అపో.కా. 5:20). అన్యజనులు రక్షింపబడాలంటే యేమీ చేయవలెనో అపో. పేతురు మొట్టమొదట వారికి తెలియ జేసెను (అపో.కా. 11:4).

## వాక్యమునకు స్పందన

యోగ్యమైన మంచి మనస్సు గలవారు వాక్యము నంగీకరించిరి (అపో.కా. 17:11), గాని సత్యమునకు విముఖులైనవారు దాని నిరాకరించిరి (అపో.కా. 13:46; 28:26-27).

దేవుని వాక్యము నంగీకరించిన వారు దానిని విశ్వసించిరి (అపో.కా. 4:4; 17:11-12), బాప్తిస్మము పొందిరి (అపో.కా. 2:41; 8:12; 18:8). అపొస్తలుల కార్యముల గ్రంథములోని మాదిరి యేమనగా వాక్యము ప్రకటింప బడినప్పుడు, దాని నంగీకరించిన వారు

తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. పెంతెకొస్తునాడు వాక్యము నంగీకరించినవారు (అపొ.కా. 2:38-41), సమరయవారు (అపొ.కా. 8:12,13), ఇతియోపేయ ఘనుడు (అపొ.కా. 8:25-39), మొట్టమొదటి క్రైస్తవులైన అన్యులు (అపొ.కా. 10:47-48; 11:1), లూదియ (16:14-15), ఫిలిప్పియి చెరసాల అధిపతి (అపొ.కా. 16:32-35), కొరింథులో మార్పుజెందిన వారు (అపొ.కా. 18:8) అట్లే చేసిరి.

వాక్యమును విని విశ్వసించి బాప్తిస్మము పొందినవారిని గూర్చి చెబుతు వారు వాక్యము నంగీకరించిరియని చెప్పబడెను (అపొ.కా. 2:41; 8:14; 11:1) గాని వారు యేసును తమ స్వంత రక్షకునిగా అంగీకరించిరియని చెప్పబడ లేదు. వారు పాపియొక్క ప్రార్ధన చేసి నట్లును, పరిశుద్ధాత్మను పొందినట్లును ఎక్కడ చెప్పబడలేదు.

**ముగింపు**

పైన చెప్పబడిన వాస్తవములను బట్టి మనం దిగువ రీతిగా సంగ్రహించ వచ్చును.

1. లేఖనములను గౌరవించాలి, వాటిని బోధించాలి (2 తిమో 4:2)

2. దేవుని వాక్యము నంగీకరించిన వారిని అది రక్షించును.

3. వాక్యమును వినిన తరువాత బాప్తిస్మము పొంది క్రీస్తుకొరకు జీవించ నిశ్చయించుకొనుట మంచి స్పందనయై యున్నది.

4. వాక్యము నంగీకరించిన వారు తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి.

5. యేసు నామమును విని విశ్వ సించి ఆయనకు లోబడిన వారికి, ఆయన రాజ్యములో చేర్చబడినవారికి రక్షణ కలుగును (అపొ.కా. 8:4-5, 12).

6. సమరయులు, అన్యులు కూడ వాక్యము నంగీకరించిరి (అపొ.కా. 11:1).

7. వాక్యము నంగీకరించినవారు బాప్తిస్మము పొందిరియని పెంతెకొస్తు నాడు యేసునామమున పాప క్షమాపణ ప్రకటింపగా స్పందించిన వారిని గూర్చి చెప్పబడెను (మార్కు 16:15-16; లూకా 24:47).

8. వాక్యమును బోధించని బోధకులు నేడు ప్రజలు రక్షణ పొంద కుండా ఆటంకపరచువారు.

9. వాక్యమును ప్రకటింపని యెడల యేసుమాటలకు అవిధేయత చూపుటయే.

10. నిన్న, నేడు కూడ రక్షింప బడాలంటే దేవుని వాక్యము నంగీక రించాలి. ఈ యుగాంతము వరకు అట్లే జరుగును.


– ఓవెన్ ఆల్బ్రిక్ట్

# క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది?

## (What Think ye of Christ?)

## మత్తయి 22:42

**- Leroy Brownlow**



**1. ఈప్రశ్న ప్రాముఖ్యమైనది:**

అది విశ్వాసము యొక్క మూల రాయి (యెష 28:16; ఎఫెసీ 2:20), మరియు అది ఈలోక నిరీక్షణ (Iతిమో 1:1).

మనుష్యుడు క్రీస్తును గూర్చి యేమి యోచించునో దానిపై అతని ఆత్మయొక్క నిత్యగమ్యము నిర్ణయించబడును (యోహాను 8:24; మత్త 10:32, 33).

ఈ ప్రశ్నను గూర్చి మానవుడు ఉదాసీనత కలిగి యుండకూడదు. క్రీస్తును నిరాకరించువారు కూడా ఆయనను గూర్చిన పరిశోధనను తెలిసికోవాలి. బుద్ధుని గూర్చిగాని, మహమ్మదును గూర్చిగాని ఎవరైనా చెబితే ప్రజలు సాధారణంగా కలవరపడరు. గాని క్రీస్తును గూర్చి చెప్పగానే కొందరు వెంటనే కలవరపడతారు. ఈ వ్యత్యాసం ఎందుకు? కారణం యేమంటే ప్రజలు బుద్ధుని గూర్చిగాని, మహమ్మదును గూర్చిగాని భయపడరు. అయితే యేసు తాను చెప్పినట్లు దేవుని కుమారుడై యుండ వచ్చునేమో యని ఆయనను గూర్చి భయపడుదురు. ఇంతకూ, ఆయన ఎవరి కుమారుడు?

**2. పరిసయ్యులు ఆయన దావీదు కుమారుడని జవాబిచ్చారు:**

"ఒకప్పుడు పరిసయ్యులు కూడి రాగా యేసువారిని చూచి క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు ఆయన దావీదు కుమారుడని చెప్పిరి" (మత్త 22:41-42).

యేసు శరీరమును బట్టి దావీదు కుమారుడే (రోమా 1:7). ఆయన తల్లి మానవ మాత్రురాలు గనుక ఆయన మనుష్య కుమారుడు (మత్త 16:13). తన తల్లి దరపున ఆయన మనుష్యుడు. క్రీస్తు శరీరము దాల్చిన దేవుడు. ఆయన శరీర ధారియై మనమధ్య నివసించెను (యోహాను1:14). ఆయనలో దైవత్వము, మానవత్వము రెండు పరి పూర్ణముగా యున్నందున మన విమోచ కునిగాను, మధ్యవర్తిగాను యుండుటకు తగిన వాడాయెను (I తిమో 2:5,6), మనుష్య కుమారుని వలె క్రీస్తు శోధించ బడెను (మత్త 4:1-11). ఆయన ఆకలి గొనెను (మత్త 4:2), దప్పిగొనెను (యోహా 19:28) వేదననుభవించెను (లూకా 22:44), ప్రార్థించు అవుసరత కలిగి యుండెను (మత్త 26:36).

## 3. ఆయన దేవుని ఏకైక కుమారుడు :

క్రీస్తు దావీదు కుమారుడని పరి సయ్యులు ఇచ్చిన జవాబు సత్యమే, గాని అది పరిపూర్ణ సత్యముకాదు. క్రీస్తు కేవలము దావీదు కుమారుడే అయితే దావీదు ఆయనను నా ప్రభువని ఆత్మ వలన ఏల చెప్పుచున్నాడని యేసు ఆ పరిసయ్యులను అడిగెను. దావీదు ఆయనను ప్రభువని చెప్పిన యెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగునని వారినడుగగా ఎవడును మారు మాట చెప్పలేక పోయెను (మత్త 24:45-46). కీర్తన 110:1, అపో.కా. 2:34,35 కూడ చూడండి. దావీదు కంటే ముందునుండే నేనున్నందున నేను దావీదు కుమారుని కంటే ఉన్నతుడనని క్రీస్తుయొక్క వాదన. అది నిజం. క్రీస్తు లేని కాలం అంటూ యేమీ లేదు (యోహాను 1:1; 8:58). ఆయన అల్ఫాయుఓమేగయు అనగా ఆదియు అంతమునై యున్నారు (ప్రక 1:8). కాలము ఆరంభము కాక ముందు నుండే క్రీస్తు వుండెను. కాలాంతము తరువాత కూడ ఆయన యుండును.

క్రీస్తు దేవునియొక్క అద్వితీయ కుమారుడు. పరిశుద్ధాత్మ శక్తివలన ఆయన కన్యకు జన్మించెను (లూకా 1:26-35). దేవుని కుమారుడుగా తన తండ్రి వలె ఆయన దేవుడు. ఆయన ఇమ్మానుయేలని పిలువబడెను, అనగా దేవుడు మనకు తోడని అర్థము (మత్త 1:23). ఆయన శరీరావతారములో యున్న దేవుడు. "ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతి పరుడని తీర్పు నొందెను. దేవ దూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మ బడెను, ఆరోహణుడై తేజోమయు డయ్యెను" (I తిమో 3:16). అందు వల

ననే నన్నుచూచిన వాడు తండ్రిని చూచి యున్నాడని ఆయన చెప్పగలిగెను (యోహాను 14:9). ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును ఆయన తత్వము యొక్క మూర్తి మంతమునై యున్నాడు (హెబ్రీ 1:3).

## 4. ఆయన దేవుని కుమారుడని అంగీకరించబడెను:

దేవుడే యేసు తన కుమారుడని అంగీకరించెను, మత్త 3:16, 17; 17:1-5.

ఆయన శిష్యులు కూడ ఆయన దేవుని కుమారుడని ఒప్పుకొనిరి (మత్త 14:33), దయ్యములు (మత్త 8:29), సైనికులు (మత్త 27:54), చివరకు సాతాను కూడ ఆయన దేవుని కుమారు డని ఒప్పుకొనెను (మత్త 4:3).

## 5. ఆయన బోధలే ఆయన దైవత్వాన్ని రుజువు చేయుచున్నాయి

"ఆయన అధికారముగల వానివలె వారికి బోధించెను" (మత్త 7:29). ఆయన అధికార యుక్తమైన దైవవాక్కులు మానవులనుండి ఆయనను ప్రత్యేక పరచినవి. ఆయన గతాన్ని గూర్చి, భవిష్యత్తును గూర్చి కూడ ఖచ్చితముగా మాట్లాడెను. ఆయన రెండవ రాకడ రాత్రివేళ, పగటివేళ కూడ వచ్చునని ఆయన చెప్పెను (లూకా 17:31,34). భూమి గుండ్రముగా యున్నందున ఒకే సమయమందు యిది సాధ్యమగును. ఆయన దేవుడు గనుక భూమి యొక్క వర్తులాకారమును గూర్చి ఎరుగును.

ఆయన మానవుని ఆంతర్యమును గూర్చి ఎరిగినవాడు గనుక ఆయన దేవుడని రుజువగుచున్నది (యోహాను 2:25; 4:29). ఆయన మాట్లాడినట్లు ఏ మానవుడు ఎన్నడు మాట్లాడలేదు (యోహాను 7:46).

## 6. క్రీస్తుయొక్క పనులే ఆయన దేవుని కుమారుడని రుజువు చేయు చున్నవి

ఆయన చేయుచున్న పనులను బట్టి ఆయన యందు విశ్వాసముంచ వలెనని ఆయన చెప్పెను (యోహాను 10:37-38). ఆయన చేసిన అద్భుత ములు ఆయన దేవుని కుమారుడని రుజువు చేయుచున్నవి.

ప్రకృతి శక్తులపై ఆయనకు శక్తియుండెను. ఆయన గాలిని సముద్ర మును నిమ్మళించెను (మత్త 8:23-27), నీళ్లమీద నడిచెను (మత్త 14: 24-33), నీళ్లను ద్రాక్షారసముగ మార్చెను (యోహాను 2:7-11)

ఆయనకు రోగములపై శక్తి యుండెను. శతాధిపతియొక్క దాసుని ఆయన స్వస్థపరచెను (మత్త 8:5-13) పన్నెండు సంవత్సరముల నుండి రక్త స్రావముతో బాధపడుచున్న స్త్రీని ఆయన స్వస్థపరచెను (మత్త 9:20-22).

చివరికి మరణము కూడ ఆయనకు లోబడెను. నాలుగు దినముల మట్టుకు



చనిపోయిన లాజరును ఆయన బ్రదికించెను. (యోహాను 11:43-44). ఆయన చేసిన అద్భుతములను గూర్చి చదువుటవలన, లేక వినుటవలన మనకు విశ్వాసము కలుగునట్లు అవి కొన్ని వ్రాయబడెను (యోహాను 20:30-31). గనుక బైబిలులో క్రీస్తును గూర్చియున్న రికార్డు నమ్మదగినదా?

**7. బైబిలు రికార్డు ఖచ్చితం:**

బైబిలులో యున్న రికార్డు కల్పితం కాదు. వారు చూచారు, విన్నారు, యేసును తాకారు (I యోహాను 1:1). లేఖకులు యదార్థవంతులు. క్రీస్తు కొరకు తమ ప్రాణముల నర్పించారు. వారి కంటే యదార్థవంతులైన లేఖకులు చరిత్రలో కన్పడరు. బైబిలు యదార్థం కాకపోతే, చరిత్రలో యేదీ నమ్మదగినది కాదు.

క్రీ॥శ 2014 అంటే అర్థం యేమిటి? అంటే క్రీస్తు వచ్చి ఇప్పటికి 2014 సంవత్సరములైనదన్నమాట! క్రీస్తు యొక్క ఆగనమును బట్టి చరిత్ర లెక్కింపబడుచున్నది. ప్రతి ఆదివారమున ప్రపంచమందంతటా లక్షలాది ప్రజలు ఆరాధనకు కూడుకొనుచున్నారంటే దాని అర్థం యేమిటి? మానవచరిత్రలో నాలుగువేల సంవత్సరముల మట్టుకు ఆదివారమునకు ప్రాముఖ్యత యేదీలేదు. గాని క్రీస్తుయొక్క పునరుత్థానం అంతా మార్చి వేసింది. యేసు ఆదివారమున మృతులలోనుండి లేచారు. అందువలన ఆ దినమునకు అంత ప్రాముఖ్యత యిప్పుడు. మరియు అది ప్రభువు దినమని పిలువబడుచున్నది (ప్రక 1:10).

చరిత్రకారులు కూడ యేసు దేవుడని నిర్ధారించారు. అట్టి వారిలో జోసిఫస్ అనునొకడు ముఖ్యుడు.


ఆయన మన ప్రభువు. ఆయన దేవుని కుమారుడు, దేవుడు! ఆయనకు "మహిమయు, ప్రభావమును యుగయుగములు కలుగునుగాక, ఆమేన్" (ప్రక 1:6).

– లీరోయ్ బ్రౌన్లో

# ఆశ్చర్యకరుడైన క్రీస్తు

## (Christ is Amazing)

**- Joshua Gootam**



యేసు ప్రభువు ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు.

ఆయన బాలుడుగా యున్నప్పుడే యోసేపును ఆయన తల్లియు ఆయనను గూర్చి చెప్పబడిన మాటలను విని ఆశ్చర్య పడిరి (లూకా 2:33).

ఆయన 12 ఏండ్ల వాడైనప్పుడు దేవాలయములో బోధకుల మధ్య కూర్చుండి ప్రశ్నలు వేయుటయు, జవాబులు చెప్పుటయు చూచి, వినిన వారందరు ఆయన ప్రజ్ఞకు విస్మయ మొందిరి (లూకా 2:48).

ఆయన తన స్వగ్రామమందున్న సమాజ మందిరములో యున్నవారందరు ఆయన నోటనుండి వచ్చిన దయగల మాటలకు ఆశ్చర్యపడిరి (లూకా 4:22).

యేసు దేవాలయములో బోధించు చుండగా యూదులు అందుకు ఆశ్చర్య పడి, చదువుకొనని ఇతనికి ఈ పాండిత్య మెట్లు వచ్చెనని చెప్పుకొనిరి (యోహాను 7:15).

యేసు రూపాంతరము పొందినప్పు డాయనతో యున్న శిష్యులు మిగుల భయపడి విభ్రాంతి నొందిరి (మార్కు 9:2-8), ఆయన చేయుచున్న బోధను విన్నవారును, జన సమూహమంతయును



మిగుల విభ్రాంతినొంది ఆయునకు వందనము చేసిరి (మార్కు 9:14-15, మత్తయి 12:23; యోహాను 7:21).

యేసు వలన మూగవారు మాట లాడుటయును, అంగహీనులు బాగు పడుటయును, కుంటివారు నడుచుట యును, గ్రుడ్డివారు చూచుటయును జన సమూహము చూచి ఆశ్చర్యపడి ఇశ్రా యేలు దేవుని మహిమపరచిరి" (మత్తయి 15:31).

యేసు ప్రభువు ఒక అంజూరపు చెట్టును శపించగా తక్షణమే ఆ అంజూ రపు చెట్టు ఎండిపోయెను. శిష్యులది చూచి అశ్చర్యపడి అంజూరపు చెట్టు ఎంత త్వరగా ఎండిపోయెనని చెప్పు కొనిరి (మత్తయి 21: 19-20).

ఆయన ఒక సమరయు స్త్రీతో సంభాషించుట చూచి శిష్యులు ఆశ్చర్య పడిరి (యోహాను 4:27).

వారు ప్రకృతి ఆయన మాటకు లోబడుట చూచి విస్మయమొందిరి. వారు ఆశ్చర్యపడి-ఈయన ఎట్టివాడో, ఈయ నకు గాలియు సముద్రమును లోబడు చున్నావని చెప్పుకొనిరి (మత్తయి 8:27).

ఆయన బోధవిన్నవారు"అందరును విస్మయమొంది, ఇదేమిటో? యిది క్రొత్తబోధగా యున్నదే" యని ఆశ్చర్య పడిరి (మార్కు 1:27).

పునరుత్థానుడైన ఆయన శరీర మును చూచి శిష్యులు ఆశ్చర్యముతో భయాక్రాంతులైరి (లూకా 24:36-41).

ఆయన శత్రువులు ఆయన మాటలు విని ఆశ్చర్యపడిరి (మత్త 22:22).

రోమా గవర్నయిన పిలాతు ఆయన ఒక్కమాట యైనను పలుక కుండుట చూచి మిక్కిలి ఆశ్చర్యపడెను (మత్తయి 27:14).

ఆయనను సిలువ చేసిన వారు సయితము జరిగినది చూచి "ఈ మను ష్యుడు నిజముగా నీతిమంతుడై యుండె నని చెప్పి" దేవుని మహిమ పరచిరి (లూకా 23:47).

- జాషువా గూటం



# మధ్యవర్తి, ఉత్తరవాది, ప్రాయశ్చిత్తము

## (Mediator, Advocate, Propitiation)

- Cecial May, Jr.



### యేసు మన మధ్య వర్తి:

విడిపోయిన ఇరు పక్షాలను కలుపు వాడు మధ్యవర్తి. అతడు తటస్థుడు. ఇరు పక్షాలను బాగుగా ఎరిగినవాడు. దేవునికి మానవునికి మధ్యవర్తిగా యుండ తగిన వాడు యేసుక్రీస్తు ఒక్కడే. "దేవుడొక్కడే. దేవునికి మానవునికి మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయే సనునరుడు" (I తిమోతి 2:5).

దేవుని కుమారునిగా, మనుష్య కుమారునిగా మరెవరు లేని స్థానములో యేసు వున్నారు. దేవునిగా దేవుని చూస్తు ఆయన పరిపూర్ణుడు పాపము లేనివాడు (యోహాను 10:30; 2 కొరింథీ 5:21). అయినను ఆయన దుఃఖాక్రాంతుడును, బాధింపబడినవాడును ఆయెను (యెషయా 53:3). ఆయన మనవలె అన్ని విషయములలో శోధింపబడినను పాపము లేనివాడుగా యుండెను (హెబ్రీ 4:15). "కావున ప్రజల పాపములకు పరిహారము కలుగజేయుటకై దేవుని సంబంధమైన కార్యములలో కనికరమును నమ్మకమును గల ప్రధాన యాజకుడగు నిమిత్తము అన్ని విషయములలో తన సహోదరులవంటివాడు కావలసి వచ్చెను" (హెబ్రీ 2:17). అట్టి మధ్యవర్తిని కలిగి యుండుట ఎంత ఆశ్చర్యము!

### యేసు మన ఉత్తరవాది:


ఉత్తరవాది, అనగా న్యాయవాది. ఉత్తరవాది న్యాయస్థానములో మరొకరి దరపున వాదించును. అపొస్తలుడైన యోహాను ఇట్లు వ్రాసాడు: "నా చిన్న పిల్లలారా, మీరు పాపము చేయ కుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మన కున్నాడు" (I యోహాను 2:1). ఉత్తరవాది అనగా ఆదరణ కర్తయని కూడ మనము గ్రహించుకొనగలము. పరిశుద్ధాత్ముడు ఆదరణ కర్తయని చెప్పబడినది (యోహాను 14:16). మన మధ్యవర్తి దేవునికిని మానవునికిని మధ్యయుండి, మన పక్షమున విజ్ఞాపన చేయుట ఎంత ఆశ్చర్యకరము!

### యేసు మన ప్రాయశ్చిత్తము

"ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు. మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకు శాంతికరమై యున్నాడు" (I యోహాను 2:2). ప్రాయశ్చిత్తములేక శాంతికరమనగా ఒకరికి బదులు ఇంకొకరు బలిగా అర్పించబడుట. దేవుని న్యాయపీఠము ఎదుట మనము అపరాధులముగా నిలబడియున్నాము. మనకొక మధ్యవర్తి అవసరము. మనకొక ఉత్తర వాది అవుసరము. మనం అపరాధులము, దేవుడు యదార్ధవంతుడు గనుక మనకు అంతకంటే ఎక్కువ అవుసరము. మన మధ్యవర్తి, మన ఉత్తరవాది మనకు బదులు సిలువను సహించుటకు ముందుకు వచ్చారు. ఆయన మన పక్షమున వాదించుటయే గాక మన శిక్షను కూడా భరించారు. ఆయన పాపము లేనివాడు. గాని పాపులమైన మనము నీతిమంతులముగా తీర్చబడు నిమిత్తమును, దేవుడు యదార్ధవంతుడుగా యుండుటకును ఆయన అట్లు చేసెను (రోమా 3:23-26). "ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" ( 2 కొరింథీ 5:21).

మన మధ్యవర్తియు, ఉత్తర వాదియు, మన ప్రాయశ్చిత్త బలియైన యేసుక్రీస్తు కొరకు దేవునికి వంద నములు.

- సిసెల్ మే



# "నాదేవా, నాదేవా నన్నేల విడనాడితివి?"

## (My God, My God why hast Thou Forsaken me?)

**- Hollis Miller**

పైన చెప్పబడిన ప్రభువు మాటలు వినగానే ప్రతి క్రైస్తవుని హృదయము స్పందించును. దేవుని కుమారుని యొక్క ఆవేదన, రోదన ఎంత కఠినుడైనను గ్రహించుకోగలడు.

యేసు యొక్క విజ్ఞాపన సహాయత కొరకు చేసినది కాదు. ఏలయనగా తాను మరణించబోవుచున్నట్లును, ఎందుకు మరణించుచున్నాడో యను దానిని గూర్చి కూడ ఆయన తన శిష్యులకు పదే పదే చెప్పారు. "అప్పటినుండి తాను యెరూషలేముకు వెళ్లి పెద్దల చేతను ప్రధాన యాజకుల చేతను శాస్త్రులచేతను అనేక హింసలు పొంది చంపబడి మూడవ దినమున లేచుట అగత్యమని యేసు తన శిష్యులకు తెలియజేసెను" (మత్తయి 16:21). "అలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచనక్రయ ధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చేప్పెను" (మత్తయి 20:28). తాను శిలువపై ఎందుకు వ్రేలాడుచున్నాడో యేసు ఎరిగియుండినను, అది ఆయన పొందుచున్న ఘోరమైన వేదననుండి విడుదల చేయలేకపోయెను. వర్ణింపనలవిగాని ఘోర బాధను ఆయన శరీర మనుభవించెను.

మనుష్యులందరి కొరకు యేసు సిలువమీద పాపముగా చేయబడెను. "ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతియగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథీ 5:21). గలతీయలోని క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసాడు: "క్రీస్తు మన కోసము శాపపై మనలను ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి విమోచించెను" గలతీ 3:13). పాపము యొక్క శిక్ష యేసుపై మోపబడెనని అపొస్తలుని యొక్క మాటలు సూచించు చున్నవి.

"మన యతిక్రమములను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్ట బడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది" (యెషయా 53:5; I పేతురు 2:24). దేవుని యొక్క ప్రేమను నరమాత్రులు గ్రహింపలేరు. గాని పాపము మానవజాతికి కలిగిన ఘోరమైన మచ్చ యని జ్ఞానము గల ప్రతివాడు గ్రహించు కోగలడు.


"దేవుడు మన యెడల తనప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8).

– హోలిస్ మిల్లర్

# క్రీస్తు విభజింపబడి యున్నాడా?

## (Is Chirst Divided)

**-Leroy Brownlow**



I. కొరింథులోయున్న సంఘ సభ్యులను పౌలు ఈ ప్రశ్న అడిగాడు:

1. అది సమయోచితమైన ప్రశ్న ఏలయనగా కొరింథు సంఘ సభ్యులు విభజింపబడి యున్నారు. (I కొరింథీ 1:12). అక్కడవున్న నాలుగు గుంపుల వారు మతశాఖల తత్వమును ప్రదర్శించు చుండిరి.

2. వారి పార్టీ తత్వాన్ని పౌలు నిశితంగా విమర్శించాడు, హేళన చేసాడు. వారిని ఖండిస్తూ ఈ ప్రశ్నవేసాడు. "క్రీస్తు విభజింపబడి యున్నాడా?". ఆయన విభజింపబడ లేదు. అట్లయితే మీరెందుకు విడి పోయారు? "పౌలు మీకొరకు సిలువ వేయబడెనా?" లేనే లేదు. అట్లయితే విమోచకునివలె అతనివైపు ఎందుకు చూడాలి? "మీరు పౌలు నామమున బాప్తిస్మము పొందితిరా?" లేనేలేదు. అట్లయితే నేను పౌలువాడనని ఎందుకు చెప్పు చున్నారు? వారందరు ఏక భావముతో మాటలాడవలెనని పౌలు వారిని వేడుకొన్నాడు (I కొరింథీ 1:10). విభజింపబడి యుండేవారు శరీర సంబంధు లేయని పౌలు వారికి చెప్పాడు. "మీలో అసూయయు, కలహమును ఉండగా మీరు శరీర సంబంధులై మనుష్య

రీతిగా నడుచుకొనువారు కారా?'' యని వారిని ప్రశ్నించాడు (I కొరింథీ 3:3).

3. నేడు అనేక మతశాఖలు, స్వయం విరుద్ధబోధలు, పలుపేరులు, విశ్వాస ప్రమాణములుకలిగియున్న సంఘ ములుండగా పౌలు అడిగిన ప్రశ్న వాస్తవమే. అవును "క్రీస్తు విభజింపబడి యున్నాడా?"

## II. యేసు ఒకే సంఘమును స్థాపింతునని వాగ్దానము చేసెను:

1. నాసంఘమును నేను కట్టు దునని ఆయన చెప్పెను. (మత్త 16:18). ఎన్నిసంఘములు? ఒకే ఒక్కటి సంఘము గాని సంఘములు కాదు.

2. మనకు కావలసినదంతా ఒక్కటే. ఒక యింటిలోనున్న వారు ఆయా సంఘాలకు వెళ్లుచున్న సందర్భంలో యింట్లో చిన్న బాలుడు తల్లితో దేవుడు అన్నీ మంచిగా చేయునా? అని అడిగాడు. "అవును, తప్పకుండా'' యని తల్లి జవాబిచ్చింది. అట్లయితే మనందరం ఒకే సంఘాని వెళ్లునట్లు దేవుడు ఒకే ఒక్క సంఘాన్ని ఎందుకు చేయలేదు? అని ఆబాలుడడిగాడు. అయితే ఈ సంఘా లన్నిటికి దేవుడు బాధ్యుడు కాదు. ఆయన సమాధానమునకేగాని అల్లరికి కర్తకాదు (Iకొరింథీ 14:33). క్రీస్తు విభజింప బడిలేదు!

## III ఆయనయందు విశ్వాసముంచు వారందరు ఏకమై యుండాలని క్రీస్తు ప్రార్థించెను:

"మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండ వలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు; వారి వాక్యము వలన నా యందు విశ్వాసముంచు వారంద రును ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20-21).

ఈ ప్రార్థన మనుష్యులకు కనబడ వలెనని చేసినదికాదు. అందులో వేష ధారణ యేమీలేదు. గాని అది ఆయన నిష్కల్మష హృదయ కాంక్ష. అయితే ఈ శాఖలకు, సిద్ధాంతాలకు అన్నిటికీ యేసే కారణమని ఆయనను నిందించేవాడు క్రీస్తును వేషధారి అనుచున్నాడు. ఏల యనగా ఆయన ఏకత్వము కొరకు ప్రార్థించి అనేక మతశాఖలు సృష్టించి నట్లయితే ఆయన వేషధారణ విషయంలో అపరాధియే, అయితే మతశాఖల వారు అనేక సంఘాలకొరకు, సిద్ధాంతాలకొరకు దేవునికి వందనములు చెప్పుదురు. యిది క్రీస్తు ఆత్మకు ఎంత విరుద్ధము!

2. ఎందుకు ఏకమై యుండాలి? "నీవు నన్ను పంపితివని లోకము నమ్ము నట్లు" అని యేసు ప్రార్థించారు. ఐక్యత వలన విశ్వాసము బలపడితే, విభజనల వలన అవిశ్వాసము బల పడును! క్రైస్తవ శాఖలవలన నేడు లోకంలో అవిశ్వాసము ప్రబలియున్నది. క్రీస్తు విభజింపబడిలేదు!

## II ఒకే ఒక్క శరీరమున్నదని బైబిలు తరుచు చెప్పుచున్నది:

1. ఎఫెసీ 2:16; 4:4; I కొరింథీ 12:20; రోమా 12:4, 5 చదువుము.

2. ఆ శరీరమే సంఘమని కూడ బైబిలు తరుచు బోధించుచున్నది (కొలస్స 1:18; ఎఫెసీ 1:22-23). ఒకే శరీరము, ఒకే సంఘము. "నేను నా సంఘమును కట్టుదును" అని క్రీస్తు చేసిన వాగ్దానముతో యిది పరిపూర్ణముగా ఏకీభవించుచున్నది (మత్త 16:18). రక్షింపబడిన వారిని ప్రభువు తన సంఘముతో (సంఘములతోకాదు) చేర్చు కొనును (అపో.కా. 2:47). క్రీస్తు విభజింప బడిలేదు!

## V బైబిలు ఏకత్వాన్ని, ఐక్యతను అనేక ఉదాహరణల ద్వారా బోధించు చున్నది.

1. అనేక ద్రాక్షతోటలను గూర్చి గాక ఒకే ద్రాక్షతోటను గూర్చి అది చెప్పు చున్నది (యోహాను 15:1).

2. ద్రాక్షావల్లి కూడా ఒక్కటే. వాటి తీగలు ఒక దానితోనొకటి విరుద్ధముగా యుండవు (యోహాను 15: 1-6). యేసు చెప్పిన ఉపమానములోని తీగలు మత శాఖలు కావు, అవి మనుష్యులు. యేసు ఇట్లు చెప్పారు: "ఎవడైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండి పోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును" (యోహాను 15:6). ఇక్కడ ప్రతితీగ ఒక మనుష్యుని సూచించు చున్నది. మత శాఖను కాదు.

3. అనేక గృహములను గాక మనం ఒకే గృహమును చూచుచున్నాము (I తిమో 3:15). ఆ గృహమే జీవముగల దేవుని సంఘము.

4. అనేక దొడ్డిలను గాక ఒకే ఒక్క గొర్రెలదొడ్డి గూర్చి మనం చూస్తాము. ఒకే దొడ్డికి ఒకే కాపరి మనకు కనబడ్తాడు (యోహాను 10:16)

5. సంఘము అనేక అవయవములు కలిగియున్న మానవ శరీరముతో పోల్చబడియున్నది. క్రీస్తే దానికి శిరస్సు. ప్రతి క్రైస్తవుడు దానిలో ఒక అవయవము వలె పోల్చబడి యున్నాడు (I కొరింథీ 12:12-27). ఒకే శరీరము, ఒకే శిరస్సు. అనేక శరీరములు ఒకే శిరస్సు యున్న రాక్షస రూపమును గూర్చి బైబిలు ఉపదేశించుట లేదు. క్రీస్తు విభజింప బడిలేదు!

## VI స్వవిరుద్ధ సంగతుల నుపదేశించుటకు దేవుడు ప్రోత్సహించడు:

1. ఏదేని బోధకుడు ఒకరోజు ఒకటి బోధించి, మరొకనాడు వేరొక దానిని బోధించిన యెడల అట్టివాడు వేషధారియని మనం చెబుతాము.

2. దేవుడేగనుక క్రైస్తవలోకములో యున్న స్వవిరుద్ధబోధలకు కారకుడైతే ఆయనను మనం ఏమందుము? అయితే దేవుడు వేషధారికాడు. మత శాఖలకు, వారి వైవిధ్య బోధలకు ఆయన కర్తకాడు. ఒకే శరీరము, ఒకే సంఘము, ఒకే విశ్వాసము, ఒకే బాప్తిస్మమును గూర్చి దేవుడు బోధించు చున్నారు. (ఎఫెసీ 4:4-5). అందరూ ఒకే ప్రమాణ మును బట్టి నడుచుకోవాలి (ఫిలిప్పీ 3:16), క్రీస్తు విభజింపబడి లేదు!

**VII బైబిలు అందరికీ ఒకే లాగున అర్థము కాదని కొందరు చెబుతారు.**


1. అట్టివాదనలో వాస్తవంలేదు. "సహోదరులారా, మీరందరు ఏక భావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలులేక యేకమనస్సుతోను ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండ వలె ననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొను చున్నాను." (I కొరింథీ 1:10). అభిప్రాయముల విషయములో అందరం ఏకీభవించలేము గాని విశ్వాస విషయములో ఏకీభవించ గలము.

2. ఐక్యత యొక్క ప్రమాణము-ఏమనగా: 1. గ్రంథములో బయలు పరచబడిన దానినే బోధించాలి (గలతీ 1:8,9) 2. బయలుపరచబడిన దాని నంతాబోధించాలి(అపొ.కా. 20:26,27). 3. మరియు గ్రంథమునకు కలుపుట గాని, తీసివేయుటగాని, వేరొక సంగతిని చేయుటగాని చేయకూడదు (ద్వితీ 4:2; ప్రక 22: 18-19).

3. అట్లయితే ఎందుకు క్రైస్తవ లోకము విభజింపబడి యున్నది? ఏలయనగా బోధకులు, సంఘములు కూడ బైబిలులో లేని సంగతులను ఆచరించుటవలన. ముంచుటయే బాప్తిస్మమని అందరు అంగీకరిస్తారు (రోమా 6:3,4). అది మారుమనస్సు పొందిన విశ్వాసికి ఇయ్యాలి (మార్కు 16:16). క్రైస్తవుడను పేరును ధరించాలి (అపొ.కా. 11:26) మరియు ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనము నాచరించాలి (అపొ.కా. 20:7). ఏలయనగా ఇవన్నీ బైబిలు చెప్పుచున్న సంగతులే.

అయితే చిలకరింపు, శిశు బాప్తిస్మము, మానవ కల్పిత నామములు, మూడునెలల కొకసారి ప్రభువుబల్ల మొదలగు వాటి విషయంలో వారు ఏకీభవించరు. వాటిని గూర్చి బైబిలు చెప్పుట లేదు. బైబిలు చెప్పు వాటి విషయంలో మేము ఏకీభవించు చున్నాము. బైబిలు చెప్పని వాటి విషయంలో విభ జింపబడి యున్నాము. మతశాఖల తత్వము తప్పు! క్రీస్తు విభజింపబడి లేదు!!

- లీరోయ్‌బ్రౌన్లో



# ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలెను


## (Esteem them Highly in Love)

**- Dale Grissom**



అపొ.పౌలు ఈలాగున వ్రాసాడు. "సహోదరులారా, మీలో ప్రయాసపడుచు ప్రభువునందు మీకు పైవారై యుండి మీకు బుద్ధి చెప్పువారిని మన్నన చేసి వారి పనినిబట్టి వారిని ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలెనని కోరుకొను చున్నాము. మరియు ఒకనితో ఒకడు సమాధానముగా ఉండుడి. సహోదరు లారా, మేము మీకు బోధించునది ఏమనగా అక్రమముగా నడుచుకొను వారికి బుద్ధి చెప్పుడి, ధైర్యము చెడిన వారిని ధైర్యపరచుడి, బలహీనులకు ఊతనియ్యుడి, అందరియెడల దీర్ఘ శాంతము గలవారై యుండుడి. ఎవడును కీడుకు ప్రతి కీడును ఎవనికైనను చేయకుండ చూచుకొనుడి. మీరు ఒకని యెడల ఒకడును, మనుష్యులందరి యెడలను ఎల్లప్పుడు మేలైనదానిని అనుసరించి నడుచుకొనుడి.

"ఎల్లప్పుడును సంతోషముగా ఉండుడి; యెడతెగక ప్రార్థన చేయుడి. ప్రతి విషయము నందును కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము. ఆత్మను అర్పకుడి. ప్రవచించుటకు నిర్లక్ష్యము చేయకుడి.




సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుడి. ప్రతివిధమైన కీడునకును దూరముగా ఉండుడి" (I థెస్స 5:12-22).

థెస్సలోనికయలో యున్న సంఘము వారిమధ్య పనిచేయుచున్న వారిని బాగుగా తెలిసికొనాలని, గౌరవించాలని పౌలు వారిని పైరీతిగా హెచ్చరించాడు. చాలసార్లు సంఘములో కష్టపడి పని చేయుచున్న వారిని మనం ఎరుగము. వారి వలననే సంఘము సజీవముగాను, చురుకుగాను యుండును. థెస్సలోని కయలోని వారివలె అట్టి వారిని గూర్చి మనకు బహుశ ఎవరైనా జ్ఞాపకము చేయవలసి వస్తాది. వారిని మనం గౌరవించాలి. ప్రేమతో మన్నన చేయాలి.

మనం ఎల్లప్పుడు సంతోషించు ప్రజలుగా యుండాలి. ఏలయనగా మనము నిత్య జీవనిరీక్షణను కలిగి యున్నాము. అవుసరము వచ్చినప్పుడే గాక మనము ఎల్లవేళలా ప్రార్థనాపరులై యుండాలి. క్రీస్తులో మనకున్న నిరీక్షణను బట్టి యితరులకు దానిని గూర్చి బోధిం చుటకు చురుకైనవారముగా యుండాలి. మరియు మనము సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టి సమస్త దుష్టత్వము నకు బహు దూరముగా యుండాలి.

దేవుని ప్రజలతో కూడిన స్థానిక సంఘము, దేవుని రాజ్య విస్తరణ కొరకు కష్టపడి పనిచేయునప్పుడు, వారు ఒకరి నొకరు గౌరవించుకొంటారు, మన్నన చేసికొంటారు. సంఘములో చీలికలకు, అనైక్యతకు తావు లేదు, మనశక్తి అంతయు ప్రభువు సేవకై వినియోగించాలి.


– డేల్‌గ్రిస్సమ్



# రక్షణ ఉచిత వరమే అయినను షరతులున్నవా?

## (Can Salvation be a gift and still be Conditional?)

**- Owen Cosgrove**



పాపియైనవాడు పరలోకం వెళ్లితే అది కేవలం దేవుని కృపయే. మనలో ఎవడును పరలోకమునకు అర్హుడు కాదు. ఎవడును రక్షణను సంపాదించుకొనలేదు. క్రీస్తు యేసు ద్వారా దేవుని కృప మనకు లేకుంటే మనందరం నశించి పోవుదుము.

నేను సువార్తకు లోబడ్డాను గనుక పరలోకమునకు అర్హుడనని చెప్పుకునే క్రైస్తవుని నేనింకా చూడలేదు. మన క్రియలను బట్టియే పరలోకము చేరు కొందుమని చెప్పే బోధకుని నేనింకా చూడలేదు. మన సహోదరులలో ఎవరు అట్టి బోధను చేయరు. వారు సత్యము నెరిగినవారు.

### మనము కృపవలన రక్షింప బడుదుమా?

అవును తప్పకుండా. మన సొంత క్రియలను బట్టియే రక్షింప బడుదుమా? కానేకాదు. అయితే యేసుక్రీస్తు ద్వారా దేవుడు తన కృపను మనకను గ్రహించి నందున మనలనుండి దేవుడేమైనా కోరునా? రక్షణ దేవుని ఉచిత వరమే

అయినను అది షరతులతో కూడినదా?

ఇశ్రాయేలీయులకు దేవుడు కానాను దేశము నిచ్చారు. యెహోషువ 1:2,3. దానిని స్వాధీనపరచుకొనుటలో వారికేమైనా బాధ్యత యున్నదా?

"మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము" అని ప్రార్థించు మని యేసు మనకు నేర్పారు (మత్త 6:11; I తిమో 6:17). అయితే పనిచేసే బాధ్యతనుండి యిది మనలను తప్పించు చున్నదా? (II థెస్స 3:8).

మనకు దేవుడు తన వాక్యము నిచ్చారు (అపొ.కా.7:38; 2 పేతురు 1:3). అట్లయితే దానిని మనము చదువ వలసి యున్నదా?క్రీస్తు తన శాంతిని మనకను గ్రహించారు (యోహాను 14:27). అయితే శాంతియుతముగా యుండుటకు, శాంతిని నెలకొల్పువారిగా యుండుటకు మనకేమైనా బాధ్యత లున్నవా?

"కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగి యుందము. మరియు ఆయన ద్వారా మనము విశ్వాసము వలన ఈ కృపయందు ప్రవేశము గలవారమై అందులో నిలిచి యుండి దేవుని మహిమను గూర్చిన నిరీక్షణను బట్టి అతిశయపడు చున్నాము" (రోమా 5:1-2).

"ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తి హీనతను ఇహలోక సంబంధమైన దురాశలకు విసర్జించి శుభ ప్రదమైన నిరీక్షణ నిమిత్తము ఈ లోకములో స్వస్థ బుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రదుకుచుండవలెనని మనకు బోధించుచున్నది" (తీతు 2:11-13).

- అవెన్ కాస్‌గ్రోవ్



# బాప్తిస్మము యొక్క ప్రయోజనము

## (The purpose of Baptism)

**- Roger E.Dickson**

వేలకొలది ప్రజలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన సంఘటనను గూర్చి క్రొత్త నిబంధన రికార్డు చెప్పుచున్నది (అపో.కా. 2:41; 6:7; 8:6,12). పాప క్షమాపణ నిమిత్తము యేసు యిచ్చిన ఆజ్ఞ ప్రకారము వారునీటిలో ముంచబడిరి.

**సువార్తకు లోబడుట:**

మన పాపముల నిమిత్తమై యేసు మరణించి సమాధి చేయబడి మూడవ దినమున తిరిగి లేచారను చారిత్రాత్మక సత్యమే సువార్త (I కొరింథీ 15:1-4). ఈ చారిత్రక సంఘటన దైవావేశ లేఖనముల ద్వారా మనకు తెలియ జేయ బడినది. ఒకడు సువార్తకు లోబడితేనే గాని అతడు రక్షింపబడలేడు (2 థెస్స 1:7-9 I పేతురు 4:17). ఒకడు బాప్తిస్మము పొందినప్పుడు అతడుక్రీస్తుతో కూడ సమాధి చేయబడి ఆనీటి సమాధిలో నుండి తిరిగి లేస్తాడు (రోమా 6:4; కొలస్స 2:12). గనుక ఒకడు నీటిలో ముంచబడుటలో క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానములను సారూప్య ముగా చిత్రీకరించును. అదే బాప్తిస్మము యొక్క విధానము.

**పాపక్షమాపణ:**

సువార్తకు లోబడుచూ ఒకడు నీటిలోముంచబడినప్పుడు, అతడు క్రీస్తు రక్తమును తాకును. అట్లు అతడు పాపక్షమాపణను పొందును (అపో.కా. 2:38), అతని పాపములు కడుగ బడును (అపో.కా. 22:16), దేవుడతనిని తన సంఘముతో చేర్చుకొనును. (అపో.కా. 2:47).

**బాప్తిస్మము పొందు అభ్యర్థులు:**

బాప్తిస్మము పొందాలంటే కొన్ని సంగతులు ముందుగానే చేసి యుండాలి. సువార్త వాక్యము బోధింపబడినవారే బాప్తిస్మము పొందనర్హులు (మత్తయి 28:18-20). దానిని గ్రహించుకొని బాప్తిస్మమును గూర్చిన ఆజ్ఞకు లోబడా లను కొనేవారే బాప్తిస్మము పొంద వలెను (అపో.కా. 2:38). పురుషులు, స్త్రీలు మాత్రమే బాప్తిస్మము పొందవలెను (అపో.కా. 8:12). సువార్త వాక్యమును వినినవారు బాప్తిస్మము పొందాలి (మార్కు 16:15-16) విశ్వసించినవారు బాప్తిస్మము పొందాలి (మార్కు 16:16; యోహాను 8:24; 8:12; 18:8). తమ పాపముల విషయమై మారుమనస్సు పొందినవారు బాప్తిస్మము పొందవలెను (లూకా 13:3; అపో.కా. 2:38, 3:19; 17:30; 2 పేతురు 3:9). గనుక స్వయంగా నిశ్చయించుకొని విధేయత చూపుటకు ముందుకు వచ్చిన వారే బాప్తిస్మమునకు అర్హులు.

- రోజర్ డిక్సన్

# 18. క్రీస్తులో ఆశీర్వాదములు

## (Blessings in Christ)

**- Owen D. Olbricht**

క్రీస్తులో ఉంటే, క్రీస్తుద్వారా ఆశీర్వాదములు పొందే ఆధిక్యత కల్గి యుంటారని బైబిలు చదివి దాని బోధనల యందు విశ్వాసము కల్గిన వారందరు అంగీకరిస్తారు. క్రీస్తులో యున్నవారికి ఆత్మసంబంధమైన ప్రతీ ఆశీర్వాదమును మనకనుగ్రహించారు. (ఎఫె 1:3). పౌలు క్రీస్తుకు దూరముగా ఉన్నవారిని గూర్చి ఈలాగు వ్రాయుచున్నాడు ''ఆ కాలమందు ఇశ్రా యేలీయులతో సహ పౌరులు కాక పరదేశులును, వాగ్దాన నిబంధనలులేని పరజనులును నిరీక్షణ లేని వారును లోకమందు దేవుడులేని వారునైయుండి క్రీస్తుకు దూరస్థులై యుంటిరని మీరు జ్ఞాపకము చేసికొనుడి. అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్థు యేసు నందు, క్రీస్తు రక్తమువలన సమీపస్థులై యున్నారు" (ఎఫె 2:12,13).

### 1. లోపల ఉండుటవల్ల ప్రాముఖ్యత

'బయట' ఉండుటకు బదులుగా 'లోపల' ఉండుట వల్ల కలిగే ప్రాముఖ్యత ఏమనగా 'లోపల' ఉన్నవారు పొందే లాభము 'బయట' ఉన్నవారు పొందలేరు. నోవహు, అతని కుటుంబము విషయ ములో ఇది నిజమైనది. పేతురు నోవహు ఓడను గూర్చి వ్రాస్తూ "ఆ ఓడలో కొందరు అనగా ఎనిమిదిమంది నీటిద్వారా రక్షణ పొందిరి'' (I పేతురు 3:20) అని వ్రాసాడు. దేవుడు జల ప్రళయము రప్పించి భూమిని నాశనము చేసినపుడు ఓడలో ఉన్న నోవహు కుటుంబము మాత్రమే రక్షింపబడెను. ఓడకు వెలుప యున్నవారు నశించి పోయిరి.

### 2. క్రీస్తులో ఉండుటవల్ల ప్రాముఖ్యత

క్రీస్తునందు పరలోక విషయము లలో ఆత్మసంబంధమైన ప్రతీ ఆశీర్వా దము మనకనుగ్రహించెను (ఎఫె 1:3). క్రీస్తులో ఉన్నవారు పొందే ఈ ఆశీర్వాదములు క్రీస్తుకు వెలుపల యున్నవారు పొందలేరు. క్రీస్తు లోనికి ప్రవేశించి ఆయన ఇచ్చే ఆశీర్వాదములు పొందుటకు గల ఒకే ఒక మార్గమేదనగా బాప్తీస్మము. క్రీస్తు యేసులోనికి బాప్తీస్మము పొందిన మన మందరము ఆయన మరణము లోనికి బాప్తీస్మము పొందితిమని మీరెరుగరా? (రోమా 6:3) "క్రీస్తులోనికి బాప్తీస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు'' (గలతి 3:27) క్రీస్తుకు వెలుపల ఉండి అనగా బాప్తీస్మము తీసి కొనకుండా, దేవునికి దూరముగా యుండి ఆయనను వెంబడించకుండా ఉన్నవారు

క్రీస్తుకు వెలుపల ఆ ఆశీర్వాదములు వాగ్ధానములు పొందలేరు.

"ఆ కాలమందు ఇశ్రాయేలీ యులతో సహపౌరులుకాక, పరదేశు లును, వాగ్ధాన నిబంధనలు లేని పర జనులును, నిరీక్షణ లేనివారును, లోక మందు దేవుడు లేనివారునై యుండి క్రీస్తుకు దూరస్థులై యుంటిరని మీరు జ్ఞాపకము చేసికొనుడి. అయినను మునుపు దూరస్థు లైన మీరు క్రీస్తు యేసురక్తము వలన సమీపస్థులై యున్నారు (ఎఫె 2:12, 13).

### 3. క్రీస్తులో ఉండుటవల్ల పొందే ఆశీర్వాదములు

1. క్రీస్తును కల్గియుండుట
2. దేవుని వాగ్ధాన నిబంధనల వల్ల కల్గు ప్రయోజనాలు
3. నిరీక్షణ
4. దేవుని కల్గియుండుట
5. దేవునియొద్దకు చేర్చే క్రీస్తురక్తము

క్రీస్తు రక్తమువలన కల్గే ఆశీర్వాదములను, క్రీస్తు వెలుపల ఉండే వ్యక్తి అనగా బాప్తీస్మము పొందని వ్యక్తి, పొందలేడు.

1. క్రీస్తు రక్తము వలన విమోచన అనగా మన అపరాధములకు పాప క్షమాపణ:- "దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫె1:7)

2. పాత జీవితము గతించిపోయి ఆత్మసంబంధముగా నూతనవ్యక్తిగా ఉండుట:-

"కాగా ఎవడైనను క్రీస్తునందున్న ఎడల వాడు నూతన సృష్టి. పాతవి గతించెను ఇదిగో క్రొత్తవాయెను" (II కొరింథీ 5:17).

3. రక్షణ:- "అందుచేత ఏర్పరచ బడినవారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తు యేసునందలి రక్షణ పొంద వలెనని నేను వారి కొరకు సమస్తమును ఓర్చుకొనుచున్నాను" (II తిమోతి 2:10).

4. నిత్యజీవము:- "ఆసాక్ష్యమే మనగా-దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను. ఈజీవము ఆయన కుమారుని యందున్నది" (I యోహాను 5:11)

### 5. మన నిరీక్షణ

క్రీస్తులో లేకుండా బాప్తీస్మము పొందకుండా ఉన్నట్లయిన మనము నిరీక్షణ లేనివారము. అపొస్తలుల కార్యములో వ్రాయబడిన రీతిగా సువార్తను విని దానినంగీకరించి బాప్తీస్తము పొంద వలసిన అవుసరత యున్నది (అపో 2:41;8:12, 35-38,, 9:18; 10:47, 48; 16:15 16:33, 34; 19:5).

- ఓవెన్ డి. అల్‌బ్రిక్

# 19. విశ్వాసుల ప్రత్యేకతలు
## (Distinctions of the Faithful)

**- Wayne Barrier**



గొప్ప విశ్వాసులను గూర్చిన సవిస్తర వివరణ బైబిలునందు మనకు దొరుకును. హెబ్రీ 11వ అధ్యాయమును కొందరు విశ్వాస వీరుల పట్టికయని పిలుతురు. అందులో చెప్పబడిన గొప్ప జనులు అబ్రాహాము, హేబెలు, హానోకు, నోవహు, ఇస్సాకు, యాకోబు, శారా, యోసేపు, మోషే, రాహాబు, గిద్యోను, బారాకు, సమూయేలు, యెఫ్తా, సంసోను మరియు దావీదు మొ॥గు వారు. బైబిలును చదువునప్పుడు ఇంకా అనేక మంది వారి విశ్వాసమును బట్టి ప్రత్యేకముగా మనకు కనబడుదురు. పౌలు, యాకోబు, యోహాను, పేతురు, బర్నబాసు, బాప్తిస్మ మిచ్చు యోహాను మొదలగు వారి విశ్వాసమును గూర్చి ఆలోచించుము. మిగతా ప్రజలనుండి వీరు ఎందువలన ప్రత్యేకముగా కనబడుదురు? వారి గుణగుణాలను వర్ణించుటకు ఇక్కడ మనకు స్థలము చాలదు.

### మొదటిగా దేవునియందలి వారి విశ్వాసము పరిపూర్ణమైనది:

దేవునికి వారు మొదటి స్థానము నిచ్చారు. యేసును వెంబడించు వారెట్లుండాలని కోరారో, వారట్లున్నారు. అపో.పౌలు ఫిలిప్పీ 4:6-7లో ఇట్లు చెప్పుచున్నాడు: "దేనిని గూర్చియు చింత పడకుడిగాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా

పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానము నకు మించిన దేవుని సమా ధానము యేసు క్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును" (ఫిలిప్పీ 4:6-7).

**రెండవదిగా, జీవితంలో వారికొక నిర్ధిష్టగమ్యాలు, ప్రయోజనమువున్నది:**

అపొ.పౌలు మరల ఫిలిప్పీ 3:13-14లో ఇట్లు చెప్పాడు: "సహోదరులారా, నేనిది వరకే పట్టుకొని యున్నానని తలంచుకొనను. అయితే ఒకటి చేయు చున్నాను, వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తుయేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని గురి యొద్దకే పరుగెత్తు చున్నాను". రోమా 1:16లో ఈ గురిని గూర్చిన వివరణ పౌలు వ్రాసూ, "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను ఏలయనగా నమ్ము ప్రతివానికి రక్షణ కలుగజేయుటకు అదిదేవుని శక్తి" యని చెప్పాడు.

**మూడవదిగా వారు ప్రార్థనశక్తిని, దేవుని కాపుదలను గూర్చి నమ్మిక కలిగి యుండిరి:**

రోమా 8:28లో పౌలు చెప్పిన దానిని గమనించుము. "దేవుని ప్రేమించు వారికి, అనగా ఆయన సంక ల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవి." ప్రార్థనలో యున్న శక్తిని గూర్చి యాకోబు ఇట్లు చెప్పాడు: "నీతి మంతుని విజ్ఞాపన మనఃపూర్వక మైనదై బహుబలము గలదై యుండును" (యాకోబు 5:16). యేసు ప్రభువును వెంబడించువారు, వెదకుడి, తట్టుడి, అడుగుడియని హెచ్చరించ బడ్డారు (మత్త 7:7).

మనము కూడ విశ్వాస విషయములో ప్రత్యేకమైన స్త్రీ పురుషుల వలె యుండగలము. మన విశ్వాసము దినదినము పెరుగునట్లు దానిని పోషించాలి, ప్రదర్శించాలి. అది పెరుగు చుండగా మనము ఆత్మీయ విజయాన్ని రుచి చూడగలము. మన జీవితంలో దేవుని చిత్తము, ప్రయోజనము నెరవేరుట చూడగలము. బలమైన విశ్వాసము ద్వారా సంతోషాన్ని, సంతృప్తిని ఈ జీవి తాంతము వరకు మనము అనుభవించ గలము.

మన విశ్వాసము వలన యితరులు ప్రభువును వెదకి కనుగొనగలరు. బైబిలులోని విశ్వాస వీరులెట్లు తమ విశ్వాసము వలన గొప్ప కార్యములు చేసారో, మనము కూడ ప్రభువు కొరకు గొప్ప సంగతులు సాధించగలము.

**- వెయిన్ బేరియర్**

# "మనుష్యులు నిద్రించుచుండగా..."

## (While Men slept)

**- E. Ulric Alleyne**



మత్తయి 13:24-43లో ప్రభువైన యేసు ఈ ఉపమానము చెప్పారు: "పరలోక రాజ్యము తన పొలములో మంచి విత్తనము విత్తిన యొక మనుష్యుని పోలి యున్నది. మనుష్యులు నిద్రించు చుండగా అతని శత్రువు వచ్చి గోధుమల మధ్యను గురుగులు విత్తిపోయెను. మొలకలు పెరిగి గింజ పట్టినప్పుడు గురుగులు కూడ అగపడెను. అప్పుడు ఇంటి యజమానుని దాసులు అతని యొద్దకు వచ్చి-అయ్యా నీవు నీ పొలములో మంచి విత్తనము విత్తితివి గదా, అందులో గురుగు లెక్కడనుండి వచ్చినవని అడిగిరి. ఇది శత్రువు చేసినపని అని అతడు వారితో చెప్పగా, ఆ దాసులు-మేము వెళ్లి వాటి ని పెరికికూర్చుట నీకిష్టమా? అని అతనిని అడిగిరి. అందు కతడు, వద్దు, గురుగులను పెరుకు చుండగా, వాటితో కూడ ఒకవేళ గోధుమ లను పెల్ల గింతురు. కోత కాలమువరకు రెంటిని కలిసి యెదుగ నియ్యుడి. కోతకాలమందు గురుగులను ముందుగా కూర్చి వాటిని కాల్చి వేయుటకు కట్టలు కట్టి

గోధుమలను నా కొట్టులో చేర్చి పెట్టుడని కోత గాండ్రతో చెప్పుదుననెను".

మంచివారు తమ పనిచేయునంత వరకు సాతాను కనిపెట్టాడు. పొలములో వారు తమపని చేసేసిన తరువాత వాడు మోసపూరితముగా వాని పని ప్రారంభించాడు. నేరుగా తన కుయుక్తి గల పని చేయలేదుగాని మంచితో చెడును మిళితము చేయసాగాడు. తత్ఫలితముగా గొప్ప గందరగోళము గజిబిజి సృష్టించాడు. మంచికి చెడుగు అతి సమీపముగా యున్నందున అది ఆందోళనకరము.

అపవాది వేసిన కుయుక్తిగల అడుగు యేమంటే అతడు మంచి పని వారు నిద్రపోవుచుండగా పొలములో గురుగులు విత్తసాగాడు. సాతాను నేరుగా మనలను ఎదుర్కొనును నేమోయని మనం కనిపెట్టుచుండగా వాడు వెనుకనుండియే కత్తితో పొడుచును. శత్రువు కొరకు మనము బయట వెదుకుచుండగా, అతడు లోపల ఉండియే పనిచేయును.

మన నాయకుడగు యేసుక్రీస్తు అపరాధిని బాగుగా ఎరుగును. అందు వలననే ఈ యుద్ధము అతి సమీపము నుండియే జరుగునని చెప్పారు. ఎవరెట్టి వారో తెలియబడేవరకు వారు కలిసియే ఎదుగుదురు. "మనుష్య కుమారుడు తన దూతలను పంపును, వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతి పరులను సమకూర్చి అగ్ని గుండములో పడ వేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరకుటయును ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యుని వలె తేజ రిల్లుదురు. చెవులు గలవాడు వినునుగాక'' (మత్తయి 13:41-43).

మంచి వారు నిద్రించుచుండగా విత్త బడిన చెడ్డ విత్తనమును వలన నశించి పోవు ఆత్మలను గూర్చి విచారము. దేవుని ప్రజలమైన మనము ఎల్లవేళల మెలకువగా యుండాలి. లేని యెడల సత్యముతో అసత్యము కూడ మిళితము చేయబడ్తాది. రక్షించబడిన వారు నశించిన వారిగా కన్పించును. మంచి వారు చెడ్డవారు మిళితము చేయబడు దురు. అయితే చెడుగును జరిగించు వారికి ప్రభువు రాజ్యములో స్థానము లేదు!

– అల్‌రిక్ ఎలేయన్




# మనము మోయ వలసిన భారము

## (The Burdensome load we must carry)

**- Michael King**

మనము 'ఈ గుడారములో' యున్నంత కాలము మూలుగుచు యుందుమని పౌలు నిరూపించాడు (2 కొరింథి 5:4). మనము ప్రతిదినము ఎదుర్కొను సమస్యలను బట్టి యిది యదార్థమని మనం ఎరుగుదుము. కొందరి హృద యాల్లో జరుగుచున్న యుద్ధములను గూర్చి మనం తెలిసికొన గలిగిన యెడల పరులను అంతగా నిందించము.

గలతీయలో యున్న క్రైస్తవులకు తాము మోయవలసిన భారములను గూర్చి అపో.పౌలు తెలియజేసాడు. గలతీ 6:2; 6:5 వచనములు ఒకదానితో యొకటి స్వవిరుద్ధముగా యున్నట్లగు పడును గాని నిజానికి వాటిలో స్వవిరుద్ధము యేమీలేదు. భారము అనే పదము కేవలము బరువు కాదు గాని, కష్టము, చింత, బాధలనికూడ గ్రహించు కొననగును. ఈ రకమైన ఒకరి భారమును మరొకరము మనము భరించవలసి యున్నది. 5వ వచనములో యున్న భారము మానవుని విధులన్నియు కలసిన మూట యను భావము కలిగి యున్నది. దేవుని యెదుట ఒకడు నిర్వర్తించ వలసిన విధులున్నవి. ఒకని వ్యక్తిగత విధులభారమునకు, యితరుల భారములకు యున్న వ్యత్యాసము ఇక్కడ కాననగును.



ఈ భారముల విషయమై ఒకడు మూడు విధములుగా స్పందించవచ్చును. 1) ప్రతివాడు తన సొంత భారములను మోసికొనవలెను (గలతీ 6:5). 2) ఒకని భారములను ఒకడు మోయవలెను (గలతీ 6:2). 3) నీ భారమును యెహోవా మీద మోపుము (కీర్తన 55:22).

కొన్ని బాధ్యతలను ఒకడు స్వయం గానే మోయవలసి యున్నది. వాటిని ఇతరులకు బదిలీ చేయలేదు. ఒకని కొరకు ఇంకొకడు విశ్వసించలేదు, మారుమనస్సు పొందలేదు, బాప్తిస్మము పొందలేదు. ఒకడు దేవునికి చేయుసేవను ఇంకొకడు చేయలేదు. దేవుని యెడల ఒకని భక్తిభావముల బాధ్యత, తీర్పు దినమున అతని జవాబుదారితనము

మో॥నవి వ్యక్తిగతమైనవని మనమెరుగుదుము (రోమా 14:12; 2 కొరింథీ 5:10). ఒకడు తాను నిర్వర్తించవలసిన విధులను చేయక వాటిని దాచిపుచ్చుటకు ప్రయత్నించుట వ్యర్ధము. ఆదాము హవ్వలు దేవునికి కనబడకుండా దాగుకొనుటకు ప్రయత్నించారు. అది వ్యర్ధమాయెను.

ఒకని భారములను మరొకడు మోయునప్పుడు పరస్పర సహాయము లభించును. కొన్ని భారములు యితరులతో పంచుకొనదగును. సత్య వాక్యమును సరిగ విభజించే బాధ్యతను అందరు పంచుకోవాలి. సహవాసము నుండి ఒకని తొలగించే విషయం కూడ భారమైనదే, అలాగే ఒకని సంఘముతో పునరుద్ధరించే విషయంలో కూడ అందరి సహాయత అవసరము. క్రైస్తవులు "కృప యెక్కువమంది ద్వారా ప్రబలి దేవుని మహిమ నిమిత్తము కృతజ్ఞతా స్తుతులు విస్తరింపజేయులాగున" పని చేయవలసి యున్నది. ఒకరికొకరు సహాయపడుట ద్వారా దుఃఖము, బాధలు, ఆర్థిక ఇబ్బందులు, మంచి చెడుగులను గూర్చిన ఉపదేశము, నాయకత్వ భారములు మో॥నవి తేలిక యగును.

కొన్ని భారములయితే వ్యక్తిగతముగాను, సామూహికముగాను మోయుటకు మించినవి. ఇట్టి భారములను మనం దేవునిపైన మోపుటకు నేర్చుకొనవలెను. (కీర్తన 55:22). ఇవ్విధమైన భారముల విషయంలో ఆయన మనకు సహాయపడుదునని వాగ్దానం చేసారు. వాటిని భరించుటకో లేక తప్పించుకొనుటకో ఆయన సహాయపడును (I కొరింథి 10:13). ఇట్టి రకములైన భారములు మానవులకు సాధారణముగా కలుగును. మరియు మనము సహింప గలిగినంత కంటె ఎక్కువగా ఆయన శోధింప బడ నీయడు. అంతేగాక దానిని తప్పించుకొను మార్గమును ఆయన కలుగు జేయును.

తన శరీరములో యున్న ముల్లును తొలగించుమని అపొ.పౌలు ముమ్మారు దేవుని వేడుకున్నాడు. గాని దేవుడు "నా కృపనీకు చాలును, బలహీనతయందు నాశక్తి పరిపూర్ణ మగుచున్నదని" అతనితో చెప్పెను (2 కొరింథీ 12:9). మన భారములను దేవునిపై మోపుట యుక్తమే. "మీ విజ్ఞాపనలు దేవునికి తెలియజేయుడి" (ఫిలిప్పీ 4:6). పేతురు ఈ సంగతి పరిశుద్ధాత్మ ద్వారా ఎరిగినవాడై, "మీచింత యావత్తు ఆయనమీద వేయుడి; ఆయన మీ కొరకు చింతించుచున్నాడు" అని చెప్పెను (I పేతురు 5:7). దేవుడు తప్పక మనకు సహాయము చేయును.

ప్రభువునందు నమ్మిక యుంచుము. "మనము మేలు చేయుటయందు విసుగక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంట కోతుము" (గలతీ 6:9). నీ జీవితము ద్వారా దేవుడు మహిమపరబడునుగాక!

– మైకేల్ కింగ్

# మృతుడవా లేక సజీవుడవా?

## (Dead or Alive?)

**- J. Lee Roberts**



"ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగు ననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" (I కొరింథీ 15:22).

ఆదాము హవ్వల వలె దేవుని హెచ్చరికలను వినియు, ఎందరు నిరాకరించి అవిధేయత చూపుదురో వారందరు పాపమువలన ఆత్మీయముగ మృతుల వుదురు. దేవుని మాటలకంటె అపవాది యొక్క మాటలను మనము లక్ష్యపెట్టి నప్పుడు ఆదామువలె ఆత్మీయ జీవిత ఆధారము నుండి తొలగించ బడుదుము. మన సృష్టికర్త యొక్క సహవాసమును కోల్పోవుదుము. అందరును పాపము చేసినవారే. అంటే ఆదామునందున్న వారమే. అంటే ఆత్మీయముగా మృతు లమే. మృతులు మృతులను పాతిపెట్ట నిమ్ము అని యేసు చెప్పినప్పుడు ఇట్టి స్థితిలో యున్నవారిని గూర్చి చెప్పారు. ఆలాగే తప్పిపోయిన కుమారుడు అట్లే చనిపోయెను (లూకా 8:22; లూకా 15:32). సుఖభోగముల యందు ప్రవర్తించు విధవరాలు బ్రదుకుచుండియు చచ్చినదై యుండునని అందుకే పౌలు చెప్పాడు (I తిమోతి 5:6).

### ఆదాము యొక్క అవిధేయతను అనుకరించువారందరు మృతులైనవారు

పాపము వలన అందరు ఆదాము

నందు మృతినొందుదురు. ఎఫెసీ 2:1-6 ఇట్లు చెప్పుచున్నది. "మీరు అపరాధ ముల చేతను పాపములచేతను చచ్చిన వారై యుండగా ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను. మీరు వాటిని చేయుచు వాయుమండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి యీ ప్రపంచ ధర్మము చొప్పున మునుపు నడుచుకొంటిరి. వారితో కలసి మనమందరమును శరీరము యొక్కయు మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు మన శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించుచు కడమ వారి వలెనే స్వభావ సిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమై యుంటిమి. అయినను దేవుడు కరుణా సంపన్నుడై యుండి మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండి నప్పుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో కూడ బ్రతికించెను- కృప చేత మీరు రక్షింపబడి యున్నారు"

**ఆత్మీయ జీవమంతయు క్రీస్తులో యున్నది:**

మనము యేసు యొక్క మాదిరి ననుసరించి తండ్రి చిత్తమునకు సంపూర్ణ విధేయత చూపినప్పుడు మన ఆత్మీయ జీవము క్రీస్తులో యుండును. మన పాపపు ఘోరతత్వమును దేవుని ప్రేమను గమనించినప్పుడు మార్పునొంది పాప ముల అభ్యాసమును విసర్జించి దేవుని వైపు తిరుగుదుము.

ఆదాము యొక్క మాదిరిని విడచి, బాప్తిస్మము పొంది దేవునికి విధేయత చూపినప్పుడు ఆత్మీయముగా సజీవుల మగుదుము. ఆయనతో కూడ పాతి పెట్టబడి నూతన జీవము పొందినవారమై ఆనీటి సమాధినుండి తిరిగి లేప బడుదుము. పాపమును ద్వేషించి, భక్తిని ప్రేమించునట్లు మన హృదయములు మార్చబడును.

"మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడిన వారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావ మందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి. మరియు అపరాధముల వలనను శరీరమందు సున్నతి పొందక యుండుట వలనను మీరు మృతులై యుండగా, దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రము ను మేకులతో సిలువకు కొట్టి దానిమీది చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధము లన్నిటిని క్షమించి ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను" (కొలస్స 2:12-14).

"మనము సహోదరులను ప్రేమించు చున్నాము గనుక మరణములో నుండి జీవములోనికి దాటి యున్నామని యెరుగుదుము. ప్రేమలేని వాడు మరణ


మందు నిలిచియున్నాడు. తనసహోదరుని ద్వేషించువాడు నర హంతకుడు, ఏ నరహంతకుని యందును నిత్యజీవ ముండదని మీరెరుగుదురు. ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను.గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొను చున్నాము. మనము కూడ సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమైయున్నాము" (I యోహాను 3:14-16).

"ఎందుకనగా మనము కూడ మునుపు అవివేకులమును, అవిధేయులమును మోసపోయిన వారమును నానా విధములైన దురాశలకును భోగములకును దాసులమై యుండి దుష్టత్వము నందును అసూయయందును కాలము గడుపుచు అసహ్యులమై యొకనినొకడు ద్వేషించుచు ఉంటిమి గాని మన రక్షకుడైన దేవునియొక్క దయయు మానవుల యెడల ఆయనకున్న ప్రేమయు ప్రత్యక్షమైనప్పుడు మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగ జేయుట ద్వారాను మనలను రక్షించెను. మన మాయన కృప వలన నీతిమంతులమని తీర్చబడి, నిత్య జీవమును గూర్చిన నిరీక్షణను బట్టి దానికి వారసుల మగుటకై ఆ పరిశుద్ధాత్మను మన రక్షకు డైన యేసు క్రీస్తు ద్వారా ఆయన మనమీద సమృద్ధిగా కుమ్మరించెను"(తీతు 3:3-7).

దిగువ లేఖన భాగములను ప్రార్థన పూర్వకముగా చదువుము. రోమా 6:1-9; I పేతురు 1:22-25; 3:1-17; అపో.కా. 2:37-42; I యోహాను 2:3-6; తీతు 2:11-14.

క్రీస్తునందు మనము సజీవులుగా చేయబడ్డాము. మరియు ఆయన సారూప్యమునకు మార్చబడుచున్నాము. ఆయన లక్షణములను అనుకరించుచు, ఆయన ప్రేమించిన రీతిగా ప్రేమించుచు క్షమించిన రీతిగా క్షమించుచు, ఆయన ఆత్మమనలో పనిచేయుచుండగా ముందుకు సాగుదము.

– జె.లీ రోబర్ట్స్






# దేవుని ఆలయము

## (The Temple of God)

**- John Harris**



కొరింథులో యున్న క్రీస్తు సంఘమునకు పౌలు ఇట్లు చెప్పాడు: "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు విలువ పెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి" (I కొరింథీ6:19,20). కొరింథులోని ప్రజలు ఈ లోక భారములను విడిచి సువార్తకు విధేయులై నిజదేవుని, యేసుక్రీస్తును అంగీకరించిరి. వారు క్రైస్తవులు, క్రీస్తు సంఘస్థులు అయిరి. "మీరు మీ సొత్తుకాదు" అని పౌలు వారికి చెప్పాడు. మనదేహము దేవునికే చెందును. ఆయన తన స్వరక్తముతో మనలను కొన్నారు. మన శరీరాత్మలు ఆయనవే. అందువలన మన దేహముతో దేవుని మహిమ పర్చాలి.

క్రైస్తవుడైన వాడు తన శరీరాన్ని దుర్వినియోగం చేసినా, అపవిత్రపరిచినా అతడు దేవుని ఆత్మ నివసించు ఆలయాన్ని అపవిత్రపరుచును. "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించు చున్నాడనియు మీరెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసిన యెడల దేవుడు వానిని

పాడుచేయును" (I కొరింథీ 3:16,17). మనము దేవుని ఆలయమై యున్నాము గనుక, దేవునితో పాడుచేయ బడకుండు నిమిత్తము మన దేహములను అపవిత్ర పరచకూడదు.

పాపమును గూర్చి మతశాఖల వారు వివిధ రీతులుగా బోధింతురు. ఆత్మయే పాపం చేయునుగాని దేహము కాదని కొందరంటారు. మరి కొందరేమో శరీరమే గాని ఆత్మ పాపము చేయ దంటారు. అయితే ఈ సమస్యకు బైబిలే జవాబిచ్చుచున్నది: "పాపము చేయువాడే మరణమునొందును" (The Soul That sinneth, it shall die) అనియెహెజ్కేలు 18:4లో పరిశుద్ధాత్ముడు చెప్పాడు గనుక "శరీర దురాశలకు లోబడునట్లుగా చావు నకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి'' యని అపొ.పౌలు చెప్పాడు (రోమా 6:12). మరల శరీర కార్యములు చేయు వారు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొనరని అతడు చెప్పాడు. అవేవనగా,"జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితోకూడిన ఆటపాటలు మొదలైనవి" (గలతీ 5:20-21).

మానవుని ఆత్మ పాపము చేయును. ఆ పాపము శరీరముతో చేయును. అందువలనే "మీ ఆత్మయు, జీవమును శరీరమును మన ప్రభువైన యేసు రాకడయందు నిందా రహితము గాను సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడు బడును గాక" యని పౌలు ప్రార్థించాడు (I థెస్స 5:23).


కొందరు పొగత్రాగుచు, వారి దేహములను దేవునికి పవిత్రమైన ఆలయముగా యుంచుచున్నామని తలస్తారు. అయితే "పరిశుద్ధమును దేవునికి అనుకూలమైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనాలని" మనకు చెప్పబడి యున్నది (రోమా 12:1). క్రైస్తవులైన వారు పొగత్రాగుచు, మద్యపానము వగయిరా చేయుచు తమ శరీరములను పవిత్రముగా ఎట్లుంచు కొనగలరో నేనెరుగను. పొగత్రాగుట వలన శరీరానికి ఎంత హాని కలుగునో ఏ వైద్యుని అడిగినా చెప్పును. రోగియైన వానికి వైద్యుడ వసరమని యేసు చెప్పారు. సిగరెట్లు తయారుచేసే కంపెనీల వాళ్ళే పొగ త్రాగుట హానికరమని చెబుతారు. అట్లు ప్రకటిస్తారు. అయినా కోట్లాది ప్రజలు తమ డబ్బిచ్చి హాని కొనితెచ్చు కొను చున్నారు.

క్రైస్తవులు తమ శరీరములను పవిత్రముగా ఉంచుకోవాలి. ఆత్మ నివసించు గృహమది. మన శరీరాలను పాడు చేసుకొంటే దేవుడు మనలనే బాధ్యులుగా ఎంచును. అందువలన మన హృదయాలను, దేహములను ఎల్లవేళలా పవిత్రంగా ఉంచుకోవాలి.

– జాన్ హేరిస్

# సత్యసంఘమును గుర్తించుట
## (Identifying The True Church)

**- Rod Rutherford**



ప్రపంచమందు నేడు అనేక మత శాఖలున్నాయి. అవి విభిన్న నామములు ధరించి, పరస్పర విరుద్ధ బోధలను కలిగి యుండి కూడ దేవుని మార్గాన్నే అనుసరించు చున్నట్లు ప్రకటించు చున్నవి. ఈ బోధలన్నియు యధార్థ మైనవైతే దేవుడు ఈ కలవరానికి కర్తయై యున్నాడా?

సత్య సంఘాన్ని నీవెట్లు కనుగొనగలవు? మానవుల మనో భావాలు గాని కల్పిత బోధలుగాని, పారం పర్యాచారములు గాని అధికార యుక్తమైన దేవుని చిత్తము కాజాలవు. దైవావేశ పూరితమైన, సంపూర్ణమైన యదార్ధమైన దేవుని చిత్తమును బైబిలు మనకు తెలియ జేయుచున్నది. (2 తిమోతి 3:16;2 పేతు 1:3;యూదా3). దేవుని సంఘమును గూర్చి మనం తెలిసి కోవాలంటే లేఖనాలే అధారం.

### ఒక పథకం ప్రకారం సంఘము నిర్మింపబడినది

ఏదైనా ఒకటి నిర్మించుటకు దేవుడు ఒక ప్రణాళికను సిద్ధపరచెను. నోవహు ఓడ నిర్మించే పథకాన్ని దేవుడను గ్రహించెను (ఆది 6:14-16). దేవుని సంతోషపరచుట కొరకు ఆయన పథకాన్ని నోవహు జాగ్రత్తగా అను సరించెను (ఆది 6:22). ప్రత్యక్షపు గుడారము యొక్క నమూనాను మోషేకు దేవుడు తెలియజేయగా, అతడు దేవుని పథకమును శ్రద్ధగా అనుసరించెను (నిర్గమ 25:9, 40:39:32). ఆ తరువాత

దేవుని మందిర నిర్మాణమును గూర్చి దేవుడు తెలియజేసిన పథకమును దావీదు అతని కుమారుడైన సోలోమోనును అనుసరించెను (1దిన 28:11-21).

క్రొత్త నిబంధన దేవుని సంఘము యొక్క స్వరూపమును గూర్చి తెలియ జేయుచున్నదను సత్యమును గూర్చి ఆశ్చర్య పడవలసిన పనిలేదు (రోమా 6:17; 2 తిమో 1:13; హెబ్రీ 8:1-5). సత్య సంఘమును నీవు కనుగొనవలె నంటే నూతన నిబంధన యొద్దకు వెళ్లాలి. క్రొత్త నిబంధన తెలియజేసిన నమూనాను అనుసరించి సంఘము నిర్మింపబడితే అదే సత్యమైన సంఘమౌతుంది. దేవుని వాక్యము ననుసరించి గాక, వేరేమార్గంతో నిర్మించబడిన సంఘము సత్య సంఘము కానేరదు.

### క్రీస్తు ఆయన సంఘము

క్రొత్త నిబంధన ప్రకారము యేసు క్రీస్తే సంఘస్థాపకుడు, పునాది మరియు శిరస్సు. సీమోను పేతురు "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తు అని ఒప్పుకొనిన వెంటనే "నీవు పేతురువు ఈ బండమీద నా సంఘ మును కట్టుదును" అని క్రీస్తు సెలవిచ్చెను (మత్త 16:18-20). ఈ బండ పేతురు కాదు. సంఘము ఎట్టి పునాదిపై నిర్మింపబడినదో బైబిలులో స్పష్టముగా తెలియజేయ బడినది. "వేయబడినది తప్ప మరియొక పునాది ఎవడును వేయనేరడు. ఈ పునాది యేసుక్రీస్తే" (I కొరింథీ 3:11).

తన సంఘమును స్థాపింతునని క్రీస్తు ముందుగానే వాగ్దానము చేసెను. ఆయన భూమిమీద తనపనిని నెరవేర్చి తండ్రి యొద్దకు వెళ్ళి సర్వ సత్యములోనికి వారిని నడిపించునట్లు అపొస్తలుల యొద్దకు ఆదరణ కర్తను పంపెను (యోహా 16:13; అపోకా 2:11). పునరుత్థానము తరువాత పెంతెకోస్తు పండుగ దినమున అపోస్తలులు పరిశుద్ధాత్మావేశము వలన సంపూర్ణమైన క్రీస్తు సువార్తను ప్రజలకు ప్రకటించిరి. అక్కడ వినుచున్న పాపులు "సహోదరులారా మేమేమి చేతుమని అడిగిరి. వారు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని హెచ్చరింపబడిరి" (అపొ.కా. 2:36-38). మూడువేల ఆత్మలు సువార్త ఆజ్ఞలకు విధేయులై సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2:41-47). ఇదియే క్రీస్తే సంఘము యొక్క ఆరంభము.

క్రీస్తే ఆయన సంఘమునకు శిరస్సు. క్రీస్తు ఆరోహణమునకు ముందు ఆయన ఈలాగు సెలవిచ్చెను. "పరలోక మందును భూమిమీదను నాకు సర్వాధి కారము ఇయ్యబడియున్నది" (మత్త 28:18). భూసంబంధమైన శిరస్సును గూర్చి ఎచ్చటను ప్రస్తావించ బడలేదు. క్రొత్త నిబంధనలో క్రీస్తు సంఘములు అని వ్రాయబడింది. సంఘ సభ్యులు క్రైస్తవులని పిలువబడిరి (అపో.కా. 4:12; 11:26; 1 పేతు 4:16)

## క్రీస్తు సంఘ పరిపాలన

క్రీస్తే శిరస్సుగా స్వయం పరి పాలన కలిగిన క్రీస్తు శరీరమైన ఆయన సంఘం అనేక ప్రాంతాలలో కూడుకొను చున్నది (రోమా 16:16; 1 కొరింథీ 1:2) ప్రతి స్థానిక సంఘము పెద్దలచే నడిపింప బడుచున్నది. వీరిని కాపరులని అధ్యక్షు లని, మీపైని నాయకులని క్రొత్త నిబంధన పిలుచు చున్నది. ఈ పేర్లలన్నియు ఒకే పనిని నిర్వహించు పెద్దలకు పర్యాయ పదములుగ ఇవ్వబడినవి (అపో.కా. 20:17,28; తీతు 1:5-19;1 పేతు 5:1-4). వీరు ఒకరికంటే ఎక్కువగా ఉండి సంఘముపై అధికారాన్ని కలిగి యుండే గుంపులు (Councils) సంఘ విధులను శాసించే అధికారుల సమూ హములు Synods సదస్సులను Conferences గూర్చి కొత్త నిబంధన ఎక్కడ ప్రస్తావించలేదు.

పరిచారకులు పెద్దల పర్యవేక్షణలో పనిచేయాలి (ఫిలిప్పీ 1:1). పెద్దలు పరిచారకులు వారి అర్హతలను బట్టి సంఘములో నియమింపబడాలి (1తిమోతి 3;తీతు1). సువార్తికుడు సువార్త ప్రకటించుచు పెద్దల పర్య వేక్షణలో పనిచేయాలి (2 తిమోతి 4:1-5)

## సంఘ ఆరాధన

దేవుడు ఇశ్రాయేలీయులకు పాత నిబంధనలో ఒక ఆరాధన క్రమమును ఏవిధముగా ఇచ్చెనో, అలాగే ఆయన సంఘమునకు ఒక ఆరాధన క్రమమును ఇచ్చెను (యోహా 4:23-24). మత శాఖలు అనుసరించునట్లు సుదీర్ఘమైన పూజాక్రమమువలెగాక, ఆయన తన సంఘమునకిచ్చిన ఆరాధన క్రమము చాలా సామాన్యమైనది, ఆత్మీయమైనది ఇది భౌతిక సంబంధమైన ఆరాధన కాదు.

క్రొత్త నిబంధన యందు అయిదు అంశాలున్నాయి. మొదటిది పాటలు, కీర్తనలు, ఆత్మసంబంధమైన పద్యములు పాడవలెనని హెచ్చరింపబడెను (ఎఫె 5:19; కొలస్స 3:16). క్రొత్త నిబంధన ఆరాధన యందు యాంత్రిక సంగీతము లేదు. సంఘము ప్రారంభమైన శతాబ్దాల అనంతరము కేథలిక్కులు వాయిద్యము లను ప్రవేశపెట్టిరి (2 యోహా 9-11; ప్రక 22:18-19). తరువాత వాయి ద్యాలతో పాటలు పాడే గుంపులు బయలు దేరినవి. ప్రతి క్రైస్తవుడు ఒకరి స్వరము మరొకరితో కలిపి దేవునికి పాటలు పాడుచు స్తుతులు చెల్లించాలి.

రెండవది క్రీస్తు అను మధ్యవర్తి ద్వారా తండ్రికి చేయు ప్రార్థన (అపో.కా. 2:42; 1 తిమో 2:1-8). మూడవది దేవుని వాక్యము ప్రకటించుట ఆయన ఆరాధనలో ఒక అంశము (మత్త 28:19-20; అపో.కా. 2:42,20:7). నాలుగవది మన పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు శరీరము గాయపర్చబడి, తన రక్తమును చిందించిన బలియాగ మునకు జ్ఞాపకముగ ప్రతి ఆదివారము

సంఘములో క్రైస్తవులు పులియని రొట్టెను ద్రాక్షారసమును తీసుకొనవలసి యున్నది. ఐదవది వర్ధిల్లిన కొలది ఇచ్చుట ద్వారా క్రైస్తవులు ఆరాధించవలెను (I కొరింథీ 16:2;2 కొరి 9:7) సంఘము యొక్క విధులు సమకూర్చబడునట్లు వారమునకు ఒక్క సారే హృదయ పూర్వకముగ ఇచ్చినది తప్ప వేరే పద్ధతి క్రొత్త నిబంధన యందు కనపడదు.

**సంఘము యొక్క పని**

అనేక ఆధునిక సంఘాలు సంక్షేమ సంస్థలుగ కనబడుచున్నవి. అవి ఆత్మ సంబంధమైనవిగ నుండక, రాజకీయము గను, మానసిక వికాస కేంద్రాలుగను, స్వచ్ఛంధ సేవా సంస్థలుగను ఉన్నాయి. సత్య సంఘము క్రొత్త నిబంధనతో దేవుడిచ్చిన కట్టడాలను అనుసరింపవలసి యున్నది. క్రీస్తు సువార్తను ప్రకటించుటయే సంఘము యొక్క ముఖ్యమైన పని (మత్త 28:19-20; రోమా 10:13-15; 2 తిమో 2:2).

ఏ సంఘమైతే సువార్త ప్రకటించు పనికి ప్రాముఖ్యము నిచ్చు స్వభావము ఆసక్తి కలిగి లేదో అది సత్య సంఘము కానేరదు!

అవసరాలలో ఉన్నవారికి సహాయ మందించుట కూడ సంఘము యొక్క పనియే. విధవరాండ్రను, అనాధలను, అవసరాలలో ఉన్నవారిని ఆదుకొనుట ద్వారా సంఘము దేవుని నియమమునకు లోబడినదై యుండును (యాకో 1:27). సంఘము, వ్యక్తిగత క్రైస్తవులు, దాతృత్వము కలిగినవారుగ ఉండాలి (మత్త 25:31-36). సంఘము అవసరాలలో ఉన్నవారిని ఆదుకొనే స్వభావం కలిగియుండాలి (గలతి 1:2; 6:10).

**ప్రవేశము కొరకు ఇవ్వబడిన ఆజ్ఞలు**

సంఘము క్రీస్తు రక్తముచేత కొనబడెను (అపొ.కా. 20:28). క్రీస్తు సంఘములో నుండుట అంటే క్రీస్తు నందుండుటయే (ఎఫె 1:7:గలతి 3:27). గనుక క్రీస్తు సంఘమందు సభ్యత్వము అత్యవసరము అయితే క్రీస్తు సంఘములో ఒకడు సభ్యుడెట్లుకాగలడు? లేదా రక్షణ పొందుటకు ఒకడు ఏమి చేయవలెను?

దేవుని వాక్యము రాజ్యము యొక్క విత్తనము (లూకా 8:11). ఈ విత్తనము మనుష్యుల హృదయాలలో విత్త బడాలి (యాకో 1:18,21; 1పేతు 1:22-23). మంచితనము, నిజాయితీ గల హృదయాలలో ఈ విత్తనము క్రీస్తు నందు ఫలించు విశ్వాసమును కలి గించును (లూకా 8:15; రోమా 10:17; యోహా 8:24). నిజమైన విశ్వాసము ఒకనిని విధేయుడగుటకు ప్రోత్స హించును (యాకో 2:20-26; హెబ్రీ 5:8-9). విశ్వాసము ఒకని గత పాపముల నుండి మారుమనస్సు పొందుటకు ప్రోత్స హించును (అపొ.కా. 2:38, 17:30-31). మారుమనస్సు అనగా హృదయములు మార్చబడుట. ఇది దైవచిత్తానుసారమైన దుఃఖము ద్వారా హృదయము

మార్చబడునట్లు ఒకనిని ప్రోత్సహించును (మత్త 21:28; 2 కొరి 7:10; మత్త 3:8). నిజమైన విశ్వాసము ఒకనిని యేసు క్రీస్తే ఆయన జీవముగల దేవుని కుమారుడనియు ఒప్పుకొనునట్లు ప్రోత్సహించును (అపో.కా. 8:37; రోమా 10:8-10). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందకుండ ఒకని విశ్వాసము సంపూర్ణము కానేరదు (రోమా 6:35; కొలస్స 2:12) బాప్తిస్మము రక్షించును (మార్కు 16:16; 1పేతురు 3:21). బాప్తిస్మము పాపములను కడిగివేయును (అపో.కా. 22:16). బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తము (అ.కా. 2:38). బాప్తిస్మము ఒకని క్రీస్తునందుంచును (1 కొరి12:13; 1 కొలస్స 1:18). బాప్తిస్మము పొందని క్రైస్తవుడు ఉన్నట్లు దేవుని వాక్యమందు ఎచ్చటను కనపడదు.


## నీవు ఎక్కడ ఉన్నావు?

చదువరీ, నీవు ఎక్కడ ఉన్నావు? నీవు సభ్యుడవుగా నున్న సంఘము కొత్త నిబంధన తెలియజేసిన సంఘమేనా? క్రొత్త నిబంధన నియమమును బట్టి కట్టుబడి క్రొత్త నిబంధన ఆజ్ఞలను ఆ సంఘము పాటించుచున్నదా? ఒక వేళ అందు ఏది కొదువుగా ఉన్నను అది సత్య సంఘము కాదు.

ఒక వేళ నీవు సత్య సంఘమును వెదకుచున్నావేమో? దీనికి బదులుగా ఉన్నదానికి (Substitute) నీవు అంగీక రింప వద్దు. అది ఒక అవకాశ మని నీవు భావించకు. బైబిలు మాత్రమే నీకు మార్గదర్శి. దేవుని వాక్యమును అనుస రించేవారు సత్యమార్గమందు ఉన్నవారే. వక్ర మార్గానికి వాక్యము చోటివ్వదు. దైవికమైన మార్గము ద్వారా నేడే నిజమైన క్రీస్తు సత్య సంఘమందు సభ్యుడవు కమ్ము.

మమ్ము సంప్రదించిన యెడల మేము సత్యము గూర్చి మరియు రక్షణ కొరకైన నీ కోరిక నెరవేర్చబడునట్లు వాక్యముతో మీకు సహకరించెదము.


– రాడ్ రూథర్‌ఫర్డ్



# ప్రార్థన శక్తి

## (The Power of Prayer)

**- Dalton Key**



ఎపఫ్రా మా ప్రియుడైన తోడి దాసుడని, నమ్మకమైన క్రీస్తు పరి చారకుడని లేఖనములలో చెప్పబడి యున్నది (కొలస్స 1:7). కొలస్సయలోని సంఘము విషయమై అతడు ఆత్మయందు తీవ్రతగల వాడని, లవొదికయ వారి కొరకును హియెరా పొలి వారి కొరకును అతడు బహుప్రయాస పడువాడని కూడ చెప్ప బడినది (కొలస్స 4:13). ఈ క్రీస్తు దాసుడు సంఘాభివృద్ధి కొరకును, సంక్షేమము కొరకు ఎల్లప్పుడు తన ప్రార్థనలలో పోరాడు చుండువాడు (కొలస్స 4:12).

అయితే ఎపఫ్రా తన ఆసక్తిని ఎట్లు నడిపించాడు? అతడు తీవ్రముగా ఎట్లు పోరాడాడు? కొలస్స 4:12 ఇట్లు చెప్పుచున్నది. "మీలో ఒకడును క్రీస్తు దాసుడునైన ఎపఫ్రామీకు వందనములు చెప్పుచున్నాడు; మీరు సంపూర్ణులుగా ప్రతి విషయములో దేవుని చిత్తమును గూర్చి సంపూర్ణాత్మ నిశ్చయత గలవారునై నిలుకడగా ఉండవలెనని యితడెల్ల ప్పుడును మీ కొరకు తన ప్రార్థనలలో పోరాడు చున్నాడు". అతడు సంఘము యెడల తనకున్న ఆసక్తిని బయలు పరచాడు. సంఘము కొరకు ప్రార్థించుచు దాని కొరకు పాటుపడ్డాడు.


మనము సంఘాభివృద్ధికి ప్రార్థించుటయే గాక ఇంకా ఎక్కువ చేయాలనునది నిజమే. వాక్యమును ప్రకటించాలని మనకు చెప్పబడినది(అపో.కా. 8:4). ఒకరినొకరు హెచ్చరించాలి, పురికొల్పాలి (హెబ్రీ 3:13; ఎఫెసీ 4:29). "సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారి యెడలను" మనము మేలు చేయాలి (గలతీ 6:10).

అయినను మనము ప్రార్థనపై గాక ప్రయత్నాలపై ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చుచున్నాము. యెరూషలేము సంఘము తమకు పరిచర్య చేయు నిమిత్తము మంచి పేరుపొందిన యేడుగురు మనుష్యులను ఏర్పరచు కొనాలని అపొస్తలులు చెప్పారు. "మేము ప్రార్థనయందును వాక్య పరిచర్య యందును ఎడతెగక యుందుమని" వారు తెలియజేశారు (అపో.కా. 6:3,4). "మనుష్యులు విసుగక నిత్యము ప్రార్థన చేయవలెనని" యేసు బోధించారు (లూకా 18:1). పౌలు సహోదరుల కొరకు తరుచు ప్రార్థించేవాడు; సహోదరులు అతని కొరకు ప్రార్థించాలని కోరేవాడు (కొలస్స 4:1; 1:3).

ఒక సంవత్సరము ముట్టుకు అనవసరంగా చింతించే కన్నా ఒక గంట ప్రార్థనలో గడిపితే మనం ఎక్కువ సాధించగలము. ప్రార్థన వలన మనం ఎక్కువ సాధించగలము. "నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలము గలదై యుండును" (యాకోబు 5:16).

ప్రార్థనలో గడిపే పెద్దలు, పరిచారకులు, సువార్తికులు, ఉప దేశకులు, సభ్యులు సంఘమునకు అత్యవసరము. మనలోకం మరొక వైపు పరుగెడుచున్నది. దేవుని పరిశుద్ధులు ఈ చీకటి లోకంలో తమ వెలుగును ప్రకాశింపజేయాలి. మనం ప్రార్థన శక్తిపై ఎక్కువ ఆధార పడాలి. మీరు దేవుని గొప్ప పనిలో ప్రయోజకులు కాగలరు. సంఘము కొరకు, ప్రభువు కొరకు తీవ్రమైన ఆసక్తి కలిగి యుండాలి. భౌతిక అవాంతరములను శారీరక బలహీన తలను అధిగమించి ప్రార్థన శక్తితో దేవుని కొరకు పని చేయాలి!!

– డాల్టన్ కీ



# "నా నోటి మాటలు...."

## ("Let the word of my Mouth")

**- Jimmy Jividen**



ఒక మనుష్యుని సంభాషణను గూర్చి బైబిలు ఆలోచింపదగు హెచ్చరికల నిచ్చు చున్నది. ''స్వాతంత్ర్యము ఇచ్చు నియమము చొప్పున తీర్పుపొందబోవు వారికి తగినట్టుగా మాటలాడుడి; ఆలాగు ననే ప్రవర్తించుడి" (యాకోబు 2:12).

మాటలు శక్తివంతమైనవి. అవి తాత్కాలికంగా వినబడు శబ్ద తరంగాలే అయినా వాటి ప్రభావము శక్తివంత మైనది. వాటికి భౌతిక రూపం అంటూ యేమీ లేదు. గాని మానవ హృదయ భావములను అవి బాహ్యాపరచును. ఎదుటివాని స్వభావమును తెలిసి కొనుటకు అవి ఉపయోగపడును. ఒకని నుండి మరొకరికి జ్ఞానము ప్రసాదించు సాధనములు అవి. మాటలు మనుష్యు లను ప్రభావితము చేయును.

### మనుష్యులు లోకమును మార్చుదురు

మాటలు మానవుని కొలవేయును. అతడేమైయున్నాడో అవి తెలియజేయును. వైద్యుడు శరీరాన్ని పరీక్షచేసి ఒకని ఆరోగ్యస్థితిని అంచనావేయును. గాని అతని మాటలు మాత్రమే నిజముగా

అతడేమైయున్నాడో తెలియ జేయును. "హృదయము నిండి యున్న దానినిబట్టి ఒకని నోరు మాటలాడును" అని యేసు చెప్పెను (మత్తయి 12:34). ఒకడు మరొకని హృదయాన్ని కనుగొనాలంటే, అతని సంభాషణ వింటేచాలు. మాటలతో వేషధారి కొంత కాలము మోసగించ వచ్చును, గాని త్వరలో అతని మాటలే అతని బయలుపరుచును.

తాను మాటలాడు ప్రతిమాటకు మానవుడు బాధ్యుడు. ఒకని మాటలు అతని హృదయాన్ని బహిర్గతము చేయును. ఈ లోకంలో మంచిని గాని చెడునుగాని సాధించుటకు అవి సాధనములు. దేవుడు వాటిని నిర్లక్ష్యము చేయరు. మానవుడు మాటలాడు ప్రతి మాటకు అతనికి తీర్పు చెప్పబడును. అవి అతని గమ్యాన్ని నిర్ధారించును. "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు పొందుదువు, నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు పొందుదువు అని యేసు చెప్పెను" (మత్తయి 12:36-37).

ఒకని మాటలను బట్టియే ఆ మనుష్యుని నిత్య గమ్యము నిర్ధారించ బడును. ఒక మనుష్యుని సంభాషణ ఎంత ప్రాముఖ్యమో యాకోబు ఇట్లు వర్ణించుచున్నాడు: "అనేక విషయములలో మనమందరము తప్పిపోవు చున్నాము. ఎవడైనను మాటయందు తప్పని యెడల అట్టి వాడు లోపము లేనివాడై తన సర్వ శరీరమును స్వాధీనమందుంచు కొన శక్తిగల వాడగును" (యాకోబు 3:2). మానవుడు మాట తప్పుటకు అనేక మార్గములున్నవి. వాటిలో ఏదో ఒక దానివలన అతని ఆత్మ శిక్షించబడును.

## మోసకరమైన నాలుక

యేసు జీవించిన కాలములో ప్రజలలో యదార్థత లోపించెను. మత సంబంధ ప్రజలు సయితము సత్యము పలుకు బాధ్యతను విస్మరించిరి. ఆ రోజుల్లో నమ్మకము కలిగించుటకు ఒట్టుపెట్టుకొనుట పరపాటి. అయినను అది పనిచేయలేదు. ఒకని హృదయం మోసపూరితమై దేవాలయము తోడని ఒట్టుపెట్టుకొన్నా ప్రయోజనము లేక పోయింది (మత్తయి 23:6). అంత అక్రమ యుగంలో యేసు ఇట్లు బోధించారు: "నేను మీతో చెప్పునదే మనగా-ఎంత మాత్రము ఒట్టు పెట్టు కొనవద్దు. ఆకాశము తోడనవద్దు, అది దేవుని సింహాసనము, భూమితోడనవద్దు అని ఆయన పాదపీఠము యెరూషలేము తోడనవద్దు, అది మహారాజు పట్టణము. నీ తలతోడని ఒట్టు పెట్టుకొన వద్దు. నీవు ఒక వెండ్రుకనైనను తెలుపుగా గాని నలుపుగా గాని చేయలేవు. మీమ్మాట


అవునంటే అవును కాదంటే కాదు అని యుండవలెను. వీటికి మించునది దుష్టుని నుండి పుట్టును" (మత్తయి 5:34-37).

యేసును వెంబడించువాడు తన యదార్థను గూర్చి ఒట్టు పెట్టుకొన నవుసరంలేదు. అతని మాటలు అవునంటే అవును, కాదంటే కాదు. అంతే!

మోసము అపవాదియొక్క పురాతన అస్త్రము. హవ్వను మోసగించుటకు వాడు దానిని ఉపయోగించాడు (ఆది.కా. 7:4). అరణ్యములో యేసును మోసగించాలని అతడు దానిని వాడాడు (మత్తయి 4:9). అననీయను మోసగించుటకు వాడు దానిని ఉపయోగించాడు (అపో.కా. 5:14). అపవాది నేడును తన పనిని కొనసాగించుటకొరకు దానిని వాడుచున్నాడు. అబద్ధికులందరు అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురని దేవుడు చెప్పారు (ప్రక 21:8). అబద్ధమును జరిగించు వాడెవడును పరలోకములో ప్రవేశింపడు (ప్రక 21:27). అబద్ధికుడు అబద్ధములాడుట మానుకోవాలి లేదా పరలోకమును కోల్పోవాలి. అతడు రెంటింటిని పాటించ లేడు.

క్రైస్తవుడెప్పుడు అసత్యమాటలు పలుకకూడదు. "సత్యమునకు విరోధముగా అబద్ధమాడవద్దు" అని బైబిలు చెప్పుచున్నది (యాకోబు 3:14). "ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి, ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి నవీన స్వభావమును ధరించుకొని యున్నారు" (కొలస్స 3:9-10). క్రైస్తవుడెన్నడు ఒట్టు పెట్టుకొనరాదు. అతడు క్రీస్తు శిష్యుడు గనుక ఎల్లవేళలా సత్యమునే పలుకును. "మీరు అబద్ధమాడుటమాని ప్రతి వాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను" (ఎఫెసీ 4:25).

– జిమ్మీ జివేదన్



# నీ వింకను బాటిల్‌తోనే యున్నావా?

## (Are you still on the Bottle?)

**-Bill Dillon**



నీవింకను బాటిల్‌తోనేయున్నావా? బీరు, విస్కీ బాటిల్ కాదు, పాల సీసా! అపొ.పౌలు కొరింథీయులకు మొదటి సారి వ్రాసన్తూ ''సహోదరులారా, ఆత్మ సంబంధమైన మనుష్యులతో మాటలాడి నట్లు నేను మీతో మాటలాడలేక పోతిని. శరీర సంబంధ మనుష్యులే అనియు క్రీస్తునందు పసిబిడ్డలే అనియు మీతో మాటలాడవలసి వచ్చెను. అప్పటిలో మీకు బలము చాలక పోయినందున పాల తోనే మిమ్మును పెంచితిని గాని అన్నముతో మిమ్మును పెంచలేదు (I కొరింథీ 3:1-2).

కొరింథీయులలో ఆత్మీయాభివృద్ధి, బలము లేనందున వారు ఖండించ బడ్డారు. వారికి తరుణము, సమయము కూడ లభించినది గాని ఆత్మీయముగా వారు బలహీనులుగానే యుండి పోయారు. వారు ఆత్మీయ మరుగుజ్జులు! వారు పెరుగుచు బలమైన ఆహారమును గైకొన వలసి యున్నది, గాని వారింకా బాటిల్‌తోనే పాలు త్రాగుచున్నారు!

కొరింథీయుల వంటివారి వలె క్రీస్తు సంఘములో నేడు అనేకులున్నారు. వారికి ఎల్లప్పుడు బోధింపబడాలి, వారు బోధించరు.గాని ఏచిన్న అసౌకర్యము కలిగినా ముందు గొడవ చేస్తారు. వారు యితరులను ఎన్నడు ప్రోత్సహించరు, గాని వారే ప్రోత్సహించబడాలి. లోతైన ఆత్మీయ సమస్యలను వారు ఎన్నడు అధిగమించరు. వాటి విషయమై అవ గాహన వారికి వుండదు.

హెబ్రీ పత్రిక లేఖకుడిట్లను చున్నాడు: ''కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసిన వారై యుండగా దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరల బోధింప వలసి వచ్చెను. మీరు పాలుత్రాగ వలసిన వారే గాని బలమైన ఆహారము తినగలవారు కారు. మరియు పాలు త్రాగు ప్రతివాడును శిశువేగనుక నీతి వాక్య విషయములో అనుభవము లేని వాడైయున్నాడు. వయస్సు వచ్చిన వారు అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును'' (హెబ్రీ 5:12-4).

దీనిని బట్టి క్రీస్తు సంఘములలో ఉపదేశకుల కొరత ఎందుకున్నదో మనము గ్రహించుకొనగలము. దేవుని బిడ్డయైన ప్రతివాడు ఆసక్తి గల విద్యార్థి వలె బైబిలును చదువుచు యితరులకు సువార్త బోధించుబలమైన సువార్తకుని వలె తయారగునుగాక! బాటిల్‌ను విసర్జించి బైబిలును లోతుగా అధ్యయనము చేయుదము గాక!

– బిల్ డిల్లాన్

# గోధుమలు-గురుగులు

## (The Wheat and the Tares)

మత్తయి 13: 24-30, 36-43

**- Rouis Rushmore**



యేసు భావార్థము చెప్పిన రెండవ ఉపమానము గురుగులను గూర్చినది. మొదటిది విత్తువాని గూర్చినది. యేసు మాటలను వినుచున్న వారందరికీ ఈ ఉపమానములలో యున్న వృత్తాంతము ఎరుకే. ఈ రెండింటిలోను ఒక విత్తువాడు, మంచి విత్తనము కనబడును. విత్తువాని ఉపమానములో, క్రీస్తుతో సహా నీతిమంతుడెవడైనను విత్తువాడే. గురుగులను గూర్చిన దాని విషయములో మంచి విత్తనము విత్తిన యజమాని యేసుక్రీస్తు మాత్రమే. విత్తువాని ఉపమానములో దేవుని వాక్యము విత్తన మని చెప్పబడినది. అయితే గురుగుల ఉపమానములో మంచి విత్తనము నీతిమంతులను సూచించుచున్నది. గురుగులు అనీతిమంతులకు రూపముగా యున్నది.

తదుపరి రాజ్యము అనుమాట వేర్వేరుగా ఈ రెండు ఉపమానములలో వాడబడినది. బైబిలులో 'రాజ్యము'

అనుమాట ఆత్మీయ సందర్భములో దేవుని రాజ్యాధికారమును సూచించుచున్నది, అది సంఘమును సూచించును. విత్తు వాని ఉపమానములో ఈ భావముతో అది వినియోగించబడెను (మత్త 13:19; లూకా 8:1). గురుగులను గూర్చిన ఉపమానములోను, మీనాలను గూర్చిన ఉపమానములోను (లూకా19:11-27), రాజ్యము అనుమాట ఈ లోకమును సూచించును. అందులో నీతి మంతులు, అనీతిమంతులు యుందురు. గురుగులను గూర్చిన ఉపమానములో రెండు ప్రశ్నలుద్భవించును, రెండు జవాబు లీయబడెను.

**ఉపమానము:**

"మరియు ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను, ఏమనగా పరలోక రాజ్యము తన పొలములో మంచి విత్తనము విత్తిన యొక మనుష్యుని పోలియున్నది. మనుష్యులు నిద్రించుచుండగా అతని శత్రువు వచ్చి గోధుమల మధ్య గురుగులు విత్తిపోయెను. మొలకలు పెరిగి గింజపట్టినప్పుడు గురుగులు కూడ అగుపడెను. అప్పుడు ఇంటి యజమానుని దాసులు అతని యొద్దకు వచ్చి- అయ్యా నీవు నీపొలములో మంచి విత్తనము విత్తితివిగదా, అందులో గరుగు లెక్కడనుండి వచ్చినవని అడిగిరి. ఇది శత్రువు చేసిన పని అని అతడు వారితో చెప్పగా, ఆదాసులు మేము వెళ్లి వాటిని పెరికి కూర్చుట నీకిష్టమా? అని అతనిని అడిగిరి. అందుకతడు, వద్దు గురుగులను పెరుకుచుండగా, వాటితో కూడ ఒకవేళ గోధుమలను పెల్లగింతురు. కోతకాలము వరకు రెంటిని కలిసి యెదుగ నియ్యుడి. కోతకాలమందు గురుగులను ముందుగా కూర్చి వాటిని కాల్చివేయుటకు కట్టలు కట్టి, గోధుమలను నాకొట్టులో చేర్చి పెట్టుడని కోతగాండ్రతో చెప్పుదుననెను" (మత్తయి 13:24-30).

"అప్పుడాయన జనసమూహములను పంపివేసి యింటిలోనికి వెళ్లగా ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చి- పొలములోని గురుగులను గూర్చిన ఉపమాన భావము మాకు తెలియజెప్పుమనిరి. అందుకాయన ఇట్లనెను- మంచి విత్తనము విత్తువాడు మనుష్య కుమారుడు; పొలము లోకము; మంచి విత్తనములు రాజ్య సంబంధులు; గురుగులు దుష్టుని సంబంధులు; వాటిని విత్తిన శత్రువు అపవాది; కోతయుగ సమాప్తి; కోతకోయువారు దేవదూతలు. గురుగులు ఏలాగు కూర్చబడి అగ్నిలో కాల్చివేయబడునో ఆలాగే యుగ సమాప్తి యందు జరుగును. మనుష్య కుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని, దుర్నీతి పరులను సమకూర్చి అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులుగలవాడు వినును గాక".

పొలము లోకమని యేసు వివరించెను. మంచి విత్తనము దేవుని రాజ్య సంబంధులు, గురుగులు దుష్టుని సంబంధులు, శత్రువు సాతాను. కోత యుగసమాప్తి. కోతకోయువారు దేవుని దూతలు. విత్తువాడు మనుష్యకుమారుడు (యేసే) యని యేసు వివరించారు. మనుష్య కుమారుడనుమాట క్రొత్త నిబంధనలో ఇంచుమించు 80 సార్లు మనకు కనబడతాది (అపో.కా.7:56).

గోధుమలు విత్తబడిన పొలము (లోకము) ప్రభువుకు చెందినది. ఆ యాస్థికి తానే యజమానినని యేసు ఇక్కడ చెప్పుచున్నారు. "ఆకాశమునీదే, భూమినీదే. లోకమును దాని పరిపూర్ణతను నీవే స్థాపించితివి" (కీర్తన 89:11). ఈ భౌతిక విశ్వము, భూమి, దానిమీదనున్న సమస్త సృష్టి, మన శరీరాత్మలు అన్నీ సృష్టికర్తయైన దేవునికే చెందును. "భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులను యెహోవావే" (కీర్తన 24:1).

మంచి విత్తనము, తద్వారా లభించిన పంట క్రైస్తవులు. గోధుమ పొలములో గోధుమ మొక్కలు కాని వేమైనను గురుగులే. ఈ రెండికీ మధ్య స్థలము యేదీలేదు. క్రైస్తవులు సహజంగా ఈ లోకములో యుంటారు. గాని వారు ఈ లోక సంబంధులు కారు (యోహాను 15:18-19; 17:9-18). క్రైస్తవులు ఈ లోకముననుకరించరాదు (రోమా 12:1-2; యాకోబు 4:4).

గోధుమల మధ్య గురుగులు మొలకెత్తడం విచారమే, ఆశ్చర్యమే. విత్తన రూపములోను, మొలకల రూపములోను గురుగులకు గోధుమలకు వ్యత్యాసము బహుశ కనబడదేమో. అయితే పంటకు వచ్చిన తరువాత ఆ వ్యత్యాసము మరింత స్పష్టముగా కనబడును. "కాబట్టి వారి ఫలముల వలన వారిని తెలిసికొందురు" అని అందుకే యేసు చెప్పారు (మత్తయి 7:20).

గోధుమల మధ్య గురుగులు మొలకెత్తడం వలన సమృద్ధియైన పంటకు ఆటంకము కలుగును. వాటివలన నకిలీ పంట తయారగును. అదే రీతిగా ఈలోక మతములు, మతశాఖలు దేవునితో నేరుగా సంబంధము కలిగియున్నామని చెప్పుకొనుచు, చవుకబారు రక్షణను, వేర్వేరు ఆకర్షణలను ప్రజలకు కల్పించుచున్నారు. కొన్ని మతశాఖలవారు ఆదిమ క్రైస్తవ్యమును చాలదగ్గరగా అనుకరిస్తారు. తదుపరి క్రీస్తు సంఘ ములో కూడ మారుమనస్సు పొందని వారు పాపములో జీవిస్తుయున్న వారుండ వచ్చును. వారిని గూర్చి మిగతా వారికి తెలియక పోవచ్చును. వారు నశించిన వారు. పాపములో యున్న వారిని మానవులు గుర్తించలేక పోవచ్చును. గాని దేవుని వారు మోసగించ లేరు. ఆయన నీతి మంతులను దుష్టులను వేరు చేయును (మత్తయి 25:31-46).

మనుష్యులు నిద్రించుచుండగా ఈ

గురుగులు విత్తబడెను. అంటే ఈ దుష్క్రియ రహస్యముగా, చీకటిలో చేయ బడెను. అందువలన నిద్రించుచున్న మనుష్యులను నిందించవలసిన పనిలేదు. మంచి పనివారు రాత్రులందు సహజంగా నిద్రపోవుదురుగదా. అపవాది, వాని అనుచరులకు భిన్నముగా యేసుక్రీస్తు, ఆయనపని వారు వెలుగులో పనిచేతురు (యోహాను 3:18-21). మనుష్యుల ఆత్మలను చీకటిలోనుండి వెలుగులోనికి మరల్చుటయే ప్రభువు యొక్కయు, ఆయన అనుచరుల యొక్కయు పనియై యున్నది (మత్తయి 5:14-16; అపో.కా. 26:16-18).

క్రీస్తు పనిని పాడుచేయడం అప వాదికి సంతోషం. సాతానుడు క్రీస్తుకు, ఆయన సంఘముకు శత్రువు. మనము చేయు ఆత్మీయ పోరాటము ఊహించ లేనంత గొప్పది. అది ఇప్పటి వరకు జరిగిన ప్రపంచ యుద్ధాలన్నిటి కంటె గొప్పది.

గురుగుల ఉపమానములో రెండవ విత్తువాడు శత్రువు, దుష్టుడు, అప వాదియని చెప్పబడినది (మత్తయి 13:25, 28, 38-39). ఈ కోణములలో చూస్తే శత్రువు గురుగులను విత్తినప్పుడు దురాక్రమణ చేయుచున్నాడు. గృహ యజమాని ఆస్థిలో రహస్యముగా ప్రవేశించి అతడు అతిక్రమించాడు. హానికలిగించు ఉద్దేశ్యముతో యజమాని ఆస్థిలో ప్రవేశించాడు గనుక వాడు శత్రువు. మరియు ముఖ్యముగా వాడు శత్రువు గనుక సహజముగా వానికి ప్రవేశము లేదు. ఈ శత్రువు పిరికివాడు కూడ.

కొంతకాలము పెరిగిన తరువాత గురుగులు మంచి పంటకు అభ్యంతర ములని వెంటనే గుర్తించబడెను. శత్రువు యొక్క అసహ్యస్వభావాన్ని వెళ్లగక్కుటకే గురుగులు విత్తబడెను. గోధుమల మధ్య గురుగులు విత్తబడినందున ఎవరికీ లాభము చేకూరదు. కోతకాలమందు గురుగులను వేరు చేయుటకు గృహ యజమాని సంకల్పించెను. గోధుమల నుండి గురుగులను కోతకాలమందు వేరు చేయడం, కష్టతరమైన దుఃఖకరమైన పని.

ఈ ఉపమానములో కోత యుగ సమాప్తిని, తీర్పును సూచించు చున్నది. గనుక యిది తీర్పును గూర్చిన ఉపమానము, అంతిమ తీర్పు తప్పక వచ్చును. నీతిమంతులు అనీతిమంతులు వేరుచేయబడుదురు (2 పేతురు 3:10,12; ప్రక 20:11-15; మత్త 24:31, 46). కోతయైన తీర్పు ఎప్పుడు వచ్చునో మనం ఎరుగక పోయినను, దేవుడు నిర్ణయించిన కాలమందు అది తప్పక సంభవించును (అపో.కా. 17:31).

కోతకోయువారు దేవుని దూతలు (మత్తయి 13:41; 25:31; యూదా: 14-15). గురుగుల అంతిమస్థితి నరకము (మత్తయి 5:22; హెబ్రీ 10:27; మార్కు 9:43, 48). గురుగులకు

గురుతుగా యున్న ఆత్మలు అగ్నిగుండములో పడవేయబడును. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్త 13:42). ఈ పదములు నరకము యొక్క యాతనను వర్ణించు చున్నవి. అది భయంకరమైన నిస్సహాయ ప్రదేశము (లూకా 10:19-31; ప్రకటన 20:11-15; మత్త 25:31-46).

సంతోషదాయకం యేమంటే మంచి విత్తనమైన గోధుమలను పోలిన ఆత్మలకు నిత్య బహుమానము లభించును (మత్త 13:43). చెవులు గలవాడు వినును గాక యను మాటలు, గురుగు లను పోలిన ఆత్మగలవారు వాక్యమును విని మార్పు జెందవచ్చునని హెచ్చరిక చేయుచున్నవి. క్రీస్తుయొక్క బోధనను సరించుటద్వారా నరకము నుండి తప్పించు కొనవచ్చును (రోమా 6:17-18; (I కొరింథీ 6:9-11).

**ముగింపు:**

ఈ లోకంలో మంచి, చెడుగు ఒక దాని ప్రక్కన ఒకటి ఉంటాయి. గాని చివరకు ఒకానొక దినమందు అవి వేరు చేయబడ్తాయి. ఇప్పటి మట్టుకైతే ఈ లోకం గోధుమలు గురుగులను పోలిన పొలమువలె యున్నది.

అంతిమ తీర్పు ఒకటి యున్నదని యేసుబోధించారు. పంట పెరిగిన తరువాత సంభవించుకోత దానికి గురుతుగా యున్నది. ప్రభువు మరల వచ్చువరకు అవి పెరుగుచు యుండును.



మనదేవుని కలసి కొనడానికి మనము సిద్ధపడాలి (ఆమోసు 4:12).

అపవాది ఒకడున్నాడు, వాడు ఉనికి కలిగియున్నాడని ప్రభువు బోధించారు. అపవాది ఉనికి ఎంత యదార్ధమో, నరకమును అంతే యదార్థ మని ఆయన బోధించారు. మనం కాంక్షించుచున్న పరలోకం ఎంత యదార్థమో, నరకము కూడ అంతే యదార్థము. దానిని మనం తప్పించు కోవాలి.

గురుగులను గూర్చిన ఉప మానము సంఘ క్రమ శిక్షణను గూర్చి బోధించుట లేదు. సంఘ క్రమశిక్షణ ఈ ఉపమానము లో బోధించ బడలేదు (రోమా 16:17-18; తీతు 3:10). అవసరం వచ్చినప్పుడు సంఘము క్రమ శిక్షణను అమలుపర్చాలి (I కొరింథీ 5).

చివరిగా 'వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము' ను ఈ ఉపమానము ఖండించుచున్నది. గురుగుల ఉప మానము వెయ్యేండ్ల పాలన సిద్ధాంతము పరస్పర విరుద్ధములు.

**- లూయిస్ రష్మోర్**

# మత సంబంధ చీలికలు

## (Religions Divisions)

**- Jerry Jenkins**

క్రైస్తవ మత సంబంధ చీలికల కంటె దుఃఖకరమైనది వేరొకటి లేదు. మనం ప్రేమించిన వారు మరణించినా మనబిడ్డలు మనపై తిరుగుబాటు చేసినా, భార్యభర్తల మధ్య విడాకులు సంభవించినా విచారకరమే. గాని ప్రభువును ప్రేమించువారికి స్థానిక సంఘములో చీలికలేర్పడుట ఎంతో దుఃఖకరము. అది సంఘము యొక్క విలువను తగ్గించును గనుక ఈ దుఃఖము భరింపలేనిది.

గెత్సమనే వనములో ప్రార్థించుచు యేసు సంఘముయొక్క విలువను ఘనముగా ఎంచారు. "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట నేలమీద పడుచున్న గొప్ప రక్తబిందువుల వలె ఆయెను" (లూకా 22:44). కొరడా దెబ్బలలో ఆయన రక్తము మరింత ధారాళమాయెను (యోహాను 19:1). ఆయన కాళ్లు చేతులలో వారు మేకులు దిగగొట్టగా ఆయన రక్తముతో నేల తడిచి ముద్దాయెను (లూకా 23:33). ఆయన శరీరము నుండి క్రిందపడిన ప్రతిరక్తపు బొట్టు ఆయన తన సంఘము నిమిత్తము వెచ్చించిన మూల్యము (ఎఫెసీ 5:23; అపో.కా. 20:28). సంఘము అంత ప్రాముఖ్యము కాదని ఆయన ఎన్నడు ఆలోచించనే లేదు.

మత సంబంధ చీలికలవలన కుటుంబములు, స్నేహితులును వేరగుదురు గనుక అవి గాయపరచును. నా మిత్రులు కొందరు నాయింట భోజనము చేయుదురుగాని, ఆదివారమునాడు నాతో క్రీస్తు సంఘమునకు రానొల్లరు. వారు తమ తమ మతశాఖలకు పోవుటకు ఇష్టపడతారు. ఎంత విచారకరము!

మత సంబంధ చీలికలు గాయపరచును. అవి సంఘముయొక్క ముఖ్యోద్దేశమును కించపరచును. నశించిన వారికి సువార్త ప్రకటించుటయే సంఘము యొక్క ముఖ్య ఉద్దేశ్యము. చీలికలవలన ఆరాధనకు రాకుండుటకు ప్రజలు సాకులు చెప్పుట కవకాశము దొరుకును. చీలికలవలన బంధువులు మిత్రులు సత్యమునకు విధేయులు కాకుండా యుందురు. ఏలయనగా మనము ప్రభువు కోరిన రీతిగా వెలుగు ప్రకాశింపక యుందుము (మత్తయి 5:16). గనుక మనలో ఎవడును మత సంబంధ చీలికలకు కారకులము కాకుందుము గాక!

– జెర్రీ జెంకిన్స్

# ప్రకృతి సంబంధియైన మనుష్యుడు
## (The Natural Man)

**- Parker Hendersen**



అపొ. పౌలు చెప్పిన ప్రకృతి సంబంధియైన మనుష్యుని గూర్చి నీవు ఎన్నడైనా ఆలోచించావా? అతడిట్లనుచున్నాడు: “ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు. అవి అతనికి వెర్రితనముగా యున్నవి. అవి ఆత్మానుభవము చేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపజాలడు” (I కొరింథీ 2:14).

పరిశుద్ధాత్మయొక్క అద్భుత సహాయము లేకుండా పాపియైనవాడు సువార్తను గ్రహించుకోలేడని పౌలు చెప్పుచున్నాడా? పై లేఖన భాగము అట్లు చెప్పుటలేదు గాని దాని అర్థమేమిటి? ఆ అధ్యాయములో ప్రకృతి సంబంధియైన మనుష్యుని గూర్చి చెప్పు వచనములను మనము చదువవలెను.

మొదటి వచనము నుండి ఆరంభిస్తు పౌలు “సహోదరులారా నేను మీ యొద్దకు వచ్చినప్పుడు వాక్చాతుర్యముతో గాని జ్ఞానాతిశయముతోగాని దేవుని మర్మమును మీకు ప్రకటించుచు వచ్చినవాడను కాను” అని చెప్పాడు (I కొరింథీ 2:1). “నేను యేసుక్రీస్తును, అనగా సిలువ వేయబడిన యేసుక్రీస్తును

తప్పమరి దేనిని మీ మధ్య నెరుగ కుందునని నిశ్చయించుకొంటిని". "నేను మాటలాడినను, సువార్త ప్రకటించినను జ్ఞానయుక్తమైన తియ్యని మాటలను విని యోగింపక పరిశుద్ధాత్మయు, దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే వినియోగించితిని'' అని చెప్పాడు (2:2-4). పౌలు బోధించిన సువార్త "ఈ లోకాధికారుల జ్ఞానము కాదుగాని, దేవుని జ్ఞానము మర్మమైనట్టుగా బోధించు చున్నాము. ఈ జ్ఞానము మరుగై యుండెను. జగదుత్పత్తికి ముందుగానే దేవుడు దీనిని తన మహిమ నిమిత్తము నియమించెను" (2:7). అది ఈలోకాధి కారులలో ఎవకిని తెలియలేదు; అది వారికి తెలిసి యుండిన యెడల మహిమా స్వరూపియగు ప్రభువును సిలువ వేయక పోయియుందురు" (2:8).

"ఇందును గూర్చి దేవుడు తన్ను ప్రేమించువారికి ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు. మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" (2:9). మానవుడు సువార్తను తనకుగా తాను తయారుచేయలేదు, అది మానవుని నుండి కాదుగాని దేవునినుండి కలిగినది. గనుక అదిమానవునికి బయలు పరచబడవలసి యుండెను. దాని తరువాత వచనములో దేవుడే దానికాధార భూతుడని పౌలు విపులీ కరించాడు. "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మవలన బయలు పరచి యున్నాడు" అని అతడు చెప్పెను (2:10). "ఒక మనుష్యుని సంగతులు అతనిలోనున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరిఎవనికి తెలియును? అలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవనికిని తెలియవు" (2:11). కావాలన్నా మనుష్యుడు సువార్తను సృష్టించలేడు, కల్పించలేడు. అది దేవుని వలన మానవు నికి బయలుపరచబడ వలసి యుండెను.

## దేవుడు దానిని బయలు పరచే వరకు మానవునికి సత్య సువార్త తెలియదు:

మరల పౌలు ఇట్లనుచున్నాడు: "దేవుని వలన మనకు దయచేయబడిన వాటిని తెలిసికొనుటకై మనము లౌకి కాత్మను కాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము" (I కొరి 2:12).

పరిశుద్ధాత్మ దేవునినుండి పౌలు సువార్తను పొందెననునది విశదముగా యున్నది. "మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో కాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతు లతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాట లతో వీటిని గూర్చియే మేము బోధించు చున్నాము" అని అతడు చెప్పెను (2:13). పరిశుద్ధాత్ముని బయల్పాటు వలననే పౌలు సువార్తను పొంది యుండెను. అంటే అతడు పలికిన మాటలు పరిశుద్ధాత్ముని మాటలన్నమాట. అపొస్తలులు, ప్రవక్తలు అందరు ఈ రీతిగానే ఈ సువార్త వాక్యమును పొంది యుండిరి.

## ప్రకృతి సంబంధియైన మనుష్యుడు:

తదుపరి వచనములో చెప్పబడిన ప్రకృతి సంబంధియైన మనుష్యుడు పౌలుకు సమానాంతరముగా చూపించ బడి యున్నాడు. ఈ ప్రకృతి సంబంధమైన మనుష్యుడెవరు? ఈ అపొస్తలుడే దానికి జవాబిచ్చాడు. "ఎట్లనగా క్రీస్తు మర్మము దేవదర్శనము వలన నాకు తెలియ పరచ బడినదను సంగతిని గూర్చిమునుపు సంక్షేపముగా వ్రాసితిని. మీరు దానిని చదివిన యెడల దానిని బట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించుకొన గలరు. ఈ మర్మమిప్పుడు ఆత్మ మూలముగా దేవుని పరిశుద్ధులగు అపొస్తులులకును ప్రవక్త లకును బయలు పరచబడి యున్నట్లుగా పూర్వకాలముల యందు మనుష్యులకు తెలియ పరచ బడలేదు" (ఎఫెసీ 3:3-5). ఈ వర్త మానమును దేవుడు అపొస్తులులకు, ప్రవక్తలకు బయలు పరచెను. గతంలో అది మర్మముగా యుండెను. గాని బయలు పరచబడిన దానిని వారు లోకమునకు లిఖించి యిచ్చిరి.

## బయలు పరచబడిన దానిని మనమెట్లు గ్రహించు కొనగలము?

"మీరు దానిని చదివిన యెడల గ్రహించు కొనగలరు" (ఎఫెసీ 3:3). అందుకే పౌలు తిమోతికి ఇట్లు వ్రాసాడు: "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను సత్యవాక్యమును సరిగా విభజించు వానిగాను నిన్నునీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమో 2:15). నిర్మలమైన వాక్యమను పాలను అపేక్షించుడియని పేతురు వ్రాసాడు (I పేతురు 2:2). గనుక వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగునని పౌలు చెప్పాడు (రోమా 10:17).

## ప్రకృతి సంబంధమైన మనుష్యుడు దేవుని బయల్పాటు లేకుండా యుండెను

అపొస్తలులు ప్రవక్తలు మర్మముగా యుండిన సువార్త సత్యమును పరిశుద్ధాత్మ ద్వారా పొందిన ఆత్మీయ మనుష్యులు. బయలు పరచబడిన మర్మమును అపొస్త లులు, ప్రవక్తలు గ్రంథస్థము చేసిరి. మంచి మనస్సుగల వారు దానిని చదివి, విని గ్రహించుకొనగలరు. దానిని విని విశ్వసించి విధేయత చూపినవారు రక్షింప బడుదురు. అదే అపొస్తలుల బోధయందు నిలకడగా యుండుట (అపొ.కా. 2:42). లిఖితపూర్వకమైన వాక్యము ద్వారా నేడు దేవుని ఆత్మ మనలను నడిపించును. అది రక్షించుటకు దేవుని శక్తియై యున్నది రోమా 1:16)

మనుష్యులందరు బైబిలు నొద్దకు మరల వలెనని క్రీస్తు సంఘములు ప్రపంచ మందంతటా విజ్ఞప్తి చేయు చున్నవి. బైబిలును చదవండి, విశ్వ సించండి, విధేయత చూపండి. అప్పుడు మనందరం క్రీస్తు స్థాపించిన సంఘములో యుండ గలము!!

– పార్కర్ హెండర్సన్

# శిష్యుని లక్షణములు

## (The Sign of a Disciple)

**- Colin Mckee**




యేసుక్రీస్తు తన శిష్యులకు "మీరు సమస్త జనములను నాకు శిష్యులనుగా చేయుడి" యని ఆజ్ఞాపించెను (మత్త 28:19). ఆయన శిష్యులైన వారు గుర్తు పట్టుబడాలి. క్రీస్తు యొక్క నిజమైన శిష్యులను ఈనాడు ఏలాగు మనం గుర్తించగలము? వారికున్న ప్రత్యేక లక్షణము లేమిటి?

సహోదర ప్రేమ వారి ప్రత్యేక లక్షణమని కొందరు చెప్తారు. యోహాను 13:34-35 ని బట్టి వారట్లు చెబుతారు: మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞఇచ్చుచున్నాను: నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను. మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురని" ప్రభువు వారికి చెప్పెను. క్రీస్తు శిష్యులు ఒండొరుల యెడల నిష్కపటమైన ప్రేమను తప్పక ప్రదర్శించాలి. యిందులో వెనుకబడితే శిష్యత్వములో వెనుక బడినట్లే.

అయితే ప్రేమ ఒక్కటి మాత్రమే శిష్యత్వపు లక్షణమని క్రీస్తువారు చెప్ప లేదు. లేఖనములలో మరికొన్ని శిష్యత్వపు లక్షణములు తెలియజేయ బడ్డాయి.

"మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుందురని" యోహాను 8:31లో ప్రభువు పల్కెను. ప్రేమను పాటించడం ఎంత ముఖ్యమో వాక్యమందు నిలిచియుండడం కూడ అంతే ప్రాముఖ్యము. ప్రేమ అనేక పాపములను కప్పును. అయితే వాక్యమందు నిలిచి యుండడానికి బదులుగా అది యుండదు. ఏలయనగా "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు" (2 యోహాను:9).

"మీరు బహుగా ఫలించుట వలన నా తండ్రి మహిమ పరచబడును: ఇందువలన మీరు నా శిష్యులగుదురు" అని ప్రభువు చెప్పెను (యోహాను 15:8). ప్రేమ వలె, ఫలములు ఫలించుట కూడ శిష్యత్వపు నిజలక్షణమై యున్నది. ప్రతి లక్షణము ప్రాముఖ్యమైనదే. ఒకడు యేసును ప్రగాఢంగా ప్రేమింపవచ్చును గాని అతడు వాక్యములో యుండక ఫలములు ఫలింపక యున్న యెడల అతడు నిజమైన శిష్యుడు కాదు.



"ఎవడైనను తన సిలువను మోసి కొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడని" లూకా 14:27లో ప్రభువు చెప్పెను. శిష్యుడైన వాడు శ్రమలను, భారములను, బాధ్యత లను వహించువాడై యుండాలి. ప్రేమ గలిగి, వాక్యమందు నిలిచియుండి, ఫలములు ఫలిస్తు శ్రమలను భారము లను, బాధ్యతలను వహించని వాడు శిష్యుడు కానేరడు.

మత్తయి 12:48-50 లో యేసు తన శిష్యులను గూర్చి చెబుతూ ఆత్మీయముగా వారే తన తల్లియు, సహోదరులును అని చెప్పెను. పరలోకమందున్న నాతండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడు, నా తల్లి యునని ఆయన చెప్పెను. ప్రభువు యొక్క శిష్యుడు ప్రతి సత్కార్యమును చేయుటకు పూర్ణముగా సిద్ధపడిన వాడు (2 తిమోతి 3:17).

– కోలిన్ మెక్‌గీ

# బోయజు యొక్క లక్షణములు

## (Characteristics of Boaz)

**- Stan Mitchell**



బోయజు సద్వర్తనుడు. అతని గుణగణములు మంచివి. మన జీవితంలో వాటిని అలవరచు కొనుటకు ప్రయత్నించుదాము: దిగువ నీయబడిన అతని లక్షణములను గమనించుము:

**1. యితరులను ఆశీర్వాద వచనముతో అతడు పలుకరించేవాడు:**

తన పనివారిని కూడ అట్లే పలుకరించేవాడు: "బోయజు బేత్లెహేము నుండి వచ్చి-యెహోవా మీకు తోడై యుండునుగాకని చేను కోయువారితో చెప్పెను" (రూతు 2:4). రూతును కూడ అతడు అట్లే పలుకరించెను. "అప్పుడు బోయజు రూతుతో-నాకుమారీ నా మాట వినుము, వేరొక పొలములో ఏరు కొనుటకు పోవద్దు, దీనిని విడిచి పోవద్దు, ఇచ్చట నా పని కత్తెల యొద్ద నిలకడగా ఉండుము" (రూతు 2:8). "యెహోవా నీవు చేసిన దానికి ప్రతిఫలమిచ్చును; ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా రెక్కల క్రింద సురక్షితముగా నుండునట్లు నీవు వచ్చితివి; ఆయన నీకు సంపూర్ణ బహుమాన మిచ్చును" (రూతు 2:12).

**2. యౌవన విధవరాలికి అతడు**

**సంరక్షణను, కనికరమును చూపెను:**

రూతుతో అతడిట్లు చెప్పెను: "వారు కోయు చేనుకనిపెట్టి వారిని వెంబడించుము, నిన్ను ముట్టకూడదని యౌవనస్థులకు ఆజ్ఞాపించియున్నాను. నీకు దాహమగునప్పుడు కుండల యొద్దకు పోయి పనివారు చేదిన నీళ్లు త్రాగుము'' (రూతు 2:9). భోజన సమయంలో అతడు "నీవిక్కడికి వచ్చి భోజనము చేసి చిరకలో నీ ముక్క ముంచి తినుమని ఆమెతో చెప్పగా చేను కోయువారియొద్ద ఆమె కూర్చుండెను. అతడు ఆమెకు పేలాలు అందియ్యగా ఆమె తిని తృప్తిపొంది కొన్ని మిగిల్చెను". (రూతు 2:14). అప్పుడు రూతు "అంతేకాదు అతడు నన్ను చూచి తనకు కలిగిన పంట కోత అంతయు ముగించు వరకు తన పని వారియొద్ద నిలకడగా ఉండుమని నాతో చెప్పెనని" తన అత్తతో చెప్పెను (రూతు 2:21).

మరల అతడు రూతుతో "నీవు వేసికొనిన దుప్పటి తెచ్చి పట్టుకొనుమని చెప్పగా ఆమె దాని పట్టెను. అతడు ఆరు కొలల యవలను కొలచి ఆమె భుజము మీద ఉంచగా ఆమె పురములోనికి వెళ్లెను" (3:15).

**3. రూతు తన అత్తయెడల చూపిన కనికరమును అతడు మరువలేదు:**

"బోయజు నీపెనిమిటి మరణించిన తరువాత నీవు నీ అత్తకు చేసినదంతయు నాకు తెలియబడెను. నీవు తలితండ్రులను నీ జన్మభూమిని విడిచి యింతకుముందు నీవు ఎరుగని జనము నొద్దకు వచ్చితివి" అని ఆమెతో చెప్పెను (2:11).

**4. అతడు ఆతిథ్యమిచ్చెను:**

"భోజన కాలమున నీవిక్కడికి వచ్చి చిరకలో నీముక్కముంచి తినుమని ఆమెతో చెప్పగా చేనుకోయువారి యొద్ద ఆమె కూర్చుండెను. అతడామెకు పేలాలు అందియ్యగా ఆమె తిని తృప్తి పొంది కొన్ని మిగిల్చెను. ఆమె యేరుకొనుటకు లేచి నప్పుడు బోయజు–ఆమె పనల మధ్యను ఏరుకొన వచ్చును, ఆమెను అవమాన పరచకుడి. మరియు ఆమె కొరకు పిడికెళ్లు పడవేసి ఆమె యేరుకొనునట్లు విడిచిపెట్టుడి. ఆమెను గద్దింప వద్దని తన దాసులకాజ్ఞాపించెను (2:14-16).

**5. అతడు కష్టపడి పనిచేయువాడు:**

"బోయజు మనస్సున సంతోషించు నట్లు అన్నపానములు పుచ్చుకొని లోపలికి పోయి ధాన్యపు కుప్పయొద్ద పండు కొనెను" (రూతు 3:7).

**6. అతడు పవిత్ర హృదయుడు:**

''మధ్య రాత్రి యందు అతడు ఉలికిపడి తిరిగి చూచినప్పుడు, ఒక స్త్రీ అతని కాళ్ల యొద్ద పండుకొని యుండెను. అతడు నీవెవరవని అడుగగా ఆమె, నేను రూతు అను నీ దాసురాలిని, నీవు నా సమీపబంధువుడవు గనుక నీ దాసురాలి మీద నీ కొంగు కప్పుమనగా అతడు నాకుమారీ యెహోవాచేత నీవు దీవెన

నొందినదానవు; కొద్దివారినే గాని గొప్ప వారినేగాని యౌవనస్థులను నీవు వెంబడింపక యుండుటవలన నీ మును పటి సత్ప్రవర్తన కంటె వెనుకటి సత్ప్రవర్తన మరి ఎక్కువైనది" అని చెప్పెను (రూతు 3:8-10).

**7. అతడు రూతు యొక్క మంచి తనమును గుర్తించెను:**

"కాబట్టి నాకుమారీ, భయ పడకుము. నీవు చెప్పిన దంతయు నీకు చేసెదను. నీవు యోగ్యురాలవని నాజను లందరు ఎరుగుదురు'' అని అతడు ఆమెతో చెప్పెను (3:11).

**8. అతడు వాయిదా వేయలేదు**

ఆమెను గూర్చి పెద్దలతో ఉదయమున మాట్లాడుదునని వాగ్దానము చేసిన రీతిగానే అతడు చలించెను (3:12-4:1-9).

**9. ఎలీమెలెకు యొక్క పేరును గూర్చి అతడు గౌరవము ఘనత ప్రదర్శించెను:**

"బోయజు-ఎలీమెలెకునకు కలిగినది యావత్తును కిల్యోనుకును మహ్లోనుకును కలిగినది యావత్తును నయోమి చేతినుండి సంపాదించితినని నేనన్నందుకు మీరు ఈ దినమున సాక్షులై యున్నారు. మరియు చని పోయిన వాని పేరిట అతని స్వాస్థ్యమును స్థిరపరచునట్లును చనిపోయిన వానిపేరు అతని సహోదరులలో నుండియు అతని స్థలము యొక్క ద్వారము నుండియు కొట్టివేయుబడక యుండునట్లును నేను మహ్లోను భార్యయైన రూతును మోయాబీయు రాలిని సంపాదించుకొని పెండ్లిచేసి కొను చున్నాను. దీనికి మీరు ఈదినమున సాక్షులై యున్నారని పెద్దలతోను ప్రజ లందరితోను చెప్పెను'' (రూతు 4:9,10). అందువలన జ్యేష్ఠ కుమారుడు ఎలీమెలెకు సంతతివాడని పరిగణించ బడెను. కుటుంబభూములను బోయజు కొని అవి ఎలీమెలెకు సంతతి వగునట్లు బోయజు పునరుద్ధరించెను.

బోయజు యొక్క జీవితాన్ని, గుణ గుణాలను మనము పరిశీలించు నప్పుడు, అతని మంచి జీవితాన్ని అనుకరించు నట్లు నడిపింప బడాలి.

– స్టేన్ మిచెల్



# అగ్నితో వెడలిపోవుట

## (A Fiery Departure)

**-Betty Tucker**

I రాజులు గ్రంథములో ఇద్దరు దైవజనులను గూర్చి మనము చదువ గలము. వారు ఏలియా మరియు ఎలీషా అనువారు. అది ఇశ్రాయేలులో గొప్ప కరువు కాలము. మూడున్నర సంవత్స రముల మట్టుకు అక్కడ వర్షము కురియ లేదు. నేల ఎంత ఎండిపోయి యుండెనో ఆలోచించగలవా? గడ్డి అంతయు ఎండి పోయెను. పశువులు ఆకలితో చచ్చి పోయెను. భూమి గట్టిపడి పోయినందున దున్నుట కూడ కష్ట మాయెను.

### వృత్తులలో మార్పులు

ఎలీషా వ్యవసాయదారుడు, ఒక్కో దినమందు అతడు 12 జతల యెడ్లతో పొలము దున్నుచుండెను. 12 జతల యెడ్లతో భూమి ఎందుకు దున్నాడంటే- ఒకటి యెద్దులు ఆహారము లేక బక్కచిక్కి యుండెను. రెండు నేల ఆరిపోయి రాయివలె తయారై యుండెను.

ఏలియా స్థానములో పనిచేయు టకు ఎలీషాను ఏర్పరచవలసినదని దేవుడు ఏలియాకు చెప్పియుండెను. ఒకా నొక దినమందు ఎలీషా 12 జతలతో భూమి దున్నుచు ఏలియాకు కనబడెను. ఏలియా మితభాషియై నందున అతడు తన దుప్పటిని ఎలీషా మీదకు విసరెను. దాని భావమును ఇద్దరు ఎరిగినవారే. అప్పటినుండి తాను ఏలియా యొక్క పనిలో భాగస్థుడైనట్లు ఎలీషాకు తెలియును. గనుక ఆనాటినుండి అతడు ప్రవక్తయైన ఏలియాతో కలసి పనిచేయు చుండెను. అతడు ఏలియా యొక్క సేవకు డయ్యెను. తద్వారా తాను చేయ వలసిన సంగతులన్నిటిని గూర్చి తెలిసికొని యుండెను. ఎలీషా ఏలియా యొక్క చేతులమీద నీళ్లుపోయుచుండువాడని బైబిలు చెప్పుచున్నది ( 2 రాజులు3:11). ఒకానొకప్పుడు గొప్ప కార్యములు చేయ గల్గునట్లు ఎలీషా స్వల్ప సంగతులను కూడ చేయ నేర్చుకొన వలసి యుండెను.

### స్వల్ప కార్యక్రమము

ఈ యిద్దరు మనుష్యులు దేవుని సేవకొరకై పనికివచ్చు ప్రవక్తలకు శిక్షణ యిచ్చుచుండిరి. ఏలియా, ఎలీషాలు యిద్దరు కనీసం 10 సంవత్సరములు కలిసి పనిచేసిరి. ఒకానొక ఏర్పాటు చేయబడిన దినమందు ఏలియా వెడలి పోవలసి వచ్చెను. ఏలియా బేతెలుకు ఒంటరిగా వెళ్లుచుండెను. గాని"ఎలీషా- యెహోవా జీవముతోడు నీ జీవముతోడు నేను నిన్ను విడవనని చెప్పగా వారిద్దరును బేతేలునకు ప్రయాణము చేసిరి''

(2 రాజులు 2:2). ఈ యిద్దరు ప్రవక్తలు యోర్దాను నదికి వచ్చువరకు ప్రవక్తల శిష్యులు వారిని కనిపెట్టుచుండిరి. అంతట ఏలియా తన దుప్పటి తీసికొని మడతపెట్టి నీటిమీద కొట్టగా ఆనది ఇవతలకును అవతలకును విడిపోయెను గనుక వారిద్దరు పొడినేలమీద దాటి పోయిరి (2 రాజులు 2:8). ప్రవక్తల శిష్యులు దానిని చూచిరి.

తరువాత ఏలియా ఎలీషాను చూచి, నేను నీ యొద్ద నుండి తీయబడక మునుపు నీకొరకు నేనేమి చేయుదునో దాని నడుగుమని చెప్పెను. ఎలీషా సంకోచించలేదు. “ఎలీషా, నీకు కలిగిన ఆత్మలో రెండు పాళ్లు నామీదికి వచ్చునట్లు దయచేయుమనెను”. (2:10). “అందు కతడు నీవు అడిగినది కష్టతరముగా నున్నది. అయితే నీ యొద్దనుండి తీయబడినప్పుడు నేను నీకు కనబడిన యెడల ఆ ప్రకారము నీకు లభించును” అని చెప్పెను. ఎలీషా అధికారము కొరకు, ధనము కొరకు, ప్రఖ్యాతి కొరకు అడుగవచ్చును గాని అతడట్లడుగలేదు. అతని విజ్ఞాపనలో గొప్ప విజ్ఞానమున్నది.

ఈ దైవజనుని ప్రక్కన అతడు పది సంవత్సరముల మట్టుకు పనిచేసెను. ఏలియా యొక్క పనిని అతడు కొన సాగించాలంటే, ఏలియా కంటె రెట్టింపు శక్తి, ఆత్మ అవుసరమని అతడెరుగును. వారిద్దరు కలిసి నడుచుచుండగా, ఇదిగో అగ్ని రథమును అగ్ని గుర్రములును కనబడి వీరిద్దరిని వేరు చేసెను. అప్పుడు ఏలియా సుడిగాలి చేత ఆకాశమునకు ఆరోహణ మాయెను. (2 రాజులు 2:11). ఏలియా యొక్క దుప్పటి ఎలీషా దగ్గర పడెను. ఎలీషా తన వస్త్రమును రెండు తునకలుగా చేసెను. ఏలియా యొక్క దుప్పటి తన వద్ద యున్నందున తన వస్త్రము ఎలీషాకు ఇప్పుడు అవుసరం లేదు. ఏలియా ప్రవక్త ఆకాశమున కెక్కిపోవుట అతడు చూచి నందున అతని ఆత్మను రెండింతలు తాను పొందినట్లు ఇప్పుడు ఎలీషా ఎరుగును.

ఎలీషా ఆ దుప్పటి పట్టుకొని యోర్దాను నీటిమీద కొట్టెను. ఆ నది రెండుగా విడిపోగా, ఎలీషా అవతలి యొడ్డునకు పోయెను. అతని శిష్యులు దీనినంతటిని పరికించిరి గనుక ఏలియా యొక్క రెండింతల ఆత్మను ఎలీషా కలిగి యుండెనని గుర్తెరిగిరి.

– బెట్టీ టక్కర్



# జెకర్యా - సరియైన తండ్రి

## (Zechariah, The right Kind of Father)

- John Gipson



తండ్రులందరూ సమానముగా సృష్టింపబడలేదు. అజాగ్రత్తగా ఉండే ఇతరులవలె కాక తమ పిల్లలతో ఆనంద ముగా గడిపే మంచి పాత్రను పోషించే తండ్రులూ ఉన్నారు. ప్రేమించే, తనను గూర్చి జాగ్రత్త వహించే తండ్రి గల కుమారుడు ధన్యుడు.

బాప్తిస్మమిచ్చు యోహాను సరియైన తండ్రిని కలిగియున్నాడు. అతని తండ్రి జెకర్యా దేవుని ఎదుట యాజకుడుగా యున్నాడు. విచారకరమైన విషయమే మనగా అందరి తండ్రులు దైవభక్తి కల్గినవారు కారు. కొందరు తమ ఆస్తి, ఆనందము పైనే లక్ష్యము కలిగి యుంటారు. వారియొక్క జీవితములో దేవునికి స్థానము లేదు. అంతేకాక వారిపిల్లలకు నీతిమార్గమును గూర్చి తర్ఫీదునిచ్చే ఆలోచన కూడ ఉండదు. క్రొత్త నిబంధనలో పేరొందిన తిమోతి ఆశీర్వదించబడినవాడు ఎందుకనగా చిన్నతనమునుండి అతనికి పరిశుద్ధ లేఖనములు బోధింపబడెను. క్రీస్తునందు విశ్వాస ముంచుట ద్వారా రక్షణ కలుగునని నేర్పింపబడెను.

సరియైన భార్యగ మరియు తల్లిగా ఎవరైతే ఉండగలరో అలాంటి సాటియైన

సహాయమును ఎంపికచేసికొనుటలో జెకర్యా తెలివైన ఎన్నిక చేసికొనెను. ఆమె కూడ దైవభక్తిగల వ్యక్తి. ఆమె పేరు ఎలీసబెతు. ప్రధాన యాజకుడై అహరోను వంశావళిలో అహరోను కుమార్తెలలో ఒకతె. సరియైన తండ్రి తనభార్యగా ఉండుటకు సరియైన స్త్రీని ఎంచుకుంటాడు.

సరియైన తండ్రి దైవభీతిగల గృహమును పెంపొందించుకుంటాడు. ఈ జంటను గూర్చి లూకా ఈ విధముగా సాక్ష్యమిచ్చుచున్నాడు. "వీరిద్దరు ప్రభువు యొక్క సకలమైన ఆజ్ఞల చొప్పునను న్యాయవిధుల చొప్పునను నిరపరాధులుగానడచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతులైయుండిరి" (లూకా 1:6). వారియొక్క భక్తిగల మాదిరిని గమనిద్దాం. వారి జీవితములు దేవుని సంతోష పరచుచుండెను. వారు నటించుట లేదు. దేవుని దృష్టికి నీతిమంతులై యుండిరి కాని ఇతరుల ఎదుటవారి నీతిని ప్రదర్శించుకొనలేదు.

జెకర్యా ప్రార్థనాపరుడైన తండ్రి. ఈ కుటుంబములో హృదయవిదారకమైన విషయమేమనగా వారికి పిల్లలు లేక పోవుట-మరియు వారిరువురు వయసు మీరినవారు. కాని దేవుడు అసాధ్యమైన దానిని సాధ్యము చేయగలడు. దేవుని ఎదుట యాజకధర్మము చొప్పున ప్రభువు ఆలయములో ధూపము వేయుచుండగా ప్రభువు దూత ప్రత్యక్షమై అతనితో ఈలాగు సెలవిచ్చెను "జెకర్యా భయ పడవద్దు నీ ప్రార్థన వినబడినది. నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును. అతనికి యోహాను అని పేరు పెట్టుదువు" (లూకా 1:13).

యేసు క్రీస్తు ప్రభువు కూడా జెకర్యా, ఎలీసబెతుల కుమారుడైన యోహానును గూర్చి ఈలాగు చెప్పు చున్నారు. "స్త్రీలు కనిన వారిలో యోహాను కంటే గొప్పవాడెవడును లేడు" (లూకా 7:28). ఇది సరియైన తల్లి దండ్రులను కల్గియుండాలి అని తెలియజేయు చున్నది.

– జాన్ గిప్సన్



# దూతల యొక్క శక్తి, వారి పరిమితి

## (The Power and Limitations of Angels)

**- Roy Knight**

దూతల విషయమై అనేక సంగతులు ఆసక్తి జనకమైనవి. ఒక ప్రక్కన దూతలు మానవులలో అనగా అబ్రాహాము, దానియేలు, మరియ, యోసేపు, పౌలు లాంటి వారితో సంభాషించినా, వేరొక ప్రక్కన దూతలు ఈలోక సంబంధులుకారని మన మెరుగుదుము. అందువలన వారిని గూర్చిన సమాచారము కొంత మర్మముగానే యున్నది. ఒక్కోసారి తెరవెనుక జరిగిన సంగతులు మనము చూడగల్గునట్లు లేఖనములు మనకు సహాయపడ్తాయి. దూతలు దేవునితోను మానవులతోను సంప్రదించిన విధానమును బట్టి వీటిని మనము గ్రహించుకొనగలము. అందువలన వారియొక్క శక్తిని, వారి పరి మితులను మనము గ్రహించు కొనగలము.

### దూతలు మానవుల కంటె శక్తిగలవారు

దూతలశక్తి మానవుల శక్తి కంటె గొప్పది గనుక వారు మానవులకంటె శక్తిగలవారని గ్రహించుదాము. మానవుల యొక్కయు దూతల యొక్కయు తారతమ్యమును గూర్చి చెబుతు పేతురు, "దేవదూతలు వారి కంటె మరి అధికమైన బలమును శక్తియు గలవారని" చెప్పెను (2 పేతురు 2:11). దూతలు బలశూరులని దావీదు చెప్పెను (కీర్తన 103:20). అయితే యిది సంసోనువలె కండబలము వంటిది కాదుగాని అది అసాధారణమైనది.

ఆదికాండము 19:10-11లో అక్రమ కామతప్తులైన సొదొమ గొమొర్రా ప్రజలను అంధత్వముతో దూతలు మొత్తిరి. దానియేలు 6:22లో దేవుడు తన దూతను పంపించి సింహముల నోళ్లు మూయించెను. అపొ.కా. 5:17-20లో దేవుని దూత పేతురు బంధింపబడియున్న చెరసాల తలుపులు తెరిచెను. అపొ.కా. 12:7-11లో చెరసాలలో బంధింపబడియున్న పేతురును దేవదూత విడుదల చేసెను. చెరసాలలో పేతురు రెండు సంకెళ్ళతో బంధింపబడి యుండగా ప్రభువు దూత పేతురును తట్టి లేవదీసి అతనిని చెరసాల వెలుపలికి నడిపించెను. హేరోదు రాజు దేవుని మహిమ పరచనందున ప్రభువు దూత అతని మొత్తెను గనుక పురుగులు పడిచచ్చెను (అపొ. 12:23-24). అపొ.కా. 27:23-24లో దేవుని దూత పౌలుకు కనబడి, అతడున్న ఓడ అలలపై కొట్టుమిట్లాడుచుండగా తదుపరి సంఘటనలను బయలు పరచెను.

అసాధారణమైన శక్తితో నింప బడినను దూతలు క్రైస్తవులు కూడ దేవుని సేవ కొరకు ఆసక్తిగల ఆత్మలు. యోహాను కును దేవుని దూతకును మధ్య జరిగిన సంభాషణను ప్రకటన గ్రంధము నుండి ఇప్పుడు గమనించుదాము: “అందుకు నేను అతనికి నమస్కారము చేయుటకై అతని పాదముల యెదుట సాగిలపడగా అతడు వద్దు సుమీ, నేను నీతోను యేసునుగూర్చిన సాక్ష్యము చెప్పు నీ సహోదరులతోను సహదాసుడను; దేవునికే నమస్కారము చేయుము'' (ప్రకటన 19:10). బలములోను శక్తి లోను వేర్వేరుగ యుండినను, దేవుని సేవార్థమై దేవదూతలును మనమును ఒకే టీమ్‌లో యున్నాము.

## దూతలు నిత్యజీవము గలవారు

దూతల యొక్క నిత్యతత్వాన్ని గూర్చి కూడ మనము తెలిసికోవాలి. దూతలు నిత్యులా? అవును, కాదు! దేవుని వలె వారు నిత్యులు కారు. ఏలయనగా దేవుడు ఆద్యంతములు లేనివాడు. దూతలు సృష్టింపబడిన వారు గనుక వారికొక ఆదియున్నది. ''ఆకాశవాసు లారా, యెహోవాను స్తుతించుడి. ఉన్నత స్థలముల నివాసులారా, ఆయనను స్తుతించుడి. ఆయన దూతలారా మీ రందరు ఆయనను స్తుతించుడి. యెహోవా ఆజ్ఞ ఇయ్యగా అవి పుట్టెను ” అని కీర్తన 148:1-5లో వ్రాయబడి యున్నది. “ఏలయనగా ఆకాశమందున్న వియు భూమియందున్నవియు దృశ్య మైనవిగాని అదృశ్యమైనవిగాని అవి సింహాసనము లైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను సర్వమును ఆయన యందు సృజింప బడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను” (కొలస్స 1:16). దీనిలో దూతలుకూడా మిళితమై యున్నారు. మరల మన ఆత్మవలె దేవదూతల ఆత్మలు కూడ అంతములేనిదై యుండును. “వారు పునరుత్థానములో పాలివారై యుండి దేవదూత సమానులును దేవుని కుమా రులునై యుందురు గనుక వారికను చావనేరరు” అని యేసు చెప్పెను (లూకా 24:36). దేవదూతలు మరణించరు అనే భావం ఇక్కడ వ్యక్తమగుచున్నది.

## దూతల శక్తి పరిమితి గలది

దూతలు శక్తిగలవారే అయినా, వారి శక్తి పరిమితి గలది యని లేఖన ములు సూచించుచున్నవి. వారు సర్వము ఎరిగిన వారు కాదు. దేవుడు సర్వ జ్ఞానియే. యేసు ఇట్లు చెప్పెను: “అయితే ఆదినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే ఎరుగును గాని యే మనుష్యుడైనను పరలోక మందలి దూతలైనను ఎరుగరు'' (మత్తయి 24:36). వారి పరిమితిని గూర్చి పేతురుకూడ ఇట్లు భావించాడు: ''పరలోకము నుండి పంప బడిన పరిశుద్ధాత్మ వలన మీకు సువార్త ప్రకటించిన వారి ద్వారా మీకిప్పుడు తెలుపబడిన యీ సంగతుల విషయమై తమకొరకు కాదుగాని మీ కొరకే తాము పరిచర్య చేసినారను సంగతి వారికి

బయలు పరచబడెను. దేవదూతలు ఈ కార్యము లను తొంగి చూడగోరు చున్నారు"(I పేతురు 1:12). దేవదూతలు తొంగి చూడ గోరుచున్నారనుటలో వారు సమస్తము ఎరిగినవారు కాదని గ్రాహ్య మగు చున్నది.

దేవదూతలు సర్వాంతర్యాములు కూడ కాదని లేఖనములు బోధించు చున్నవి. దానియేలు ఇట్లనుచున్నాడు: "నేను ఈలాగున మాటలాడుచు ప్రార్థన చేయుచుండగా, మొదట నేను దర్శన మందు చూచిన అతిప్రకాశమానుడైన గబ్రియేలను ఆ మనుష్యుడు సాయంత్రపు బలి అర్పించు సమయమున నాకు కన బడి నన్ను ముట్టెను" (దానియే 9:21). దానియేలు 10:11లో అతడు నేను నీయొద్దకు పంపబడితినని చెప్పెను. 13,14 వచనములలో నేను పారసీ కుల రాజుల సముఖమున నిలుచు చుండగా యనియు, నీకు తెలియజేయు టకు వచ్చితిననియు చెప్పబడిన మాట లను బట్టి దూతలు అన్నిచోట్లా ఒకే సమయమందున్న వారు కాదని గ్రహించు కోగలము. వారి జ్ఞానములోను, ఉనికి లోను, శక్తిలోను దూతలు పరిమితిగల వారే.

## దూతలు దేవునికి లోబడియుందురు

దీనిని మనసులో యుంచుకొని దూతలు దేవునికి లోబడి యుందురా? యని మనం అడుగవచ్చును. దీనికి అవును, కాదు అని కూడ జవాబీయ వచ్చును. మనుష్యమాత్రులమైన మనకు దేవుడు ఎంపిక శక్తి నిచ్చారు. ఒక ప్రక్కన దూతలు దేవుని పరిచర్య చేయువారు. యోహాను దూత యెదుట నమస్కారము చేయగా, నాకు కాదు దేవునికే నమ స్కారము చేయుమని ఆదూత చెప్పెను (ప్రకటన 22:9). దూతలు దేవుని మాటను విని ఆయన ఆజ్ఞను నెరవేర్తురు. దూతలు దేవుని చిత్తము నెరవేర్చు ఆయన పరిచారకులు (కీర్తన 103:21). మరొక ప్రక్కనయితే కొందరు దూతలు తమ స్వేచ్ఛనుపయోగించి ఆయనకు గాక సాతానుకు లోబడిన వారున్నారు. "తమ ప్రధానత్వమును నిలుపుకొనక తమ నివాసస్థలమును విడిచిన దేవదూతలను" దేవుడు నిత్య పాశములతో బంధించి యుంచినట్లు యూదా వ్రాసాడు (యూదా 1:6). అందుకే నిత్య నరకము "అపవాది కిని వాని దూతలకును సిద్ధపరచబడిన" ప్రదేశమని యేసుచెప్పెను (మత్త 25:41). అపవాదిని వెంబడించిన దూతలు ఒకప్పుడు దేవుని దూతలే. ఒకప్పుడు వారు దేవునికి లోబడినా ఇప్పుడు ఆయనను వ్యతిరేకించు దూతలు.

దేవుని స్తుతించి ఘనపరచడానికి, ఆయన చిత్తము నెరవేర్చడానికి కోట్ల కొలది దూతలు క్రైస్తవులతో కలిసి పని చేయుచున్నారు (ప్రకటన 5:11). ఈ లోకాంతము సంభవించినప్పుడు మనము నిత్యత్వములో ప్రవేశించి కోటానుకోట్ల దూతలతోను పరిశుద్ధులతోను దేవునికి స్తోత్రగానములు చేయుదుము గాక!

– రోయ్ నైట్

# దేవదూతల తరగతులు లేక స్థాయి

## (Classification of Angels)

**- Terry Gunnels**



దేవదూతలను గూర్చి పాత నిబంధనలో 108 మారులు, క్రొత్త నిబంధనలో 186 మారులు చెప్ప బడినది. బైబిలులోని 66 పుస్తకములలో 34 గింటిలో వారిని గూర్చి చెప్పబడినది. వారిని గూర్చి అక్కడవున్న సందర్భాను సారముగానే చెప్పబడినది గనుక వారి యొక్క స్థాయిలను (Rank ను) నిర్థారించుటకు వీలుపడదు.

పరిశుద్ధ గ్రంథము సంపూర్ణము చేయబడిన తరువాత వ్రాయబడిన సంగతులను కొంత జాగ్రత్తగానే పఠించ వలెను. దేవదూతల యొక్క స్థాయి, వాటి రేంక్ వగయిరా నిర్ధారించ బడిపోయినది. అది మొదటి శతాబ్ధము తోనే ముగిసింది. అది మార్పులేనిది. బైబిలులో మాత్రమే అది కనబడును. ఇందు విషయమై ఆధునిక భావార్థములు, వివిధ అభిప్రాయములను మనము విశ్వసించ లేము, అంగీకరించలేము.

తోమస్ అక్వినాస్ అనునతడు పురాతన సంఘనాయకుడు, బైబిలు పండితుడు. అతడు తొమ్మిది స్థాయిలలో దూతలున్నారని చెబుతూ వారిని 3 గుంపులుగా విభజించాడు. అక్వినాస్ చెప్పిన సంగతులు చాలమట్టుకు లేఖనార్ధ మైనవే.

దూతలలో అత్యున్నత స్థాయి గలవారు దేవునికి దగ్గిరగా యున్నవారు: సెరూబులు (యెషయా 6:2), కెరూబులు (ఆది.కా. 3:24; యెహెజ్కేలు 10:1-22), సింహాసనములు (కొలస్స 1:16).

మధ్యస్థస్థాయిగల దూతలు ప్రభుత్వము చేయువారు లేక ప్రభుత్వ ములు: ప్రభుత్వములు (కొలస్స 1:16), అధికారులు (I పేతురు 3:22), శక్తులు (కొలస్స 1:16; I పేతురు 3:22).

మూడవస్థాయి దూతలు వారి పనిని బట్టి ఏర్పరచబడినవారు. ప్రధానులు (కొలస్స 11:16), ప్రధాన దూతలు (I థెస్స 4:10), మరియు సాధారణ తరగతికి చెందిన దూతలు.

## బైబిలు ప్రకారమైన దూతలస్థాయి

బైబిలులో మనకు ప్రధానముగా కనబడు దూతలస్థాయి రెండు విధములు: మంచిదూతలు, చెడుదూతలు. దూతలలో వివిధస్థాయిలు గలవారు న్నారని దిగువ లేఖనము వలన తెలిసి కొనగలము. ముఖ్యముగా కొలస్స 1:16ను మనం గమనించాలి. దూతల యొక్క వివిధ స్థాయిలను గూర్చి పౌలు ఎక్కువ చెప్పుట జరిగినది. రోమీయులకు (రోమా 8:38), కొరింథీయులకు (I కొరింథీ 15:24); ఎఫెసీయులకు (ఎఫెసీ 1:21; 3:10; 6:12) కొలస్స యులకు (కొలస్స 1:16; 2:10,15) వ్రాసిన పత్రికలలో వారిని గూర్చి పౌలు వ్రాసాడు.

## మంచి దూతలు

ప్రభుత్వ పరమైన బాధ్యతలు అప్పగింపబడిన దూతలు నాలుగు రక ములుగా ఉన్నారు. **సింహాసనములు**- సింహాసనములపై యుండు దూతలను గూర్చి చెప్పబడి నట్లున్నది.

**శక్తులు**- యితరులమీద తమశక్తిని అధికారమును ఉపయోగించు దూతలను గూర్చి బహుశ చెప్పబడినది. ప్రధానులు, పాలించువారిని గూర్చి చెప్పబడినవి మరియు అధికారములు, రారాజు దరపున అధికారము చేయుదూతలను గూర్చి బహుశ చెప్పబడి యున్నది.

సామాన్య దూతలు సాధారణముగా దేవుని వార్తావాహులు వారు అసంఖ్యాకులు. వారి మధ్య తరగతులున్నట్లు ఎన్నడు చెప్పబడలేదు. వారు మిగతా దూతల కంటె దిగువస్థాయి గలవారుకాదు.

కెరూబులు పరదైసుకు పోవు మార్గమునకు కాపలా కొరకు యుంచ బడిన దూతలు (ఆదికా 3:24). కరుణా పీఠముపై ఒకదానికొకటి ఎదురుగా యుంచబడిన దూతలు అవి (నిర్గమ 25:19). దేవుడు వాటిపై నెక్కి భూమి మీదికి వచ్చును (2 సమూ 22:11). కెరూబులు ఒక్కొక్క దానికి నాలుగు రెక్కలును, అగ్నిజ్వాలల వంటి ఖడ్గమును కలిగి యుందురు. దేవుని సముఖ మందు వారు ముఖ్యముగా యుందురు.

సెరాపులును గూర్చి యెషయా 6:2,6లో మాత్రమే చెప్పబడెను. వీటికి ఆరేసి రెక్కలుండును. బలిపీఠము మీద నుండి కారు నిప్పును తీసికొని యెషయా పెదవులకు తగిలించిన దూత సెరాపులలో ఒక్కడే.

ప్రధాన దూతలు బైబిలులో రెండు సార్లు మాత్రమే చెప్పబడెను. I థెస్స 4:16 ప్రకారము క్రీస్తు యొక్క రెండవరాకడను ప్రధానదూతలు ప్రకటించెదరు. యూదా 9వ వచనములో మిఖాయేలను ప్రధాన దూతను గూర్చి చెప్పబడెను. మిఖాయేలును గూర్చి దానియేలు 10:13, 21 లోను, ప్రకటన 12:7 లోను చెప్పబడినది.

దేవుని పరిచర్యలోయున్న దూతలలో ఒకడగు గబ్రియేలు కూడ ప్రధాన దూత యని అగుపడుచున్నది. యోహాను యొక్క జననమును గూర్చి చెప్పుటకు అతడు వినియోగించబడెను (లూకా 1:11-20). కన్యయైన మరియ గర్భము ధరించి రక్షకునికి జనన మిచ్చునని చెప్పుటకు దేవుడు గబ్రియేలును మరియ దగ్గరకు పంపెను (లూకా 1:26-28).

**చెడు దూతలు**

చెడుదూతలు తమ స్వేచ్ఛను వినియోగించి దేవుని చిత్తానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినవారు. ఒకప్పుడు వారు మంచి దూతలే గాని వారు పాపము చేసిన తరువాత కటిక చీకటిగల బిలములో బంధింపబడి యుంచబడిరి (2 పేతురు 2:4; యూదా:6).

చెడుదూతలందరు బహుశా బంధకములలో లేరు. ఇంకా కొందరు దేవుని చిత్తానికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేయుచున్నారు (ప్రక 12:7-9).

**ముగింపు**

దేవదూతల యొక్క వివిధ స్థాయిలను గూర్చి సాధారణముగా తెలిసికొనుట తేలిక కాదు. మనం గ్రంథాన్ని లోతుగా పరిశీలించి తెలిసికోవాలి. బీదవాడైన లాజరు చనిపోయినపుడు దేవదూతలు అతనిని పరదైసుకు కొనిపోయారు. దేవదూతలు చేయు సంగతులన్నియు మనము ఎరుగక పోయినను, మన అంతిమ గమ్యాన్ని చేరుకొనుటకు వారు మనలను తీసికొని వెళ్లుదురనే తలంపు ఆదరణ కలిగించు నట్టిదే.


– టెర్రీ గన్నెల్స్



# క్రైస్తవులు యూదుల కేలండర్‌ను అనుసరించవలెనా?

## (Should Christians Follow the Jewish Calendar?)

**- Alan Webster**



యూదుల యొక్క దినము మధ్య రాత్రి నుండి మధ్య రాత్రి వరకుగాక, సాయంత్రము నుండి సాయంత్రము వరకు లెక్కింపబడును. యూదుల యొక్క దినము 6-00P.M. కు ఆరంభమగును. గాని మనదినమైతే మధ్యరాత్రి 12.00 గంటలకు ఆరంభమగును. ఆధునిక ప్రపంచము రోమనుల కాలమానమును బట్టి నడుచుచున్నది.

సృష్టి జరిగిన సమయమును బట్టి యూదుల దినకాలము నిర్ణయించ బడినది. సాధారణముగా పగలు 12 గంటలనియు, రాత్రి 12 గంటలనియు (యోహాను 11:9) వారు పరిగణింతురు. "అస్తమయమును ఉదయమును కలుగగా ఒక దినమాయెను" అను దానిని బట్టి యూదుల దినము సాయంకాలమున ఆరంభ మగును.

అందువలన యూదుల కేలండర్‌లో వివిధ కాల వలయములు (Time Zones) లకు స్థానము లేదు. అయితే భూమి చుట్టూ అస్తమయము ఆయా కాలవలయ ములలో సంభవించుటచేత ఆయా ప్రాంతములలో కాలము దానిని బట్టి పరిగణించబడుచున్నది. యిది మానవ కల్పిత ప్రమాణము కాదు.

ఇందును బట్టి క్రైస్తవులు శనివారం రాత్రి దేవుని ఆరాధించినను అది లేఖ నార్ధమై యుండునని కొందరి భావన. అది ఆదివారం ఉదయము వలనే లేఖ నార్ధమగునని వారు తలంతురు. యిది వాస్తవమా?

### క్రైస్తవుల ఆరాధన దినము ఆదివారము

క్రైస్తవుల ఆరాధన దినము ఆదివారము అని లేఖనముల నుండి మనము సులువుగా గ్రహించుకొన గలము.

1. క్రీస్తు శిష్యులు మొదట్లోనే ప్రభువుదినమందు కూడుకొను చుండిరి (యోహాను 20:19,26). దీనిని బట్టి వారు ఆదివారమున కూడుకొను చుండిరి

యని గ్రాహ్యమగుచున్నదని రోబర్ట్‌సన్ అను చరిత్రకారుడు తెలియజేయు చున్నాడు. యూదుల ఆచార ప్రకారము క్రీస్తు శిష్యులు సబ్బాతు దినమందు కూడు కొనుటలేదనునది విదితము. 1500 సంవత్సరముల మట్టుకు నడుచుచున్న ఆచార ప్రకారముగాక వారిలో ఈ మార్పు ఎందుకు సంభవించినది? శనివారమున గాక ఆదివారమున ఎందుకు కూడు కొనుచుండిరి? యేసు ఆదివారమున మృతులలో నుండి లేచెను! అందువలన!!

2. క్రీస్తు సంఘము ఆదివారమున స్థాపించబడెను. గనుక దాని ఆరాధన వారములో మొదటి దినమున ఆరంభించ బడెను. (అపో.కా. 2:1). పరిశుద్ధాత్ముడు అపొస్తలులపై ఆదివారమున దిగెను. గనుక అదేదినమున సంఘము ఆరంభమాయెను (మార్కు 9:1; అపో.కా. 1:8; 2:1-47).

3. త్రోయలో యున్న సంఘము ఆదివారమున కూడు కొనుచుండిరి (అపో.కా. 20:7). పౌలు వారితో ఆ దినమున సమావేశమాయెను. పౌలు యొక్క మూడవ సువార్త యాత్రలో యెరూషలేముకు పెంతెకోస్తునాటికి చేరుకొనవలెనని ఆతురపడుచు ఎఫెసుకు వెళ్లుటకు సమయము చాలక యుండెను (అపో.కా. 20:16). గాని త్రోయలో యున్న శిష్యులతో ఆదివారమున రొట్టె విరుచుటకు గాను 7 దినములు అక్కడ గడిపెను (అపో.కా. 20:6-7). ఎందు వలన? ఆ దినమున శిష్యులందరు ఆరాధనకు కూడు కొందురు.

వారములో మొదటి దినము (ఆదివారము)ను సూచించుటలో వారు ప్రతివారము కూడు కొనుచున్నట్లు అర్థమగుచున్నది. సాయంకాలమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు అనియుంటే అది అనుదినము జరిగే చర్యయగును. లేదా నెలలో 15వ దినమున అని యంటే వారు నెలకొకసారి కూడుకొనుచుండిరియని అర్థము. గాని ఈ లేఖన భాగము "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు" అని యన్నప్పుడు అది ప్రతివారములో మొదటి దినమున జరుగుచుండిన యట్లు నిర్ధారణ యగు చున్నది.

4. సంఘ ఖజానా లోనికి ప్రతి ఆదివారమున వారు చందా పోగు చేయు చుండిరి (I కొరింథీ 16:2).

5. సంఘము ఆరంభమైన మొదటి అనేక శతాబ్దముల వరకు క్రైస్తవులు ఆదివారమున ఆరాధనకు కూడుకొను చుండిరి యని లిఖితపూర్వక చరిత్ర చెప్పుచున్నది. "క్రైస్తవులందరు ఆదివార దినమును ఆరాధన దినముగా ఏక గ్రీవముగా అంగీకరించిరి. ఆ దినమున మన రక్షకుడు విజేయుడై మృతులలో నుండి లేచెను. ఆదినమున బహిరంగ ఆరాధన జరిగించబడేది" (మోషీమ్).

క్రీ॥శ 115వ సంవత్సరములో ఈ హెచ్చరిక ఈయబడెను: "ప్రభువు దినమందు అందరు కూడుకొని రొట్టె విరుచుడి. మీ పాపములను ఒప్పు కొనుచు కృతజ్ఞత చెల్లించుడి" (Didache, XIV)

.క్రైస్తవులు సబ్బాబతును ఆచరించుట లేదు గాని ప్రభువు దినమును ఆచరించు చుండిరి. ఆ దినము ప్రభువు తిరిగి లేచిన దినము అని ఆదిమ సంఘ నాయకుడు ఇగ్నేషియస్ చెప్పెను. "గనుక మనము ఎనిమిదవ దినము (ఆదివారము) నాచరింతము. అది మన ప్రభువు మృతులలో నుండి తిరిగి లేచిన దినము" అని బర్నబా వ్రాసిన పత్రికలో వ్రాయబడి యున్నది. పురాతన ప్రపంచములో ఆదివారము పనిదినమే అయినను, ఆదినమును శిష్యులు ఆరాధన దినముగా ప్రత్యేకించిరి. అది ప్రభువు దినమని పిలువ బడెను (ప్రకటన 1:10).

**రెండవదిగా, యూదుల కాల మానమును పాటిస్తే మన గడియారము లన్నీ మధ్య ప్రాచ్య కాలమానమును బట్టి యుండాలి.**

యెరూషలేములో ఆదివారం సాయంత్రం 6.00 గంటలగును. ఈ భూగోళములో ఒకడు ఎక్కడవున్నా ఇంచు మించు 12 గంటలు తేడా కన బడును. ఈ వాస్తవాన్ని యేసు తన రెండవ రాకడ సందర్భముగా గుర్తించారు. ఆయన ఆకస్మాత్తుగా రెండవ సారి వచ్చుసరికి భూమిపై పగలు, రాత్రి కూడ అగును (మత్తయి 24:40-41; లూకా 17:34). ఒకడు యూదుల కాలమాన ప్రకారము శనివారం సాయంత్రం 6 గంటలకు ఆరాధన సమయం మార్చుకొంటే, మిగతా అన్ని విషయాలలోను అతడు యెరూషలేము కాలమాన ప్రకారము సవరించుకోవాలి. గాని అమితమైన దేవుని జ్ఞానము ఆది వారమున ఆరా ధించుడియని నప్పుడు, ప్రతివాడు తానున్న ప్రదేశములో యున్న సమయ మును బట్టి ఆరాధించ గలడు.

**మూడవదిగా, యూదా మతము ఎత్తివేయబడెను (రోమా 7:1-7; కొలస్స 2:14; హెబ్రీ 8:6-7). దానితో సబ్బాతు కూడ ఎత్తివేయబడెను:**

పాత నిబంధనలో సబ్బాతు ఒక విశ్రాంతి దినము. అది దేవునిచే పరిశుద్ధ పరచబడెను (నిర్గమ 16:23; 31:15; ద్వితీ 5:14). గాని క్రైస్తవులు సబ్బాతు నాచరించవలసిన పనిలేదని పౌలు చెప్పుచున్నాడు (కొలస్స 2:16; గలతీ 4:9-10; రోమా 14:5), ఆదివారము క్రైస్తవుల సబ్బాతు దినము కాదు. క్రొత్త నిబంధన ఆదివారమునెప్పుడు అట్లు పిలువలేదు.

**నాల్గవదిగా క్రొత్త నిబంధన ఆరాధన దినము యేసుయొక్క పున రుత్థానము నాచరించునది.** యేసు శనివారము రాత్రి గాక, ఆదివారమున మృతులలో నుండి లేచెను. గనుక ఆరాధన ఆదివారముననే జరిగించాలి (మత్తయి 28:1; మార్కు 16:1, 9, లూకా 24:1; యోహాను 20:1).

మృతులలో నుండి తిరిగి లేచిన తరువాత యేసు తన శిష్యులకు ఆది

వారమున పలుమారులు ప్రత్యక్షమాయెను (లూకా 24:1-43; యోహాను 20:19).

**5వదిగా పెంతెకొస్తను పండుగ దినమున మొట్టమొదటి ఆరాధన జరిగించబడెను (అపో.కా. 2:1).**

పెంతెకొస్తు ఎల్లప్పుడు ఆదివారము ననే వచ్చును (లేవీ 23:15-21). ఆదిమ క్రైస్తవులు ఆదివారము ఉదయమున సహజముగా ఆరాధనకు కూడు కొనేవారు. వారెన్నడు శనివారం సాయంత్రం ఆరాధన నిమిత్తము కూడు కొనలేదు.

**ఆరవదిగా, సువార్త యూదా మత ములోగాక సార్వజనిక మతములో యుండుటకు సిద్ధపరచబడినది.**

"మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించుడి" యని యేసు చెప్పెను (మార్కు 16:15; మత్త 28:19). సంఘము యూదుల వాతావరణములో ఆరంభించబడినను, అది యూదా సంస్కృతికి పరిమితము చేయబడు నట్లుగా ఉద్దేశించ బడలేదు (కొలస్స 2:14). సంఘము యూదా సంస్కృతి నుండి రోమన్ సంస్కృతికి వ్యాపించగా, రోమన్ పరిమాణములను అది వాడుట జరిగినది. మొదటి శతాబ్ధపు అంతములో యోహాను యేసు యొక్క జీవిత చరిత్ర వ్రాయు సరికి అతడు రోమా కాల మానమునుపయోగించు చుండెను.

ఉదాహరణకు యోహాను ఇట్లు వ్రాసెను: "ఆదినము పస్కాను సిద్ధపరచు దినము; అప్పుడు ఉదయము ఆరు గంటలు కావచ్చెను. అతడు ఇదిగో మీరాజు అని యూదులతో చెప్పెను" (యోహాను 19:14). మత్తయి ఈ సందర్భమును గూర్చి వ్రాసినది చూడగా (మత్తయి 27:45), యోహాను మత్తయికి వేరుగా సమయాన్ని లెక్కించుచున్నట్లు అర్ధమగును. యోహాను 20:19లో "ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి తాము కూడి యున్న యింటి తలుపులు మూసికొని యుండిరి" యని యున్నది. యిది సాయంత్రం 6 గంటల తరువాతయని మనము గుర్తించవలెను. యోహాను యూదుల సమయమును గాక రోమనుల సమయాన్ని మనకు తెలియజేయు చున్నాడు.

**ముగింపు:**

క్రైస్తవులు ఆరాధనకు, ప్రభురాత్రి భోజనము నాచరించుటకు ఆదివారమున కూడుకొనవలసి యున్నది గనుక, వారు శనివారం సాయంత్రం 6 గంటలకు కూడు కొనవచ్చునా? కానేకాదు. మన కాలమాన ప్రకారము దేవుని వారములో మొదటి దినముననే, ఆదివారముననే గాని శనివారమున ఆరాధించరాదు. ఆదివారము శనివారం రాత్రి 12గంటలకు ఆరంభమగును. వారములో మొదటి దినము ప్రభువు దినము!!

- ఎలెన్ వెబ్‌స్టర్

# ఎవరి విశ్వాసం గొప్పది?

## (Who has the greatest Faith?)

**- Jerry Bates**



నీకు తెలిసిన వారిలో ఎవరి విశ్వాసము అందరికన్నా గొప్పది? సాధారణంగా మా బోధకునిది, సంఘ పెద్దలది లేదా కుటుంబానిది యని చాలా మంది చెబుతారు. తమ బోధకుడు వారి కొరకు ప్రార్థన చేయాలని చాలా మంది కోరుదురు. మిగతావారి కంటె అతని ప్రార్థనలో శక్తి యున్నదని వారు తలుస్తారు. పైన చెప్పుకొన్నవారి విశ్వాసము గొప్పదనే మన ఆశాభావము. అయితే మిగతా వారికంటే వారి విశ్వాసము అంత గొప్పదేమి కాదు. ఏల యనగా బైబిలును పఠించిన మనం అనుకొనని వారి యొక్క విశ్వాసము చాలాసార్లు బలమైనదిగా కనపడును.

ఉదాహరణకు యేసుక్రీస్తు కొందరి విశ్వాసము అల్పమైనదని మూడుసార్లు చెప్పారు. రెండు సందర్భాలలో 12 మంది శిష్యులే అల్పవిశ్వాసులైనట్లు కనుగొనగలము (మత్తయి 8:23-27 16:5-12). మూడవ సందర్భములో నీళ్ళమీద నడుచుచున్న పేతురు మనకగు పడ్డాడు (మత్తయి14:22-36). యిది ఆశ్చర్యము, ఏలయనగా ఎవరికైనా బలమైన విశ్వాసము వుంటే వారు వీరే అయ్యుండాలి! వారు అనుదినము యేసును వెంబడించుచు ఆయన చేయుచున్న అద్భుతములను చూస్తూ వచ్చారు. అయితే వారి విశ్వాసము తగురీతిగా అభివృద్ధి జెందలేదు. సరిగదా యేసు

కొందరిని తమ విశ్వాసమును బట్టి మూడు సందర్భాలలో కొనియాడారు. లూకా 7:1-10లో ఒక ఉదాహరణ మనకున్నది. రోమా శతాధిపతి యొకడు యేసునొద్దకు వచ్చి తన దాసుని స్వస్థతను గూర్చి యేసుకు మనవి చేసాడు. యేసు నొద్దకు తాను వచ్చుటకుగాని, యేసు అతని ఇంటికి వెళ్లుటకుగానీ తాను పాత్రుడను కానని అతడు ఒప్పుకొన్నాడు. ఇశ్రాయేలులో సయితము అంత గొప్ప విశ్వాసాన్ని తాను కనుగొనలేదని యేసు చెప్పారు. (లూకా 7:9).

రెండవ ఉదాహరణ మార్కు 5:25-34లో వ్రాయబడి యున్నది. ఇక్కడ దీర్ఘకాలరోగియై యున్న ఒక యూదురాలు యేసు తన రోగమును బాగుచేయునని విశ్వసించినది. ఆయన శక్తియందు ఎంత బలముగా నమ్మినదంటే తాను యేసు యొక్క వస్త్రపు చెంగును ముట్టిన చాలు బాగుపడుదునను కొనెను. ఆమె అట్లు చేసి స్వస్థత పొందగా ఆమె యొక్క విశ్వాసము ఆమెను బాగుచేసెనని యేసు చెప్పెను (మార్కు 5:34). ఆమె యొక్క విశ్వాసము గొప్ప దని యేసు చెప్పక పోయినా, ఆయన ఆమె యొక్క విశ్వాసమును శ్లాఘించె ననుట వాస్తవమే.

మూడవ ఉదాహరణ మత్తయి 15:21-28లో వ్రాయబడి యున్నది. కానాను స్త్రీయొకతె యేసు నొద్దకు వచ్చి దయ్యము పట్టి బాధపడుచున్న తన కుమార్తెను స్వస్థ పరచుమని వేడుకొనెను. అందుకాయన ఆమెతో ఒక్క మాట నను చెప్పలేదు. గాని ఆమె పట్టు విడువక ప్రార్థింపగా, ఆమెకోరిన దీవెనను పొందెను. "యేసు అమ్మా నీ విశ్వాసము గొప్పది" అని ఆమెతో చెప్పెను. ఈ మూడు సందర్భములు గమనించుము. రోమా శతాధిపతి, రోగియైయుండి బీద రాలైన యూదాస్త్రీ, మరియు కానానుస్త్రీ, నిజానికి గొప్ప విశ్వాసానికి మాదిరిగా ఇట్టి వారు కనబడరుగదా.

ఈ రెండు గుంపులను పరికించితే మనం యేమి నేర్చుకో గలము? కొందరితో సహవాసము చేసినంత మాత్రమున బలమైన విశ్వాసము చేకూరదు. శిష్యులే యేసుతో సన్నిహితముగా మెలిగినను అల్ప విశ్వాసులుగా అగుపడుచున్నారు. గనుక చాలా కాలము నుండి క్రైస్తవుడనైనందున నా విశ్వాసము గొప్పదని మనం ఊహించ రాదు. నిజానికి బలమైన విశ్వాసము గలవాడు క్రొత్తగా క్రైస్తవుడయినవాడు కావచ్చును.

రెండవది, మనం నేర్చుకోవలసినది యేమంటే గొప్ప విశ్వాసముతో గొప్ప వినయము కనబడును. శతాధిపతి యేసు నొద్దకు వచ్చుటకు తాను పాత్రుడను కానని తలంచాడు. కానాను స్త్రీ యేసు ఎదుట ఒక కుక్కపిల్ల లాంటిదానని తన్నుతాను తగ్గించు కొన్నది. రోగియైన స్త్రీ, యేసుయొక్క వస్త్రపు చెంగు ముట్టితే చాలను కొన్నది. యిది ఇలా గుండగా శిష్యులైతే వారిలో ఎవడు దేవుని రాజ్యములో గొప్పవాడోయని తర్కించు కొనుచుండిరి.

దేవుని గొప్ప సేవకులందరు వినయ

విధేయతలు గలవారు. ఉదాహరణకు బాప్తిస్మమిచ్చు యోహానును గమనించుము. "స్త్రీలు కనిన వారిలో బాప్తిస్మమిచ్చు యెహానుకంటె గొప్పవాడు పుట్టలేదని'' యేసు చెప్పెను (మత్తయి 11:11). యివి శ్లాఘనీయమైన చాలా గొప్ప మాటలు. అయినను యేసును గూర్చి చెబుతు, అతడు "ఆయన చెప్పుల వారును విప్పుటకైనను నేను యోగ్యు డను కానని'' చెప్పెను (యెహాను 1:27). అంతగొప్ప మనుష్యుని నుండి వచ్చిన ఈ మాటలు నిజంగా గొప్పవే.

చివరిగా మనం నేర్చుకోవలసిన గొప్ప పాఠం యేమంటే, గొప్ప విశ్వాస ములో యేసునందు సంపూర్ణ నమ్మిక ఇమిడి యున్నది. సంపూర్ణ నమ్మిక అంటే, ఎన్ని అభ్యంతరములు కలిగినను ఆయనకు విధేయులగుటయే. శిష్యులైతే తరుచు ఈ లోకమువైపు చూస్తూ యుండే వారు. పేతురు యేసువైపు మాని నీటివైపు చూచేవరకు నీళ్ళమీద నడువ గలిగాడు. యేసునందు సంపూర్ణ నమ్మిక కోల్పోయాడు. మునిగిపోయాడు. అయితే దేవుడు మనలను రక్షించును, రక్షించగలడు అని యేసు నిరూపించారు. దానిని మనం నిజంగా నమ్ముచున్నామా? లేక పోతే మనది అల్ప విశ్వాసమే (మత్తయి 6:30).

నిరుత్సాహ ఘడియలలో కూడ మనం యేసునందు విశ్వాస ముంచాలి. మనందరికి అట్టి ఘడియలు సంభవిస్తాయి. గొప్ప విశ్వాసము వలన ఎట్టి అవాంతరాలనైనా అధిగమించ గలము. రక్తస్రావముతో బాధపడుచున్న స్త్రీ గొప్ప జన సమూహములో నుండి సయితము యేసు వస్త్రపు చెంగును ముట్టుకొని గొప్ప విశ్వాసము వలన స్వస్థత పొందినది. అయితే గొప్ప జన సమూహమున్నదని తలంచి ఎంత మంది వెనుకకు పోయారో గదా!

కానాను స్త్రీ తాను అన్యురాలనై నందున యేసు ఆమెను పట్టించు కోవడం లేదనుకొనినను తన పట్టు విడువలేదు. యేసు యొక్క మాటలను బట్టి ఆమె సులభముగా అభ్యంతరపడి యుండేది. గాని తాను ఆశించిన దీవెన పొందకుండా పోయేది. ఎవరో ఏదో అన్నారని అభ్యంతరపడి కొందరు ఆరాధనకు రాకుండా పోతారు. అవి చాల స్వల్పము గాని, వారికి ఘోరంగా కనబడ్తాయి. క్రీస్తు శరీరము నుండి తమ్మును తాము వేరైపోయిపోయినందున అనేక దీవెనల నుండి తమకు తాము వారు వేరై పోవుదురు, చివరికి పర లోకములో నిత్యగృహాన్ని కోల్పోదురు. గొప్ప విశ్వాసము గలవారు దేవునిని, ఆయన కుటుంబమును విడిచిపెట్టరు. మనము కూడ విడిచి పెట్టకూడదు. క్రీస్తుకు నమ్మకముగా యుండుటకు ఎవరెన్ని మాటలు చెప్పినా మనం నిరుత్సాహ పడ కూడదు.

నీ విశ్వాసము ఎంత గొప్పది? నీవు గొప్ప విశ్వాసము గలవాడవు కాగలవు. ఎన్ని అభ్యంతరములు కలిగినా, నీవు విశ్వాసములో బలవంతుడవగుదువు గాక! (2 థెస్స 1:3).

– జెర్రి బేట్స్

# THE FACTS

**Adam and Eve,** for one bite of luscious fruit when they were not even hungry, brought sin, suffering, shame and death upon themselves and the human race. Genesis 3

**Lot's wife,** revealing her longing for the things that pertain to earth, took one look back and became a pillar of salt. Genesis 19

**Achan,** for a garment he could not wear, and for silver and gold he could not spend, paid with all his possessions, his family and his life. Joshua 7

**Samson,** for the caress of a hyprocritical woman, lost his will, his strength, his liberty, his eyes, and finally his life. 2 Samuel 11,12

**Ahab,** coveting another's vineyard, permitted his wife to have its owner killed. 1 Kings 21

**Judas,** for thirty pieces of silver, which he had no occasion or conscience to use, took his own life in shame and despair. Matthew 27

**Demas,** loving the transient world more than a permanent future, forsook Paul and provoked the wrath of heaven. 2 Timothy 4

**The Christian** who seeks first anything above the kingdom of heaven will lose his soul forever. Matthew 6:16

# GOSPEL PREACHING ON TELEVISION & RADIO

Telugu : Subhavartha Channel Sunday 6.00 p.m.
Rakshana Channel Wednesday 6.30 p.m.
Rakshana Channel Thursday 11.00 p.m.
Prema Sakshi T.V. Tirupathi - Every Saturday 7.00 a.m
Satyavani T.V. Online :www.sakthitv.in
every Wednesday & Friday at 8.p.m
Speakers : Ricky, Ronnie & Joshua Gootam

Hindi : Subhasandesh Channel Every Sunday 7.00- 7.30 p.m
Shubhasandesh Channel Tuesday 7.00-7.30 p.m.
Speakers : Francis, Vinay, & Sunny David
P.O. Box. 3815, New Delhi - 110049.

Malayalam : Jai Hind Channel Saturday 6.00-6.30 a.m.
Speaker : P.K. Varghese

Tamil : Tamilan T.V. Tuesday 9.30-9.45 p.m
Sunday 6.45-7.00 p.m.
Holy Cross T.V. Sunday 6.30-6.45 a.m(Only in Puducherry)
King of Glory T.V. Sunday 6.15-6.30 a.m (in Tirunelveli Dist.)
Speakers : Philemon & Kingsley

Tamilan T.V. Monday 7.00-7.15 a.m
Thursday 9.30-10 p.m.
Saturday 7.15-7.30 a.m
Speaker : Rajanayagam

Tamilan T.V. Monday 6.00-6.15 a.m,
Saturday 6.15-6.30 p.m.
Speaker : Arjunan

**TAMIL RADIO PROGRAMS FROM SRI LANKA RADIO**
Sunday to Wednesday 5.30 -5.45 p.m.
Speakers : Douglas & P.R. Swamy
Saturday 5.30-5.45 p.m., Speaker : Arjunan

Please write to these addresses for Bible correspondence courses, Magzines, and other Christian literature in your language.

All of these Programmes are sponsored
by
CHURCH OF CHRIST